ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 20.07.2026 | సంపుటి :12 సంచిక : 361 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# సమన్వయం మంత్రులదే బాధ్యత



## నేతలెవరూ ఆగస్టు 3వరకు గాంధీభవన్‌కు రావొద్దు

సోమవారం నుంచి పది మంది ఇన్‌ఛార్జి మంత్రులు అన్ని జిల్లాల్లో ఎస్ఐఆర్‌పై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఎంపీలు కూడా ఎప్పటికప్పుడు సమీక్షలు కొనసాగించాలిజ ఇన్‌ఛార్జీలుగా ఉన్న చోట ఎంపీలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు. ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించడం కాంగ్రెస్ పార్టీకి వచ్చిన కీలక అవకాశం, ప్రతి నాయకుడు దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. వెనుకబడిన నియోజకవర్గాల్లో ఇప్పటికైనా చురుకుదనం చూపించాలి. ఛైర్మన్, ఇతర పదవుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరిగే నాయకులకు ఇకపై అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దు. ఆగస్టు 3 వరకు ఎవ్వరూ గాంధీభవన్‌కు రావొద్దు


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- పదవుల కోసం వచ్చే వారికి అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దు
- కొందరు నేతలు హైదరాబాద్‌లో కూర్చొని పనిచేయట్లేదని అసహనం
- 'సర్' పొడిగించినందున అన్ని నియోజకవర్గాల్లో విస్తృతంగా సమావేశాలు జరపాలి
- ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో ఉన్నా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలి
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- 'సర్'పై నిర్వహించిన జూమ్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): ఛైర్మన్, ఇతర పదవుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరిగే నాయకులకు ఇకపై అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దని, రేపటి నుంచి ఆగస్టు 3తేదీ వరకు ఎవ్వరూ గాంధీభవన్‌కు రావొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ అంశంపై కాంగ్రెస్ పార్టీ నాయకులతో నిర్వహించిన జూమ్‌సమావేశంలో పార్టీ నాయకత్వానికి ఎస్ఐఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. సోమవారం నుంచి పది మంది ఇన్‌ఛార్జి మంత్రులు అన్ని జిల్లాల్లో ఎస్ఐఆర్‌పై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారని, పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఎంపీలు కూడా ఎప్పటికప్పుడు సమీక్షలు కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇన్‌ఛార్జీలుగా ఉన్న చోట ఎంపీలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించడం కాంగ్రెస్ పార్టీకి వచ్చిన కీలక అవకాశమని, ప్రతి నాయకుడు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇప్పటికే 489 సమావేశాలు నిర్వహించినప్పటికీ, వెనుకబడిన నియోజకవర్గాల్లో ఇప్పటికైనా చురుకుదనం చూపించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. పార్టీ పరంగా ఎస్ఐఆర్ ఇన్‌ఛార్జీలుగా పనిచేస్తున్న నాయకులు పరస్పర సమన్వయంతో ముందుకెళ్లాలని, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, ఛైర్మన్లు బీఎల్ఓల నివేదికల కంటే బీఎల్ఏల నివేదికలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. కేవలం బీఎల్ఓల నివేదికలపైనే ఆధారపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ తరఫున పనిచేస్తున్న బీఎల్ఏలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని,

మిగతా 2లో..

# జపాన్ ఓపెన్ విజేత పీవీ సింధు



- ఫైనల్‌లో ఆ దేశ స్టార్ ప్లేయర్ యమగుచిపై విజయం
- ఈ ఘనత సాధించిన తొలి భారత షట్లర్‌గా రికార్డు
- అభినందించిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి రేవంత్



టోకో(జనంసాక్షి):స్టార్ షట్లర్ పీవీ సింధు సరికొత్త చరిత్ర సృష్టించింది. జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ విజేతగా నిలిచింది. ఫైనల్‌లో జపాన్‌కు చెందిన స్టార్ ప్లేయర్ యమగుచిపై వరుస గేముల్లో సింధు గెలిచింది. ఆరంభం నుంచి ఆధిపత్యం ప్రదర్శించిన సింధు 21-17, 21-17 తేడాతో యుమగుచి ని ఓడించింది. ప్రతి గేమూ చివరి వరకూ హోరాహోరీగానే సాగింది. అయితే, ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా 50 నిమిషాల్లోనే సింధు మ్యాచ్‌ను ముగించింది.యమగుచిపై సింధుకు ఘనమైన రికార్డేమీ లేదు. 2026లో ఈ మ్యాచ్ కాకుండా మరో మూడింట్లో ఇరువురూ తలపడ్డారు. అందులో రెండుసార్లు యుమగుచినే విజయం సాధించింది. మలేషియా ఓపెన్‌లో యమగుచి మధ్యలోనే రిటైర్డ్ హర్ట్‌గా వెళ్లడంతో సింధుకు విజయం వరించింది. థాయ్‌లాండ్ ఓపెన్ క్వార్టర్స్‌లో సింధుపై యమగుచి గెలిచింది. అలాగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ ఈ జపాన్ ప్లేయర్‌దే విజయం. దీంతో ఇప్పుడీ ఫైనల్‌లో పీవీ సింధుపై కాస్త

మిగతా 2లో..

# క్యూర్‌పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

## లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం

- తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు
- పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

: మంత్రి పొంగులేటి

హైదరాబాద్(జనంసాక్షి):హైదరాబాద్‌లోని పేదల సొంతింటి కలను నిజం చేయబోతున్నట్లు గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు 'క్యూర్' పరిధిలో లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం శ్రీకారం చుట్టబోతున్నట్లుగా పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తు విధానం, అర్హతలు, బ్రోచర్?ను సోమవారం విడుదల చేయనున్నట్లుగా వెల్లడించారు. నగరంలో తొలివిడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్ల నిర్మాణానికి కోట్ల రూపాయల విలువైన ప్రాంతాలను గుర్తించినట్లుగా వివరించారు.అధునాతన సౌకర్యాలతో పది అంతస్తుల భవనాల నిర్మాణం

మిగతా 2లో..



## సాగునీటి విషయంలో మాకు ఎలాంటి
# భేషజాలు లేవు

ఎన్డీఎస్ఏ చెప్తే తప్పకుండా మేడిగడ్డ, కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోస్తాం

గతప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా ఎవరు అడ్డుకున్నారు?: మంత్రి శ్రీధర్‌బాబు



కరీంనగర్(జనంసాక్షి): ప్రతి జిల్లాలో ఎల్‌నినో సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలపై ప్రణాళికను రూపొందించి అమలు చేస్తామని చెప్పారు. కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి అధికారులతో ఆయన సమిక్ష నిర్వహించారు. వ్యవసాయం, తాగునీరు, వైద్యం, విద్యుత్, విపత్తు నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు మంత్రులు దిశానిర్దేశం చేశారు. సమిక్ష అనంతరం శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. "సాగునీటి విషయంలో మాకు ఎలాంటి భేషజాలు లేవు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) చెప్తే తప్పకుండా మేడిగడ్డ, కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోస్తాం. ఒక్క రోజు లక్ష క్యూసెక్కులు రాగానే విపక్ష నేతలు గోల చేశారు. ప్రస్తుతం గోదావరిలో 16వేల క్యూసెక్కుల వరద కూడా లేదు. యువతను కేటీఆర్ పక్కదోవ పట్టించే యత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 పరీక్షలు నిర్వహించలేదు. పదేళ్లు ఉద్యోగాలు ఇవ్వకుండా ఎవరైనా అడ్డుకున్నారా?రెండున్నరేళ్లలో 70వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పాం.. జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం"అని శ్రీధర్‌బాబు అన్నారు.

## మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై
# లైంగిక వేధింపులు



ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కత్తితో బెదిరించి, అభ్యంతరకర వీడియోలు తీసి బెదిరింపులకు గురేచేశాడని ఆరోపణ

రాజేంద్రనగర్,జూలై19(జనంసాక్షి): దేశంలోనే అత్యున్నత పోలీస్ శిక్షణా కేంద్రమైన హైదరాబాద్ లోని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో ఒక దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ పై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్న తీవ్ర ఆరోపణలపై ఉదయ్ కృష్ణారెడ్డి అనే ట్రైనీ ఐపీఎస్‌పై కేసు నమోదైంది. ఈ ఘటన పోలీస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది .అకాడమీలో శిక్షణ పొందుతున్న ఒక ఐపీఎస్ ప్రొబేషనర్, తన సహోద్యోగి అయిన ఉదయ్ కృష్ణారెడ్డి తనను కొంత కాలంగా వేధిస్తున్నాడని అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు తనకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపడంతో పాటు, మానసికంగా వేధిస్తూ, దుర్భాషలాడుతున్నాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో జూలై 9న నిందితుడు తనను బలవంతంగా ఒక గదిలోకి లాక్కెళ్లాడని, జుట్టు పట్టుకుని మెడపై కత్తి పెట్టి బెదిరించాడని బాధితురాలు ఆరోపించారు. అంతేకాకుండా, ఆమె ప్రైవేట్ వీడియోలను బలవంతంగా చిత్రీకరించి, ఆమె మొబైల్ ఫోన్ లాక్కుని, ఆ వీడియోలను

మిగతా 2లో..

# పార్లమెంట్‌కు కదం తొక్కండి

నేటి మార్చ్‌ను జయవంతం చేయాలని సోనమ్ వాంగ్‌చుక్ పిలుపు

ఆయన రాసిన సందేశాన్ని 'ఎక్స్'లో పోస్టు చేసిన భార్య గీతాంజలి

న్యూఢిల్లీ(జనంసాక్షి):'పార్లమెంట్‌మార్చ్'(పార్లమెంట్ వరకు నిరసన ర్యాలీ)ను విజయవంతం చేయాలని పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ తన మద్దతుదారులకు పిలుపునిచ్చారు. తనను ఆస్పత్రిలో అక్రమంగా నిర్బంధించారని ఆయన ఆక్షేపించారు. దిల్లీలోని జంతర్ మంతర్‌లో 21 రోజులుగా చేపట్టిన నిరాహార దీక్షను భగ్నం చేసిన పోలీసులు.. ఆయన్ని ఆసుపత్రిలో చేర్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెల్లకాగితంపై వాంగ్‌చుక్ రాసిన సందేశాన్ని భార్య గీతాంజలి ఆయన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.కాక్రోచ్ జనతా పార్టీ సోమవారం (జులై 20) చేపట్టదలచిన నిరసన ర్యాలీలో పాల్గొనాలని మద్దతుదారులను వాంగ్‌చుక్ కోరారు. నిర్భయమైన భారత్ సాకారం కావాలని పిలుపునిచ్చారు. తన నిరాహార దీక్షగానీ, కాక్రోచ్ జనతాపార్టీ చేపట్టనున్న 'పార్లమెంట్ మార్చ్'గానీ అన్యాయం నుంచి విముక్తి కోసమేనని ఆయన పునరుద్ఘాటించారు. మరోవైపు 'పార్లమెంట్ మార్చ్'కు పోలీసులు అనుమతి ఇవ్వనట్లు తెలుస్తోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా అనుమతి నిరాకరించినట్లు సమాచారం.వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. నిపుణులైన వైద్యుల బృందం ఆయన్ని నిశితంగా పరిశీలిస్తోందని ఆస్పత్రి



యాజమాన్యం బులెటిన్ విడుదల చేసింది. దీర్ఘకాలం పాటు ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తంలో చిన్నపాటి సమస్యలు తలెత్తాయని పేర్కొంది. మరోవైపు దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు.. అత్యవసర వైద్య సేవలు అందించేందుకే వాంగ్‌చుక్‌ను జంతర్‌మంతర్‌లోని దీక్షా

మిగతా 2లో..

## ఆస్పత్రిలో ఆయనను అక్రమంగా నిర్బంధించారు

ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సోనమ్ వాంగ్‌చుక్ భార్య



## బూతులు, తిట్లు, అసభ్య పదజాలం
# 'అశ్లీలత' కాదు

ఐపీసీ సెక్షన్ 294(బి) పరిధిలోకి రాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ(జనంసాక్షి):బూతు మాటలు, దూషణలు, అసభ్య పదజాలం ఉపయోగించినంత మాత్రాన, అవి ఎంత అభ్యంతరకరంగా లేదా సభ్యత లేనివిగా ఉన్నప్పటికీ 'అశ్లీలత' నేరం కిందకు రావని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. భారత శిక్షా స్మృతి (ఐపీసీ)లోని సెక్షన్ 294 కింద ట్రయల్ కోర్టు తనకు విధించిన శిక్షను హైకోర్టు సమర్థించడాన్ని సవాల్ చేస్తూ ఓ వ్యక్తి సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస విపుల్ ఎం.పంచోలీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం, "కేవలం తిట్టడం లేదా అసభ్య పదజాలం వాడడం మాత్రమే ఐపీసీ సెక్షన్ 294 కింద అశ్లీలత నేరంగా మారదు" అని పేర్కొంది.ఒక మాటను అశ్లీలమైనదిగా పరిగణించాలంటే,

మిగతా 2లో..

# ఆగని బాంబుల వర్షం

ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులు

జోర్డాన్‌పై దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు మృతితో తాజా చర్య చేపట్టినట్లు సీఐఏ వెల్లడి



టెహ్రాన్(జనంసాక్షి):ఇరాన్‌పై అమెరికా ఆదివారం మరోసారి దాడులకు దిగింది. జోర్డాన్‌పై ఇరాన్ చేసిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు మరణించడంతో వీటిని చేపట్టినట్లు అమెరికా వెల్లడించింది. ఇది వరుసగా ఎనిమిదో రాత్రి నిర్వహించిన దాడి అని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. జోర్డాన్‌లో అమెరికా సైనికులపై దాడి చేసిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ బలగాలను దెబ్బతీయడమే ఈ ఆపరేషన్ లక్ష్యమని పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశానుసారమే వీటిని జరిపినట్లు వెల్లడించింది. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు ముప్పు కలిగించే ఇరాన్ సామర్థ్యాన్ని మరింత బలహీనపర్చడమే ఈ దాడుల ఉద్దేశమని పేర్కొంది. అమెరికా దాడులకు ప్రతీకారంగా కువైట్‌లోని రెండు సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడులు నిర్వహించినట్లు ఇరాన్ ఆదివారం ప్రకటించింది. కువైట్‌లోని క్యాంప్ ఉదైరిలో ఉన్న మందుగుండు సామగ్రి నిల్వ కేంద్రంపై, అలీ అల్ సలేం ఎయిర్ బేస్‌లోని పేట్రియట్ రాడార్ వ్యవస్థ, వైమానిక నిఘా రాడార్‌ను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. అమెరికా జరిపిన దాడులకు ప్రతిస్పందనగానే ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు ఇరాన్ సైన్యం వెల్లడించింది.

## చర్చల విషయంలో ఇరాన్ నిర్ణయాన్ని ఖాతరు చేయను

ఆ దేశం అణ్వాయుధాలు తయారు చేయకుండా ఆపడమే మా లక్ష్యం:ట్రంప్

2లో..

## 'వందేమాతరం' గేయాన్ని
# అవమానిస్తే మూడేళ్ల జైలు!

పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):జాతీయ గేయం 'వందేమాతరం'ని అవమానించినా, ఆలపిస్తున్న సమయంలో ఆటంకం కలిగించినా ఇకపై చట్టరీత్యా నేరంగా పరిగణించనున్నారు. ఈ మేరకు పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా తొలిరోజే (సోమవారం) ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. 'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్ టు నేషనల్ హానర్ (సవరణ)-2026' బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టే అవకాశం ఉంది. 1971 నాటి చట్టం ప్రకారం జాతీయ చిహ్నాలతోపాటు జాతీయ జెండా, రాజ్యాంగం, జాతీయ గీతాన్ని అవమానపరచడం చట్టరీత్యా నేరం. దీనికి గరిష్ఠంగా మూడేళ్ల వరకు

మిగతా 2లో..



# కొండచరియలు విరిగిపడి..

## నాగాలాండ్‌లో 8 మంది మృతి

ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల్లో వర్ష బీభత్సం

అమర్‌నాథ్ యాత్ర తాత్కాలికంగా నిలిపివేత

కొహిమ(జనంసాక్షి):నైరుతి రుతపవనాల ప్రభావంతో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో దేశవ్యాప్తంగా సుమారు 30 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. రాబోయే వారం రోజుపాటు ఉత్తర, ఈశాన్య రాష్ట్రాల్లో

మిగతా 2లో..

## పార్లమెంట్‌కు కదం తొక్కండి

స్థలి నుంచి ఆస్పత్రికి తరలించినట్లు దిల్లీ పోలీసులు వెల్లడించారు. సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించిన నేపథ్యంలో, ఆయన్ను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించడం ఏకపక్షమైన నిర్ణయం కాదని దిల్లీ హైకోర్టు తెలిపింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించింది. వాంగ్‌చుక్‌ను నిర్బంధించారన్న వాదనను కూడా న్యాయస్థానం తోసిపుచ్చింది. ఆయన స్వేచ్ఛగానే ఉన్నారని.. ఆసుపత్రిలోని వైద్యులు ఆయన సమ్మతితోనే చికిత్స చేశారని పేర్కొంది. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో వాంగ్‌చుక్‌ను నిర్బంధించారని.. ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

## ఆస్పత్రిలో ఆయనను అక్రమంగా నిర్బంధించారు

### ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సోనమ్ వాంగ్‌చుక్ భార్య

న్యూఢిల్లీ(జనంసాక్షి):పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన భర్తను వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఆయనను అక్రమంగా నిర్బంధించారని పిటిషన్‌లో ఆరోపించారు. ఆయనకు చికిత్స అందించిన వ్యక్తిగత వైద్యులు, న్యాయవాదులను కలిసే అవకాశం కల్పించాలని కోరారు. 21 రోజులుగా కొనసాగుతున్న నిరాహార దీక్షా శిబిరం నుంచి పోలీసులు వాంగ్‌చుక్‌ను శనివారం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించిన సంగతి తెలిసిందే. అక్కడ కూడా ఆయన దీక్ష కొనసాగిస్తున్నారని ఆంగ్మో తెలిపారు. చికిత్స విషయంలో పారదర్శకంగా వ్యవహరించడం లేదన్నారు. సదరు ఆసుపత్రిపై తమకు నమ్మకం పోయిందన్నారు. డిశ్చార్జ్ చేయాలని, ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాలని కోరినా అధికారులు నిరాకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ తనపై ఆంక్షలు విధించారని చెప్పారు. వంద మందికి పైగా పోలీసులు ఆసుపత్రిలో మోహరించారని.. వాంగ్‌చుక్ ఉన్న అంతస్తులోనే 30 మంది సిబ్బంది ఉన్నట్లు పేర్కొన్నారు.

## చర్చల విషయంలో ఇరాన్ నిర్ణయాన్ని ఖాతరు చేయను

వాషింగ్టన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. అవగాహన ఒప్పందానికి ఇరాన్ కట్టుబడి ఉండకపోవడాన్ని పెద్దగా పట్టించుకోనని అన్నారు. అయితే, ఆ దేశం అణ్వాయుధాలు తయారు చేయకుండా నిలువరించాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ మేరకు ఒక న్యూస్ ఛానల్‌తో వ్యాఖ్యానించారు. ఇరుదేశాల మధ్య కుదిరిన ఎంవోయూ నుంచి వైదొలగుతున్నట్లు టెహ్రాన్ చేసిన ప్రకటనపై మీరేమంటారు అని విలేకరి ప్రశ్నించగా.. అలాంటి చర్యలను ఖాతరు చేయబోన్నారు.పాక్ మధ్యవర్తిత్వంతో అమెరికా- ఇరాన్ మధ్య జూన్ నెలలో తాత్కాలిక అవగాహన ఒప్పందం జరిగిన సంగతి తెలిసిందే. 14 పాయింట్లతో కూడిన ఎంవోయూపై ఇరుదేశాల అధ్యక్షులు సంతకాలు చేశారు. ఆ తర్వాత రోజుల వ్యవధిలోనే హర్మూజ్ కేంద్రంగా మళ్లీ ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మొదలయ్యాయి. దాని నిర్వహణపై పట్టు సాధిం చేందుకు అమెరికా, ఇరాన్ ప్రయత్నించడంతో పరిస్థితులు మొదటికి వచ్చా యి. ఈ క్రమంలోనే ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలను అమెరికా లక్ష్యం గా చేసుకోగా.. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను టెహ్రాన్ టార్గెట్ చేస్తోంది.

# సమన్వయం మంత్రులదే బాధ్యత

నాయకులంతా పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండాలని, హైదరాబాద్‌లోనే ఉంటే పనులు సాగవని స్పష్టం చేశారు. వచ్చే పది రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో ప్రతి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ప్రతినిధులకు ఆదేశాలు జారీ చేశారు.గాంధీభవన్ బృందం ఎప్పటికప్పుడు బీఎల్‌ఏ, బీఎల్‌ఓ నివేదికలను పరిశీలించాలని, ఎస్‌ఐఆర్ ప్రక్రియపై ఇన్‌ఛార్జి మంత్రులే పూర్తి బాధ్యత తీసుకోవాలని సీఎం రేవంత్ సూచించారు. ఈ నెల 30వ తేదీన మరోసారి పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించి, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు పరిశీలిస్తామని తెలిపారు. అలాగే పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరింత బాధ్యత తీసుకుని ఇన్‌ఛార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జిల మధ్య సమన్వయం తీసుకురావాలని సూచించారు. ఎస్‌ఐఆర్‌ను ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, అత్యుత్తమంగా పనిచేసే 100 మంది బీఎల్‌ఏలకు రాహుల్ గాంధీని కలిసి ఫోటో దిగే అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. జూమ్ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, ఎస్‌ఐఆర్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## బూతులు, తిట్లు, అసభ్య పదజాలం వాడడం 'అశ్లీలత' కాదు



అది కామ ప్రకోపాన్ని కలిగించేదిగా, కామవాంఛలను రేకెత్తిం చేదిగా ఉండాలి. దానిని వినే లేదా చూసే వారి మనస్సులను భ్రష్టు పట్టించేలా, చెడగొట్టేలా ఉండాలి. ఈ ప్రమాణాల ప్రకారం పరిశీలిస్తే, ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలన్నీ నిజమేనని పూర్తిగా అంగీకరించినప్పటికీ, ఆ మాటలను అశ్లీలమైనవిగా పరిగణించలేము. ఇలాంటి మాటలు ఎంత దూషణతో కూడినవి, వినడానికి వీలులేనివి లేదా సభ్యత లేనివి అయినప్పటికీ, ఇవి ఐపీసీ సెక్షన్ 294 (బి) పరిధిలోకి రావు" అని సుప్రీంకోర్టు పేర్కొంది. "ఈ బూతు మాటలు, అసభ్య పదజాలం వాడకం వల్ల బహిరంగ ప్రదేశంలో ఇతరులకు, ముఖ్యంగా ఫిర్యాదుదారునికి తీవ్ర అసౌకర్యం లేదా ఇబ్బంది కలిగిందని ఎక్కడా రుజువు కాలేదు. ఈ సెక్షన్?కు ఇది అత్యంత కీలకమైన నిబంధన. ఇది లేనప్పుడు, ఐపీసీ సెక్షన్ 294 (బి) కింద నేరం జరిగినట్లు పరిగణించలేము" అని ధర్మాసనం స్పష్టం చేసింది.

**కేసు నేపథ్యం**

తమిళనాడులో 2017 ఆగస్టులో ఒక వ్యవసాయ భూమి గురించి వివాదం చెలరేగింది. ఆ సమయంలో పిటిషినర్‌కు, అతడి బావమరిదికి మధ్య వాగ్వాదం జరిగింది. రెండు రోజుల తర్వాత, అదే భూమి విషయమై మేనల్లుడితో పిటిషనర్? మళ్లీ గొడవ పడ్డాడు. దీనితో ఆయన బావమరిది జోక్యం చేసుకున్నాడు. కోపంతో పిటిషినర్ తన బావమరిదిని అసభ్య పదజాలంతో, కులం పేరుతో దూషించాడు. దీనితో ట్రయల్ కోర్టు ఐపీసీ సెక్షన్ 294 (బి) అశ్లీలత, సెక్షన్ 326 (తీవ్రంగా గాయపరచడం), 506 (తితి) (క్రిమినల్ బెదిరింపు)తో పాటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద దోషిగా తేల్చింది. దీనితో పిటిషనర్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. మద్రాస్ హైకోర్టు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఆరోపణల నుంచి పిటిషినర్‌ను నిర్దోషిగా విడుదల చేసింది. కానీ ఐపీసీ సెక్షన్ల కింద విధించిన శిక్షలను మాత్రం సమర్థించింది. ఈ నేపథ్యంలోనే సదరు పిటిషనర్? సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

**పోక్సో దుర్వినియోగం**

మరో కేసు విచారణ సందర్భంగా, పరస్పరం ప్రేమించుకున్న అమ్మాయి, అబ్బాయి కలిసి వెళ్లిపోకుండా రాష్ట్రం ఎలా అడ్డుకోగలదని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. యుక్త వయసులో పరస్పర సమ్మతితో ఏర్పడే ప్రేమ సంబంధాలపై పోక్సో చట్టం నిబంధనల్ని దుర్వినియోగం చేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయని సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లలపై లైంగిక దాడులు, లైంగిక దోపిడీని అరికట్టేందుకు తీసుకొచ్చిన చట్టాన్ని ప్రతి ప్రేమ వ్యవహారానికి వర్తింపజేయడం సరైనదేనా? అని ప్రశ్నించింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం, యుక్తవయస్కుల గోప్యత హక్కులకు సంబంధించిన కేసును సుమోటోగా విచారణ చేస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. 15 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు అత్యంత సున్నితమైన దశ అని, ఈ వయసులో యువతలో సహజంగానే ఆకర్షణలు, భావోద్వేగాలు, ప్రేమ సంబంధాలు ఏర్పడుతుంటాయని కోర్టు వ్యాఖ్యానించింది.

## క్యూర్‌పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

చేపట్టి పేదలకు అందిస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియ యజ్ఞంలా కొనసాగుతుందని వివరించారు. రెండో విడతలో ప్రకటించిన 2.5 లక్షల ఇళ్ల నిర్మాణాలకు అదనంగా నగరంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారించిన ప్రభుత్వం, ఇప్పుడు హైదరాబాద్ నగరంతో పాటు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదల సొంతింటి కలను కూడా సాకారం చేయబోతోందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.గత ప్రభుత్వాల మాదిరిగా నగరానికి దూరంగా కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. కుటుంబాల జీవనోపాధికి, పిల్లల చదువులకు, ఉద్యోగాలకు పిల్లల చదువులకు, ఉద్యోగాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. గతేడాది మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో రెండు లక్షల ఇళ్లు పూర్తయ్యాయని, లక్షలాది కుటుంబాలు ఇప్పటికే గృహప్రవేశం చేసినట్లు తెలిపారు. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లు కలిపి మొత్తం 3.50 లక్షల కొత్త ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని, గతేడాది మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షలకు పైగా పేద కుటుంబాల జీవితాల్లో సొంతింటి వెలుగులు నింపుతున్న ప్రజా ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

## జపాన్ ఓపెన్ విజేత పీవీ సింధు..

ఒత్తిడి ఉంది. కానీ, ఎక్కడా దానిని బయటపెట్టలేదు. తొలి పాయింట్ నుంచి మ్యాచ్ గెలిచే వరకూ పట్టువదల్లేదు. మధ్యలో యుమగుచి నుంచి కాస్త పోటీ ఎదురైనా.. సంయమనం కోల్పోకుండా వరుసగా రెండు గేములను కొట్టేసింది. కాగా సింధు విజయంపై ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు

## 'వందేమాతరం' గేయాన్ని అవమానిస్తే మూడేళ్ల జైలు!



జైలు శిక్ష పడొచ్చు. తాజాగా ఆ చట్టానికి సవరణ చేయడం ద్వారా ఆ జాబితాలో 'వందేమాతరం' గేయాన్ని చేర్చనున్నారు. ఈ గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గతేడాది నవంబర్ 7 నుంచి ఏడాది పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే వందేమాతరానికి.. జాతీయ గీతం 'జన గణ మన'తో సమాన హోదా కల్పించేందుకు ప్రభుత్వం ఈ బిల్లు తీసుకొస్తోంది. ఈ గేయాన్ని బంకించంద్ర ఛటర్జీ రచించారు. తొలిసారి ఛటర్జీ రాసిన 'ఆనంద్ మఠ్' నవలలో ప్రచురితమైంది.

## అల్ప్రాజోలం తయారీ..

### 12 మందిని అరెస్ట్ చేసిన ఈగల్ ఫోర్స్

భూత్పూర్: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో ఈగల్ ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. కోళ్ల ఫారంలో నిర్వహిస్తున్నల్ప్రా జోలం తయారీ యూనిట్ గుట్టురట్టు చేశారు. ఈ వ్యవహారంలో 12 మందిని అరెస్ట్ చేయగా.. 23 మంది పరారీలో ఉన్నారు. ప్రధాన నిందితుడిని జయప్రకాశ్ గౌడ్‌గా గుర్తించారు. నిందితుడు గతంలో బోయిన్‌పల్లిలోని మేధా స్కూల్‌లోల్ప్రాజోలం తయారీ కేసులో అరెస్టయ్యాడు. బెయిల్‌పై విడుదలై స్వగ్రామంలో మళ్లీ తయారీ యూనిట్ ఏర్పాటు చేశాడు. జయప్రకాశ్‌పై ఈగల్ ఫోర్స్ పోలీసులు నిఘా పెట్టి నేడు అరెస్ట్ చేశారు.

## 20 మంది తిరుగుబాటు ఎంపీలకు ఆహ్వానం.. అఖిలపక్ష సమావేశం నుంచి విపక్షాల వాకౌట్



న్యూఢిల్లీ(జనంసాక్షి)
:రేపటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్షం భేటీ జరిగింది. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, జేఎంఎం, నేషనల్ కాన్ఫరెన్స్, శివసేన యూబీటీ, ఆమ్‌ఆద్మీ, వామపక్ష పార్టీలు వాకౌట్ చేశాయి. 20 మంది తిరుగుబాటు ఎంపీలకు ఆహ్వానం పంపడంపై టీఎంసీ నిరసన తెలిపింది. తిరుగుబాటు ఎంపీల విలీనానికి స్పీకర్ ఆమోదం తెలపలేదని మహువా మొయిత్రా పేర్కొన్నారు. టేబుల్ ఆఫీస్ జాబితాలో టీఎంసీ బలం 28 మందిగా ఉందన్నారు. 91వ సవరణ తర్వాత ప్రత్యేక కూటమికి ఆస్కారం లేదని వివరించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకే వాకౌట్ చేశామని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ తెలిపారు. తుది నిర్ణయం తీసుకోకుండా టీఎంసీ సంఖ్యాబలం అంచనా వేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.మరో వైపు పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేందుకు అన్ని పార్టీలు సహకరిం చాలని కేంద్రం కోరింది. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జేపీ నడ్డా, అర్జున్ రామ్ మేఘవాల్ తదితరులు సమావేశానికి హాజర య్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి లావు శ్రీకృష్ణదేవ రాయలు(తెదేపా), బాలశౌరి (జనసేన), మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి(వైకాపా), వద్దిరాజు రవిచంద్ర (బీఆర్‌ఎస్) పాల్గొన్నారు.

# కొండచరియలు విరిగిపడి..

భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.భారీ వర్షాలకు ఈశాన్య రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయి. నాగాలాండ్ మోన్ జిల్లాలో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడి 8 మంది మృతి చెందారు. డజన్ల కొద్దీ గల్లంతయ్యారు. పది నుంచి పదిహేను ఇళ్లు దెబ్బతినగా శిథిలాల కింద మరింత మంది ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు రెస్క్యూ సిబ్బంది సహాయ చర్యలను ముమ్మరం చేశాయి. నీటి ఉద్ధృతి ఎక్కువగా ఉండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నట్లు తెలుస్తోంది. భారీ వర్షాల కారణంగా అసోం గువాహటిలోని ఖార్ఘులి ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయి. కొండ పైభాగంలో ఉన్న ఓ రక్షణ గోడ ఒక్కసారిగా కుప్పకూలింది. పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. పశ్చిమ బెంగాల్‌లో కూడా రాబోయే రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. డార్జిలింగ్, కాలింపాంగ్, జల్‌పాయ్‌గుడీ , అలీపుర్‌దువార్, కూచ్ బెహర్ జిల్లాల్లో తీస్తా, తోర్సా, జల్దఖా, రైడక్ నదుల నీటిమట్టాలు ప్రమాదకరంగా పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది.

**పలు జిల్లాలకు'రెడ్ అలర్ట్' హెచ్చరిక జారీ**

హిమాచల్‌ప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని శిమ్లా వాతావరణ కేంద్రం 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. దీంతో అన్ని ప్రభుత్వ శాఖలు అప్రమత్తమయ్యాయి. వాతావరణ కేంద్రం చంబా, కాంగ్రా, మండి, సిర్మౌర్, కులు జిల్లాలకు రెడ్ అలర్ట్ హెచ్చరికలను జారీ చేసింది. శనివారం సాయంత్రం నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. ధర్మశాలలో అత్యధికంగా 82.2 మి.మీ వర్షపాతం నమోదైంది. వాతావరణ శాఖ లెక్కల ప్రకారం, ఒక రోజులో 115.6 నుంచి 204.5 మి.మీ మధ్య కురిసే వర్షాన్ని 'చాలా భారీ వర్షం'గా, 204.5 మి.మీ కంటే ఎక్కువ కురిసే వర్షాన్ని 'అత్యంత భారీ వర్షం'గా పరిగణిస్తారు. ప్రజలు అనవసర ప్రయాణాలను నివారించాలని, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని అధికారులు కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే రాష్ట్ర అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ 1070 లేదా జిల్లా అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ 1077 ను సంప్రదించాల్సిందిగా అధికారులు కోరారు.ఉత్తరాఖండ్‌ను భారీ వర్షాలు వణికిస్తున్నాయి. హరిద్వార్ జిల్లాలో పిడుగులు పడి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఎడతెరిపి లేని వానలు, కొండచరియలు విరిగిపడిన వంటి ఘటనలతో రాష్ట్రవ్యాప్తంగా 84 రహదారులు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. కుంభవృష్టి వర్షాలకు రిస్పానా నది నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఫలితంగా దాలన్‌వాలా సహా పలు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. రానున్న కొన్ని రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ఉత్తరాఖండ్‌లోని 10 జిల్లాలకు అధికార యంత్రాంగం రెడ్, ఆరెంజ్ అలెర్ట్‌లు జారీ చేసింది.

**కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో 17 మంది మృతి**

అటు జమ్మూ కాశ్మీర్‌లో భారీ వర్షాలు పెను విషాదాన్ని నింపాయి. సరిహద్దు జిల్లాలైన పూంచ్, రాజౌరీలో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో 17 మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో ప్రజలు గల్లంతయ్యారు. వరదల్లో చిక్కుకున్న పలువురిని రెస్క్యూ సిబ్బంది సురక్షితంగా రక్షించారు. ఆకస్మిక వరదలకు ఇళ్లు, కార్లు, రహదారులు దెబ్బతిన్నాయి. భారీ వర్షాలకు చినాబ్ నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. భారీగా వరద వచ్చి చేరుతుండటంతో సలాల్ డ్యామ్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డ్యామ్ నుంచి చినాబ్ నది పరవళ్లు తొక్కుతూ దిగువకు ప్రవహిస్తోంది. జమ్మూకశ్మీర్‌లో నెలకొన్న విపత్కర పరిస్థితుల దృష్ట్యా సీఎం ఒమర్ అబ్దుల్లా తన దిల్లీ పర్యటనను రద్దు చేసుకున్నారు. వరద ప్రభావిత జిల్లాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

**అమర్‌నాథ్ యాత్ర తాత్కాలికంగా నిలిపివేత**

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పహల్గామ్, బల్తాల్ మార్గాల్లో అమర్‌నాథ్ యాత్రను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు.

# మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపులు

ఆమె భర్త వాట్సాప్‌కు పంపాడని ఫిర్యాదులో వివరించారు. బాధితురాలి ఫిర్యాదు స్వీకరించిన అత్తాపూర్ పోలీసులు, నిందితుడు ఉదయ్ కృష్ణారెడ్డిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ ఎస్)లోని సెక్షన్లు 74, 75, 77, 315(2)తో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 66(సి) కింద కేసు నమోదు చేశారు

## కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్...

### హోదా పెరిగింది, బుద్ధి కాదు!

ఒకే వ్యవస్థ... రెండు సంఘటనలు... రెండు విభిన్న మనస్తత్వాలు.. ఒకటి ఆశను నింపితే, మరొకటి ఆందోళనను పెంచుతోంది. ప్రకాశం జిల్లా యువకుడు ఉదయ్ కృష్ణారెడ్డి ఒకప్పుడు కానిస్టేబుల్. పైఅధికారి అందరి ముందు అవమానించినా కక్ష పెంచుకోలేదు. అధికారాన్ని దుర్వినియోగం చేయాలనుకోలేదు. ఆ అవమానాన్నే ఇంధనంగా మార్చుకుని కష్టపడి సివిల్ సర్వీసెస్‌లో ఉత్తీర్ణుడై భారతీయ పోలీసు సేవలో చోటు సంపాదించాడు. అవమానాన్ని ప్రతీకారంగా కాదు, ప్రేరణగా మార్చుకున్నాడు. అదే నిజమైన అధికారి లక్షణం.మరోవైపు దేశంలోనే అత్యున్నత పోలీసు శిక్షణా సంస్థలో శిక్షణ పొందుతున్న ఓ అధికారి మహిళా సహచరిపై లైంగిక వేధింపులు, బెదిరింపులు, వ్యక్తిగత చిత్రాలతో బ్లాక్‌మెయిల్ చేశాడన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత తీసుకునే ముందు నుంచే మహిళను భయపెట్టే మనస్తత్వం ఉంటే, అలాంటి వ్యక్తి ప్రజలకు న్యాయం ఎలా చేస్తాడు? ఈ రెండు ఘటనలు ఒకే విషయాన్ని చెబుతున్నాయి. హోదా మనిషిని గొప్పవాడిని చేయదు. మనసే గొప్పదైతేనే హోదాకు గౌరవం వస్తుంది.ఒక కానిస్టేబుల్ అవమానాన్ని భరించి, తన వ్యక్తిత్వాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాడు. మరొకరు ఉన్నత హోదా కోసం శిక్షణ పొందుతూనే తన వ్యక్తిత్వాన్ని దిగజార్చుకున్నాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఇక్కడ ప్రశ్న ఒక్క వ్యక్తి గురించే కాదు. అధికారులను ఎంపిక చేసే వ్యవస్థ కేవలం మేధస్సును పరీక్షిస్తుందా? లేక వ్యక్తిత్వాన్ని కూడా కొలుస్తుందా? పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించడం మాత్రమే సరిపోదు. మహిళలను గౌరవించే సంస్కారం, అధికారాన్ని బాధ్యతగా భావించే నైతికత, ప్రజల పట్ల మానవత్వం కూడా ఉండాలి. లేదంటే సమాజానికి తెలివైన అధికారులు దొరుకుతారు కానీ, మంచి అధికారులు దొరకరు.

## చైనా సిగరెట్లు అక్రమ రవాణా.. ఇద్దరు భారతీయులు అరెస్టు


**న్యూఢిల్లీ:**చైనా తయారీ సిగరెట్లను అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు భారతీయులను శ్రీలంక పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి దాదాపు 50 వేలకుపైగా సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.79.8లక్షలు (శ్రీలంక కరెన్సీ) ఉంటుందని అంచనా వేశారు. శ్రీలంకలోని బండారునాయకే అంతర్జాతీయ విమానాశ్రయంలో తనిఖీలు నిర్వహిస్తున్న వేళ ఈ అక్రమ రవాణా వ్యవహారం బయటపడింది.శ్రీలంక నార్కొటిక్స్ బ్యూరో పోలీసుల ప్రకారం.. కాంబోడియాలో సిగరెట్లు కొనుగోలు చేసిన వీరిద్దరూ శ్రీలంక మీదుగా మలేసియా రాజధాని కౌలాలంపూర్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో కొలంబో ఎయిర్‌పోర్టుకు చేరుకోగా.. అనుమానించిన పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. 266 కార్టన్లలో చైనా సిగరెట్లు రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వీరిలో ఒకరిది హైదరాబాద్ కాగా.. మరొకరు ముంబయి వాసి అని తెలిసింది.



## నాణ్యమైన,నిరంతర విద్యుత్ సరఫరా ప్రభుత్వ లక్ష్యం

### సింగరేణి కార్మికులతో పాటు విద్యుత్ రంగ సంస్థల ఉద్యోగుల భద్రత కోసం ప్రమాద బీమా పథకాలు అమలు చేస్తున్నాం :ఉప ముఖ్యమంత్రి భట్టి

**టేకులపల్లి, జూలై 19(జనంసాక్షి):** ప్రజలకు నాణ్యమైన అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా ప్రజా పాలన కొనసాగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ మర్యాదపూర్వకంగా పూల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. ఇల్లందు నియోజకవర్గంలో పర్యటిస్తూ ఇల్లందు మండలం రొంపేడు గ్రామంలో నూతనంగా 3కోట్ల 25 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న 33/11 కె.వి. విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్ రోడ్ వద్ద నూతనంగా నిర్మించిన 33/11 కె.వి. విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేస్తూ విద్యుత్ మౌలిక సదుపాయాలను వేగంగా విస్తరిస్తున్నట్లు తెలిపారు. కొత్త విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటు, విద్యుత్ లైన్ల ఆధునికీకరణ, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యా ల పెంపు వంటి కార్యక్రమాలను ప్రాధాన్యతతో అమలు చేస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ అభివృద్ధి లో సింగరేణి సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సంస్థ అభివృద్ధి, ఉత్పత్తి సామర్థ్యాల పెంపు, ఉద్యోగుల సంక్షేమం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా బొగ్గు వనరుల వినియోగం కోసం ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందన్నారు. సింగరేణి ప్రాజెక్టుల ప్రభావిత నిర్వాసితులకు న్యాయం చేయడంతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. సింగరేణి కార్మికులతో పాటు విద్యుత్ రంగ సంస్థల ఉద్యోగుల భద్రత కోసం ప్రమాద బీమా పథకాలు అమలు చేస్తున్నామని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రూ.1.20 కోట్ల ప్రమాద బీమా రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య కోయగూడెంలోని స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజనులు అంతా ఆత్మగౌరవంతో తలెత్తుకుని తిరిగే విధంగా గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా విస్తృత కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. పోడు భూముల హక్కులు పొందిన గిరిజన రైతుల వ్యవసాయాభివృద్ధి కోసం 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకం ద్వారా ఉచిత సౌర విద్యుత్, బోర్ బావులు, పంపుసెట్లు, డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు.వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పుల కారణంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న ప్పటికీ, ప్రజలకు ఎలాంటి



అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా విద్యుత్ శాఖ అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయంగా పనిచేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమాల్లో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్, విద్యుత్ శాఖ అధికారులు, జిల్లా అధికార యంత్రాంగం ప్రజాప్రతినిధు లు, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కోకాపేట్‌లో వైభవంగా శ్రీ జగన్నాథ రథయాత్ర

**వేలాదిగా తరలివచ్చిన భక్తజనం.. 20 వేల మందికి అన్నప్రసాదం**





**హైదరాబాద్, జూలై 19 (జనంసాక్షి):** హరే కృష్ణ మూవ్‌మెంట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం కోకాపేట్‌లో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు రథయాత్రలో పాల్గొని జగన్నాథ స్వామి ఆశీస్సులు పొందారు. కోకాపేట్ గోల్డెన్ మైల్ లేఅవుట్ రోడ్ వద్ద ప్రారంభమైన రథయాత్రలో శ్రీ జగన్నాథ, బలదేవ, సుభద్ర దేవి విగ్రహాలను సుందరంగా అలంకరించిన రథాన్ని భక్తులు భజనలు, సంకీర్తనల నడుమ లాగారు. యాత్ర నగరంలోని ప్రధాన మార్గాల గుండా సాగి నార్సింగిలోని హరే కృష్ణ హెరిటేజ్ టవర్ వద్ద ముగిసింది.

రథయాత్ర ప్రారంభోత్సవానికి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సుద్దాల చలపతి రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షులు సత్య గౌర చంద్ర దాస ప్రభుజీ అధ్యక్షత వహించారు.

సంప్రదాయ శిల్పకళకు ఆధునిక సాంకేతికతను జోడించి రూపొందించిన ఈ రథంలో ఎయిర్ బ్రేకులు, స్టీరింగ్ వ్యవస్థ వంటి భద్రతా ప్రమాణాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రథయాత్రలో భాగంగా బాసిల్ వుడ్స్ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, కోలాటాలు, నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సుమారు 20 వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేయగా, సాయంత్రం బాణసంచా ప్రదర్శన భక్తులను అలరించింది. అనంతరం హరే కృష్ణ హెరిటేజ్ టవర్ వద్ద మహా సంకీర్తన, ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఈ రథయాత్ర ద్వారా సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం, శాంతి, సామరస్య భావనలను పెంపొందించడమే తమ లక్ష్యమని హరే కృష్ణ మూవ్‌మెంట్ నిర్వాహకులు తెలిపారు.

# పెట్రోల్ పోసి నిప్పంటించి.. కాంగ్రెస్ నాయకుడు సజీవ దహనం

- మాట్లాడుదామని పిలిచి ఘాతుకం
- ఎంజీఎం నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలింపు
- పరిస్థితి విషమించి బాధితుడు మృతి



వరంగల్ బ్యూరో, జూలై 19 (జనం సాక్షి) : కాంగ్రెస్ నాయకుడిపై గుర్తు తెలియని దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించి దాడి చేసిన సంఘటన వరంగల్లో సంచలనం కలిగించింది. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని 14 వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, వర్ధన్నపేట నియోజకవర్గం సోషల్ మీడియా ఇన్చార్జ్ అడుప మహేష్‌పై పత్రి కుమార్, జన్ను మధు దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. శనివారం రాత్రి మహేష్ కు ఫోన్ చేసి మాట్లాడే పని ఉందని మధు పిలిచాడు. దీంతో కాశిబుగ్గలోని కోటిలింగాల ప్రాంతంలో ఉన్నటువంటి ఆ వ్యక్తుల వద్దకు మహేష్ వెళ్ళాడు. అక్కడ వారు మద్యం సేవిస్తూ ఉండగా మహేష్ తో వాగ్వేదానికి దిగారు. దీంతో వారి వద్ద ఉన్నటువంటి పెట్రోలు మహేష్‌పై పోసి నిప్పంటించినట్లు సమాచారం. ఈ సంఘటన గమనించిన స్థానికులు వెంటనే కాలిన గాయాలపాలైన మహేష్‌ను తొలుత స్థానిక ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అంతకుముందు మహేష్ ను ఎంజీఎం వద్ద వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు పరిశీలించి ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, మెరుగైనటువంటి వైద్య సేవలు అందే విధంగా చూడాలని వైద్యులను కోరినట్టు తెలిసింది.

### నాపై దాడి చేసిన వారిని ఎన్కౌంటర్ చేయాలి.. నా కుటుంబాన్ని ఆదుకోవాలి

### అడుప మహేష్ వాంగ్మూలం



తనను పిలిచి అకారణంగా పెట్రోల్ పోసి దాడి చేసిన పత్రి కుమార్, జన్ను మధు మొదలైన వారిని ఎన్కౌంటర్ చేయాలని మృతుడు మహేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. సంఘటన జరిగిన తర్వాత కొందరు ఏం జరిగిందన్న విషయాన్ని మహేష్ ని అక్కడికక్కడే అడిగినప్పుడు దానికి సంబంధించిన వీడియో కూడా తీశారు. ఈ క్రమంలో మహేష్ మాట్లాడుతూ తాను 26 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ అందరిని అభిమానిస్తూ ఊరు బాగు కోసం ప్రజల బాగు కోసం పని చేశాననీ చెప్పాడు. అందరిని అన్న తమ్ముళ్ల లెక్క, అక్క చెల్లెలు లెక్క చూసుకున్నానని తెలిపాడు. నాపై పెట్రోల్ పోసి దాడి చేసి నా కుటుంబాన్ని నన్ను ఆగం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నాగరాజు, రేవంత్ రెడ్డి నాపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎన్కౌంటర్ చేయాలని, తనకు ఆత్మశాంతి కలిగించాలని కాలిన గాయాలతో బాధపడుతూ వేడుకున్నాడు.

### మహేష్ ను హత్య చేసిన వారిపై కేసు నమోదు

కాంగ్రెస్ నాయకుడు అడుప మహేష్ ను హత్య చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు గీసుకొండ ఇన్స్పెక్టర్ విశ్వేశ్వర్ తెలిపారు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు నిందితులు ఏ1 పత్తి కుమార్, ఎ2 జన్ను మధు మరి కొంత మంది పై కేసు నమోదు చేశారు. ఇన్స్పెక్టర్ విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 18 న శనివారం రాత్రి సుమారు 9.00 గంటల సమయంలో అడుప మహేష్ను అతని స్నేహితుడు జన్ను మధు ఫోన్ చేసి అతనితో మాట్లాడే పని ఉంది అని అతనిని గొర్రెకుంటలోని కోటిలింగాల దేవాలయం వద్దకి రమ్మనగా భాదితుడి నిరాకరించడంతో నిందితులు జన్ను మధు,నేను ఉన్నాను ఏం పరవాలేదు అని చెప్పి బలవంతంగా అక్కడికి పిలిపించుకొని మహేష్‌కు మద్యం తాగించిన తరువాత పత్తి కుమార్ అక్కడికి వచ్చి మహేష్ తో వర్ధన్నపేట ఎమ్మెల్యేకి నా గురించి ఎందుకు చెడుగా చెబుతున్నావురా నేనంటే నీకు భయం లేదారా అని అంటూ వాగ్వాదానికి దిగి కుట్ర పూర్వకంగా మహేష్ పై పెట్రోల్ పోసి నిప్పంటించి దారుణానికి పాల్పడ్డాడు. మహేష్ భార్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పత్తి కుమార్, జన్ను మధు పై హత్యా కేసు నమోదు కేసు చేయనైనది, పత్తి కుమార్ పై గతంలో హత్య కేసు మరియు ఇతర కేసులు కూడా ఉన్నాయి అని ఏనుమముల పోలీస్ స్టేషన్ లో రౌడీ షీట్ కూడా ఉంది. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉండగా, వారిని త్వరలోనే అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి అని తెలిపారు. ఎవరైనా వ్యక్తులు తాము రౌడీ షీటర్లు అని చెప్పుకుంటూ ప్రజలను బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయి. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడాల్సిన అవసరం లేదు అని ఇన్స్పెక్టర్ వివరించారు.

# మిషన్ మోడ్‌లో ఎల్‌నినోను ఎదుర్కొందాం

- ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు గ్రామ గ్రామానా అవగాహన కల్పించాలి
- తాగునీటికి ఇబ్బందులు రాకుండా ప్రణాళికాలు రచించాలి
- రైతులు, ప్రజలను కాపాడుకోవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- కరీంనగర్ ఉమ్మడి జిల్లా సమీక్షలో మంత్రులు తుమ్మల, శ్రీధర్ బాబు, పొన్నం, అడ్లూరి
- హాజరైన ప్రభుత్వవిప్‌లు ఆది శ్రీనివాస్, విజయ రమణారావు, ఎమ్మెల్యేలు



**కరీంనగర్ బ్యూరో, జూలై 19 (జనంసాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు, ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం మిషన్ మోడ్‌లో పనిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వార్డు సభ్యుడి నుంచి ఎంపీ వరకు, పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ఈ ప్రకృతి విపత్తును ఎదుర్కోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సూచనలు పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. ఆదివారం రోజు కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎల్‌నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక పై ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా విపత్కర పరిస్థితులు నెలకొన్నాయని, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలపై కూడా ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో వర్షపాతం ఆశించిన స్థాయిలో నమోదుకాకపోవచ్చని, అందువల్ల ముందస్తు చర్యలే ప్రజలను రక్షిస్తాయని పేర్కొన్నారు. గ్రామ, గ్రామాన రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్‌పామ్‌తో పాటు కందులు, నువ్వులు, వేరుశనగ, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఉద్యాన పంటల సాగును నేల స్వభావానికి అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు. తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, నీటి వినియోగంలో పొదుపు పాటించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. వ్యవసాయ, ఇరిగేషన్, భూగర్భ జలాలు, విద్యుత్ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ జిల్లా కలెక్టర్లకు సమాచారం అందించాలని చెప్పారు. ఎల్‌నినో ప్రభావం రాష్ట్రం ముందున్న పెద్ద సవాల్ అని, రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేసి రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఉద్యమంలా చేపట్టాలని, ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చే సమయంలో రైన్‌వాటర్ హార్వెస్టింగ్, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని తప్పనిసరి (మాండేటరీ) చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. కరోనా మహమ్మారి సమయంలో అందరూ సమిష్టిగా పనిచేసి సంక్షోభాన్ని అధిగమించినట్లే, ఇప్పుడు ఎల్‌నినో కారణంగా ఏర్పడుతున్న విపత్కర పరిస్థితులను సమన్వయంతో ఎదుర్కోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం, సాగునీటి పరిస్థితులపై రైతులకు గ్రామ గ్రామాన విస్తృతంగా అవగాహన కల్పించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ప్రకృతి విపత్తులు, కరువు పరిస్థితులపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మక్కాన్ సింగ్, సంజయ్ కుమార్, గంగుల కమలాకర్, కల్వకుంట్ల సంజయ్, మేయర్లు, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ మహేష్ దత్ ఎక్కా, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఇరిగేషన్, భూగర్భ జలాలు, విద్యుత్ శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నీట్‌లో మైనారిటీ గురుకుల విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

- మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీఎంఆర్ ఈఐఎస్) ఆధ్వర్యంలోని మైనారిటీ గురుకుల విద్యార్థులు ఈ ఏడాది నీట్ పరీక్షలో అద్భుతమైన ప్రతిభ కనబర్చడం హర్షణీయమని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన మైనారిటీ, నాన్-మైనారిటీ కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత కోచింగ్ అందించడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది నీట్ పరీక్షకు హాజరైన 164 మంది విద్యార్థుల్లో 117 మంది అర్హత సాధించడం టీఎంఆర్‌ఈఐఎస్ విద్యా ప్రమాణాలకు నిదర్శనమని అన్నారు. ప్రస్తుత ఫలితాల ఆధారంగా 45 మంది విద్యార్థులు ఎంబీబీఎస్, 8 మంది బీడీఎస్, మరో 13 మంది బీహెచ్‌ఎంఎస్, బీఏఎంఎస్ తదితర వైద్య కోర్సుల్లో ప్రవేశం పొందే అవకాశం ఉండటం గర్వకారణమని చెప్పారు. మొత్తం 66 మంది విద్యార్థులు వృత్తిపరమైన ఈ యేడాది వైద్య కోర్సుల్లో సీట్లు పొందనున్నట్లు అంచనా వేయడం ఆనంద దాయకమని పేర్కొన్నారు. తెలంగాణ వ్యా ప్తంగా ఏర్పాటు చేసిన 21 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన శిక్షణ, ప్రత్యేక పర్యవేక్షణ, నిరంతర మూల్యాంకనం అందించడం ఈ విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. అలాగే ఉచిత విద్య, హాస్టల్ వసతి, స్టడీ మెటీరియల్, రిఫరెన్స్ పుస్తకాలు, పోటీ పరీక్షల కోచింగ్, పౌష్టికాహారం, 24 గంటల విద్యా పర్యవేక్షణ వంటి సౌకర్యాలు విద్యార్థుల విజయానికి ఎంతో దోహదపడ్డాయని అన్నారు. నీట్‌లో అర్హత సాధించిన విద్యార్థులందరికీ, వారి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు, ప్రిన్సిపాళ్లకు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కోఆర్డినేటర్లకు ఎండీ యాకూబ్ పాషా అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది మైనారిటీ విద్యార్థులు వైద్య విద్యలో రాణించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

# రూ.1000 కోట్ల క్లబ్‌లోకి భద్రాద్రి బ్యాంక్

- 29వ వార్షిక సర్వసభ్య సమావేశంలో వెల్లడి
- మంత్రి తుమ్మల ప్రశంసలు.. 25 శాఖలతో రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ






**ఖమ్మం, (జనంసాక్షి) :** భద్రాద్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. బ్యాంకు చరిత్రలో తొలిసారిగా మొత్తం వ్యాపారం రూ.1000 కోట్ల మార్కును అధిగమించింది. ఆదివారం ఖమ్మంలోని దాబాలబజార్ వాసవి కళ్యాణ మండపంలో నిర్వహించిన 29వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ విషయాన్ని బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి వెల్లడించారు. సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదిక, బడ్జెట్‌ను చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి సభ ముందుంచగా, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రగతిని వివరిస్తూ.. 2026 మార్చి 31 నాటికి బ్యాంకు డిపాజిట్లు రూ.629.06 కోట్లకు, రుణాలు రూ.401.10 కోట్లకు చేరాయని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.151.39 లక్షల నికర లాభాన్ని ఆర్జించిందని చెప్పారు. రుణాల పంపిణీ, వసూళ్లలో బ్యాంకు మెరుగైన పనితీరు కనబరిచిం దన్నారు. తెలంగాణలోని సహకార బ్యాంకుల మొత్తం వ్యాపారంలో భద్రాద్రి బ్యాంక్ ఐదు శాతం మార్కెట్ వాటాను దక్కించుకుందని తెలిపారు. గత ఏడాది నాలుగు కొత్త శాఖలను ప్రారంభించామని, వాటిలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన శాఖ ప్రత్యేక మైలురాయిగా నిలిచింద న్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో 25 శాఖల ద్వారా సేవలు అందిస్తున్నామని, 21,849 మంది వాటాదారుల విశ్వాసంతో బ్యాంకు 30వ వసంతంలోకి అడుగుపెడుతోందని పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా కష్టమర్ల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, 25 శాఖలతో రూ.1000 కోట్ల వ్యాపారాన్ని నమోదు చేయడం భద్రాద్రి బ్యాంకు సాధించిన విశేష విజయమని అభినందించారు. సేవా దృక్పథం, పారదర్శకతతోనే ఈ స్థాయికి ఎదిగిందన్నారు. ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా నాణ్యమైన సేవలతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ మాట్లాడుతూ.. మూడు దశాబ్దాల క్రితం నాటిన చిన్న మొక్క నేడు 25 శాఖల మహావృక్షంగా ఎదిగి వేలాది మంది ఖాతాదారులకు సేవలందించడం ప్రశంసనీయమన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., సహకార శాఖ జాయింట్ రిజిస్ట్రార్ గట్టు గంగాధర్, బ్యాంకు వైస్‌చైర్మన్లు సన్నె ఉదయ్ ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు, బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులు, వివిధ శాఖల మేనేజర్లు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. సమావేశం ముగింపులో ఇన్‌చార్జి ప్రధాన కార్యనిర్వాహక అధికారి నాగుబండి శ్రీనివాసరావు వందన సమర్పించారు.

# రైతులంతా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

- ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**మంచిర్యాల ప్రతినిధి, జూలై 19 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావాన్ని రైతులు సమిష్టిగా ఎదుర్కోవాలని, రైతులంతా ఏకమై ఒకే నిర్ణయంతో వరి మినహా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో గల మైనారిటీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ కుమార్ తివారి, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగు మినహా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు 40 శాతం మాత్రమే వర్షపాతం నమోదు అయిందని, రాబోవు 3 నెలల లో కూడా ఈ పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని, ఇది ఒక ప్రకృతి విపత్తు లాంటిదని తెలిపారు. సాగునీరు, త్రాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని, ఈ కారణంగా ఈసారి నీటి లభ్యతలో లోటు ఉండడంతో వరి సాగులో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. తక్కువ సమయంలో పంట చేతికి వచ్చే తక్కువ నీటి అవసరం ఉన్న పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని, వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని గ్రామాలలో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు వివరించడం జరుగుతుందని తెలిపారు. మండలాలు, గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి ఆదాయం వచ్చే పంటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, వరి సాగు కారణంగా నష్టం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. భూసార పరీక్షలు నిర్వహించి కార్డులు అందించడం జరుగుతుందని, పంట సాగుకు అనుగుణంగా యూరియా అందించడం జరుగుతుందని తెలిపారు. జూన్ మాసంలో రైతు భరోసా అందించడం జరిగిందని, రైతులు మార్కెట్ లో డిమాండ్ ఉన్న ఆదాయం వచ్చే పంటలు సాగు చేసి లబ్ధి పొందాలని తెలిపారు.

### మాజీ మంత్రి కేటీఆర్ పై ఆగ్రహం

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు జర్మన్ లో ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నిస్తుంటే ,మాజీ మంత్రి కేటీఆర్ జర్మన్ లో ఉద్యోగ అవకాశాల కోసం జర్మనీ భాష నేర్చుకోవడం పై మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు చేయడం అతని అహంకారానికి నిదర్శమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నాడు మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు .పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు దిగ్విజయంగా ప్రవేశ పెట్టడం ప్రజల్లో మంచి పేరు రావడంతో నిరుద్యోగ యువతను రెచ్చగొట్టే విధంగా మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

# రక్షకులే రాక్షసులయితే...!

సంపాదకీయం

***దేశంలో చట్టాన్ని అమలు చేయాల్సిన వారే చట్టాన్ని ధిక్కరిస్తే, మహిళలకు రక్షణ కల్పించాల్సిన వారే మహిళల భద్రతకు ముప్పుగా మారితే, సమాజం ఎవరిని నమ్మాలి? హైదరాబాద్‌లోని జాతీయ పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న ఒక భారతీయ పోలీసు సేవ అధికారిణి తన సహోద్యోగి నుంచి లైంగిక వేధింపులు, బెదిరింపులు, వ్యక్తిగత చిత్రాలతో బ్లాక్‌మెయిల్‌కు గురయ్యారన్న ఆరోపణలు దేశాన్ని కలవరపరుస్తున్నాయి. ఇది ఒక వ్యక్తి తప్పిదంగా కొట్టిపారేయదగిన ఘటన కాదు. చట్టాన్ని కాపాడే వ్యవస్థలో చొరబడిన విలువల సంక్షోభానికి ఇది ప్రమాదకర సంకేతం.***

పోలీసు ఉద్యోగం కేవలం అధికారానికి ప్రతీక కాదు. అది బాధ్యతకు, క్రమశిక్షణకు, నైతిక విలువలకు ప్రతిరూపం కావాలి. అలాంటి బాధ్యతాయుతమైన సేవలోకి అడుగుపెట్టే దశలోనే ఒక మహిళా అధికారిణి భయంతో ఫిర్యాదు చేయడానికి కూడా వెనుకాడాల్సి వస్తే, శిక్షణా వ్యవస్థలో ఎక్కడో తీవ్రమైన లోపం ఉందని అంగీకరించక తప్పదు. దేశంలో మహిళల భద్రతపై ప్రతిరోజూ ప్రకటనలు వినిపిస్తున్నాయి. కఠిన చట్టాలు తెస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. కానీ చట్టం ఎంత కఠినంగా ఉన్నా, దాన్ని అమలు చేసే వ్యవస్థలో నిబద్ధత లేకపోతే దాని ప్రయోజనం శూన్యం. నేరం చేసిన వ్యక్తి ఎవరో కాదు, ఏ హోదాలో ఉన్నాడో కాదు, చట్టం ముందు నిందితుడే అన్న సందేశం బలంగా వెళ్లాలి.

మహిళలు, చిన్నారులపై నేరాల సంఖ్య తగ్గడం లేదు. చాలా సందర్భాల్లో నిందితులు అపరిచితులు కాదు; పరిచయస్తులే. ఇప్పుడు ఆ జాబితాలో చట్టాన్ని అమలు చేయబోయే అధికారులు కూడా చేరుతున్నారనే అనుమానం కలిగితే, ప్రజల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసం దెబ్బతినడం సహజం. ఈ ఘటన మరో ప్రశ్నను కూడా ముందుకు తెస్తోంది. ఒక భారతీయ పోలీసు సేవ అధికారిణికే తన గోడు చెప్పుకోవడానికి ధైర్యం కూడబెట్టేందుకు సమయం పట్టిందంటే, గ్రామీణ ప్రాంతాల్లోని సాధారణ మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడం కష్టం కాదు. బాధితురాలు ఎవరో కాదు; ఆమె కూడా వ్యవస్థలో భాగమే. అయినా ఆమె భయపడాల్సి వస్తే, వ్యవస్థలోని బలహీనత ఎంత లోతుగా ఉందో అర్థమవుతోంది. శిక్షణా సంస్థలు కేవలం చట్టాలు బోధించే కేంద్రాలు కాదు. వ్యక్తిత్వాన్ని, విలువలను, మానవత్వాన్ని తీర్చిదిద్దే ఆలయాలు కావాలి. మహిళల పట్ల గౌరవం, అధికార దుర్వినియోగంపై జీరో ఎఫ్‌ఐఆర్, ఫిర్యాదు చేసిన వారిని రక్షించే సంస్కృతి అక్కడి నుంచే ప్రారంభం కావాలి. లేకపోతే సమాజానికి మంచి అధికారులను కాదు, అధికార దుర్వినియోగానికి అలవాటుపడిన వ్యక్తులనే అందించినట్టవుతుంది.

ఈ కేసులో నిజానిజాలు దర్యాప్తులో తేలాలి. అయితే దర్యాప్తు పారదర్శకంగా, వేగంగా, ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా జరగాలి. నిందితుడు ఎంత ఉన్నత శిక్షణలో ఉన్నా, ఎంత ప్రభావశీలి అయినా చట్టం ముందు తలవంచాల్సిందే. అదే ప్రజాస్వామ్య బలం. అదే న్యాయం. రక్షణ కల్పించాల్సిన వారే భయానికి కారణమైతే, సమాజంలో భద్రత అనే భావనే కూలిపోతుంది. "రక్షకులే రాక్షసులయితే..." అనే ప్రశ్న కేవలం ఒక శీర్షిక కాదు, దేశం మొత్తం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన హెచ్చరిక. ఈ హెచ్చరికను ఇప్పటికైనా పాలకులు, వ్యవస్థలు, శిక్షణా సంస్థలు గంభీరంగా తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

# ధర్మేంద్ర ప్రధాన్ 'రాజీనామా చేయాలి'



నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి నైతిక బాధ్యత వహిస్తూ 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి' అంటూ కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో 2026 జూన్ 21న ప్రారంభమై నేటికి 29వ రోజులుగా నిరసనలు, దీక్షలు కొనసాగుతున్ననూ వాటిని అణచివేయడం పైననే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించి 'ఆందోళనకారుల డిమాండ్లను పరిష్కరిద్దాం' అనే దిశగా ముందుకు సాగకపోవడం కడు విచారకరం. ఈ ఆందోళన లో భాగంగానే ప్రముఖ పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్ ఇరవై ఒక్క రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్షని కొనసాగిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరించిన తీరు 'సభ్యసమాజానికి సిగ్గుచేటు'గా చరిత్రలో నిలిచిపోయింది. ఈ శనివారం ఉదయం ఢిల్లీ పోలీసులతో ఏకంగా దీక్షని భగ్నం చేయించడం అప్రజాస్వామిక పాలనకు నిదర్శనంగా నిలుస్తుంది. సోనమ్ వాంగ్ చుక్ దీక్ష భగ్నం అనంతరం శాంతియుతంగా దీక్షను కొనసాగిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సి.జె.పి) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేపై ఒక మహిళ ఏకంగా సిరా దాడికి పాల్పడడం అనైతికం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఏమాత్రం భావ్యం కావు. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం తప్పకుండా ఉంది. దీక్షని కొనసాగిస్తున్న పౌరుల ప్రాణాల భద్రతపై కేంద్ర ప్రభుత్వం అణువంత ఆందోళన చెందకపోవడం కడు గర్హనీయం. ఆందోళనకారుల భద్రతపై కేంద్రమే బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పేరుకే అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశంగా వర్ధిల్లుతున్న ఈ భారతదేశంలో పాలకులు అప్రజాస్వామికంగా వ్యవహరించడం ఏరకంగానూ సహేతుకం కాదు. నిజానికి ప్రజాస్వామికంగా పాలించలేని పాలకులు పౌరులు నినదించకముందే సిగ్గుతో తలదించుకొని స్వచ్ఛందంగా దిగిపోవాల్సిన అవసరం తప్పకుండా ఉంది. కాని పౌరులు రాజీనామా అని నినదిస్తున్న కూడా పాలకులు తమ పదవులకు అట్లే అంటిపెట్టుకొని ఉండడం తద్వారా వారికి 'పదవులపై ఉన్న ఆశను చూపిస్తుందే తప్ప ప్రజలకు సేవ చేద్దాం' అనే ఆశయాలకు తిలోదకాలు ఇవ్వడాన్ని సునిశితంగా గమనించవచ్చు. నోట్లు పోగేసి, ఓట్లు కూడగట్టి, సీట్లు పొంది పాలకులుగా వచ్చినవారు 'ప్రజాసేవను విస్మరిస్తూ పౌరుల సమస్యలను అసలుకే పట్టించుకోవడం లేదు' అనే దానికి 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి' అనే ఈ ఆందోళన నిదర్శనంగా నిలుస్తుంది. నిజానికి నీట్ పేపర్ లీక్ అయినప్పుడే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి ఉండాల్సింది. ఇకనైననూ ఆందోళనలు మరింతగా ఉధృతం కాకముందే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. మంత్రి రాజీనామా చేసేంతవరకు ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు మరింతగా ఉద్యమించాల్సిన అవసరం తప్పకుండా ఉంది.



జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

# రక్షణ-అంతరిక్ష రంగాల్లో ప్రయివేటీకరణ విదేశీ అనుభవాలు

దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడే శక్తి కేవలం సరిహద్దుల్లో కాపలా కాసే సైనికుడిలో మాత్రమే ఉండదు. ఆ సైనికుడి వెనుక నిలిచే ఆయుధ పరిశ్రమ, అంతరిక్ష సాంకేతికత, క్షిపణి వ్యవస్థలు, ఉపగ్రహ నిఘా, సైబర్ భద్రత, రక్షణ పరిశోధన సంస్థలు, శాస్త్రవేత్తల మేధస్సు కలిసి ఒక దేశ భద్రతకు అసలైన పునాదిగా నిలుస్తాయి. అందుకే రక్షణ, అంతరిక్ష రంగాలను ప్రపంచవ్యాప్తంగా అత్యంత వ్యూహాత్మక రంగాలుగా పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో భారతదేశంలో రక్షణ ఉత్పత్తిలో ప్రైవేట్ రంగానికి పెరుగుతున్న అవకాశాలు, అంతరిక్ష రంగంలో ఇస్రోతో పాటు ప్రైవేట్ సంస్థలకు అనుమతులు లభించడం కొత్త చర్చకు దారితీసింది.

ఒకవైపు దీనిని "ఆత్మనిర్భర్ భారత్", "మేక్ ఇన్ ఇండియా" దిశగా ముందడుగుగా ప్రభుత్వం పేర్కొంటుంటే, మరోవైపు జాతీయ భద్రత, పారదర్శకత, కార్పొరేట్ ఆధిపత్యం వంటి అంశాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ చర్చలో భావోద్వేగాలకు, రాజకీయ విమర్శలకు కాకుండా ప్రపంచ అనుభవాలను ఆధారంగా చేసుకుని విషయాన్ని విశ్లేషించడం అవసరం. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, స్వీడన్ వంటి దేశాల్లో రక్షణ పరిశ్రమలో ప్రైవేట్ కంపెనీల పాత్ర అత్యంత కీలకమైనది. అయితే అక్కడ ప్రభుత్వాలు తమ నియంత్రణను ఎక్కడా వదులుకోలేదు. ఉదాహరణకు అమెరికాలో లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, రేథియాన్, నార్త్రోప్ గ్రుమన్ వంటి సంస్థలు అత్యాధునిక యుద్ధ విమానాలు, క్షిపణులు, ఉపగ్రహాలు, రాడార్ వ్యవస్థలు తయారు చేస్తాయి. కానీ ఏ ఆయుధాన్ని ఎవరికి విక్రయించాలి? ఏ సాంకేతికత దేశం బయటకు వెళ్లకూడదు? ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించాలి? వంటి నిర్ణయాలు పూర్తిగా అమెరికా ప్రభుత్వం, పెంటగాన్, జాతీయ భద్రతా సంస్థల చేతుల్లోనే ఉంటా యి. అంటే తయారీ ప్రైవేట్ రంగం చేస్తుంది. కానీ నియంత్రణ మాత్రం ప్రభుత్వం వద్దే ఉంటుంది. ఇదే విధానం యూరప్‌లోనూ కనిపిస్తుంది. అక్కడ కూడా అనేక రక్షణ సంస్థలు ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్నప్పటికీ ప్రభుత్వాలకు ప్రత్యేక హక్కు లు ఉంటాయి. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా సంస్థలు వ్యవహ రిస్తే ప్రభుత్వాలు జోక్యం చేసుకునే చట్టబద్ధ అధికారం కలిగి ఉంటాయి.

స్పేస్‌ఎక్స్, బ్లూ ఒరిజిన్ వంటి సంస్థలు ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష ప్రయోగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయి. అయినప్పటికీ అవి నాసాకు ప్రత్యామ్నాయం కావు. ప్రతి ప్రయోగానికి ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. జాతీయ భద్రతకు సంబంధించిన ఉపగ్రహాల విషయంలో మరింత కఠినమైన నియంత్రణ అమలులో ఉంటుంది. అంటే ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు నియంత్రణను వదల్లేదు. సేవల అమలులో, సాంకేతిక అభివృద్ధిలో, తయారీలో మాత్రం ప్రైవేట్ రంగాన్ని భాగస్వామిగా మార్చుకున్నాయి.

దీనికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయి. మొదటిది సాంకేతిక పోటీ. ప్రభుత్వ రంగ సంస్థల్లో నిర్ణయ ప్రక్రియ కొంత నెమ్మదిగా సాగుతుంది. ప్రైవేట్ రంగంలో పోటీ ఎక్కువగా ఉండటం వల్ల కొత్త ఆవిష్కరణలు వేగంగా వస్తాయి. రెండవది వ్యయ నియంత్రణ. భారీ రక్షణ ప్రాజెక్టుల్లో సమయం, వ్యయం రెండూ కీలకం. పోటీ వల్ల తక్కువ ఖర్చుతో మెరుగైన సాంకేతిక పరిజ్ఞానం అందే అవకాశం ఉంటుంది. మూడవది ఉత్పత్తి సామర్థ్యం. యుద్ధ పరిస్థితుల్లో ప్రభుత్వ రంగ సంస్థలు ఒక్కటే సరిపోవు. లక్షల సంఖ్యలో మందుగు ండు సామగ్రి, డ్రోన్లు, వాహనాలు, విడిభాగాలు అవసరమవుతాయి. అలాంటి సందర్భాల్లో ప్రైవేట్ పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే దీనివల్ల అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని అనుకోవడం కూడా సరైంది కాదు. రక్షణ రంగం సాధారణ వ్యాపారం కాదు. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన రంగం. అందువల్ల కొన్ని సహజమైన ప్రమాదాలు కూడా ఉంటాయి. ప్రైవేట్ సంస్థ ప్రధాన లక్ష్యం లాభం. జాతీయ ప్రయోజనం కాదు. కఠిన నియంత్రణ లేకపోతే వ్యాపార ప్రయోజనాలు ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది. మరో ప్రధాన ప్రమాదం సమాచార లీకేజీ. ఆధునిక ఆయుధ వ్యవస్థల రూపకల్పన, క్షిపణి సాంకేతికత, ఉపగ్రహ సమాచారంలో చిన్న నిర్లక్ష్యం కూడా దేశ భద్రతకు ముప్పుగా మారవచ్చు. అందుకే అభివృద్ధి చెందిన దేశాల్లో వేలాది ఉద్యోగులపై కూడా భద్రతా పరిశీలనలు జరుగుతుంటాయి. ఇంకొక ప్రమాదం గుత్తాధిపత్యం. భారత్‌లో రక్షణ--అంతరిక్ష రంగాల్లో ప్రైవేటీకరణ విజయవంతం కావాలంటే కొన్ని మౌలిక సూత్రాలు పాటించాలి. రక్షణ ఒప్పందాలు పూర్తిగా పారదర్శకంగా ఉండాలి. ఒకటి లేదా రెండు సంస్థలకే అవకాశాలు పరిమితం కాకుండా సమాన పోటీకి అవకాశం కల్పించాలి. పార్లమెంటరీ పర్యవేక్షణ, స్వతంత్ర ఆడిట్లు, భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు కావాలి. అత్యంత కీలకమైన సాంకేతికత, అణు వ్యవస్థలు, వ్యూహాత్మక నియంత్రణ మాత్రం ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగాలి. ప్రపంచ అనుభవం చెప్పే పాఠం స్పష్టమైనది. రక్షణ, అంతరిక్ష రంగాల్లో ప్రైవేట్ భాగస్వామ్యం అభివృద్ధికి దోహదపడుతుంది. కానీ జాతీయ భద్రతపై ప్రభుత్వ నియంత్రణ ఏమాత్రం బలహీనపడకూడదు. ప్రభుత్వ వ్యూహాత్మక పర్యవేక్షణ, ప్రైవేట్ సాంకేతిక సామర్థ్యం, పారదర్శక వ్యవస్థ, కఠిన చట్టబద్ధ నియంత్రణ కలిసి పనిచేసినప్పుడే దేశ భద్రత, సాంకేతిక స్వావలంబన, పారిశ్రామిక అభివృద్ధి అనే మూడు లక్ష్యాలు సమతుల్యంగా సాధ్యమవుతాయి. అదే భారతదేశం అనుసరించాల్సిన అత్యుత్తమ మార్గం.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# ఉత్తరఖాండ్ ఋషికేష్‌లో
# ఏం జరుగుతోంది?




ప్రతి సంవత్సరం లక్షలాది దేశీయ, విదేశీ పర్యాటకులతో, యోగ సాధకుల తో కిక్కిరిసిపోయే ఈ ప్రాంతం ఇప్పుడెందుకు అక్కడి జనాల అర్తనాదాలతో నిండి పోయింది..? హిమాలయ పర్వతాల దిశగా కొనసాగే ఈ 'ఋషికేష్' ని, 'గేట్ వే టు ది హిమాలయాస్' అని అంటారు. ఉత్తరాన హిమాలయ పర్వతాలు.. మధ్యలో గంగా నది.. చుట్టూ దట్టమైన అడవులతో అత్యద్భుతంగా ఆహ్లాదపరిచే ఈ ఋషికేష్‌లో ఇప్పుడు విధ్వంసం మొదలైంది. ప్రజలు, పర్యావరణవేత్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు.

ఋషికేష్ – డెహ్రాడూన్ ప్రాంతంలో ట్రాఫిక్ ని తగ్గించడానికి, యాత్రికుల రాకపోకలు సులభం చేయడానికి, ఆ ప్రాంతంలో అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పేరుతో ప్రభుత్వం, 'డబుల్ లేన్ ఎలివేటెడ్ రోడ్, హైవే విస్తరణ ప్రాజెక్టు' చేపట్టింది.

ఈ అభివృద్ధికి అడ్డం వస్తున్నాయని, వేలాది వృక్షాలను నరికివేస్తున్నారు. ఇప్పటికి సుమారు 3,500 నుండి 4,000 మధ్య చెట్లు నరికివేసారని అక్కడి ప్రజలు విలవిల్లాడుతున్నారు. అభివృద్ధి పేరుతో పచ్చని అడవిని నాశనం చేస్తున్నారని, ఇప్పుడు వాళ్ళు ప్రొటెస్ట్‌లోకి దిగారు. ఇలా వేలల్లో చెట్లని నరికివేయడం వల్ల అడవికి తీవ్ర నష్టం జరుగుతుందనీ, ఉన్నట్లుండి అక్కడున్న వాతవరణ సమతుల్యత దెబ్బ తింటుందనీ, పర్యావరణవేత్తలు ఉద్యమకారులు ఆవేదన పడుతున్నారు. నరికివేయబడ్డ చెట్లలో ఎక్కువగా సాల్ (ఖుత్రీ), శీశమ్, ఇతర స్థానిక అడవి జాతుల చెట్లు ఉన్నాయని, ఇందులో చాలా వరకు 40 నుండి 100 సంవత్సరాల వయసున్న మహా వృక్షాలేనని పర్యావరణవేత్తలు చెబుతున్నారు.

ఇది ఈ ఒక్క రోజునో, కొన్ని నెలలుగానో, సంవత్సర కాలంగానో ఉన్న సమస్య కాదు. దాదాపు ఒక దశాబ్ద కాలంగా దశలవారీగా కొనసాగుతున్న పర్యావరణ పోరాటం. 2016, 17 లోనే ఋషికేష్ – డెహ్రాడూన్ ప్రాంతం లో రహదారి విస్తరణతో పాటు, కొత్త మార్గాల ప్రతిపాదనలతో, కేంద్ర ప్రభుత్వం 'చార్ ధామ్ ఆల్ వెదర్ రోడ్ ప్రాజెక్ట్' ని ప్రకటించింది. అప్పటి నుండే పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేయడం ప్రారంభించారు.

కాగా 2018, 19 మధ్య కాలంలో అటవీ శాఖ అనుమతులతో వేలాది చెట్లను నరికేసే ప్రక్రియ ప్రారంభమైంది. అప్పుడే అధికారులు చెట్లకు గుర్తులు (ఘితీఐఅఎ్ర) వేసి పెట్టారు. అప్పటి నుండి అక్కడి స్థానికుల్లో కూడా చలనం వచ్చి, అభ్యంతరాలు వెలిబుచ్చడం మొదలుపెట్టారు. ఇక 2019 నుండి 2021 మధ్యకాలంలో "చెట్ల నరికివేత నిలిపివేయా' లని, ఈ ప్రాజెక్ట్ నిలిపివేసి, ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాలని పరిశీలించాలని, పర్యావరణ ప్రభావంపై, నిపుణులతో స్వతంత్ర అధ్యయనం చేయాలని, స్థానికులు, పర్యావరణ కార్యకర్తలు, విద్యార్థులు, సామాజిక సంస్థలు అన్ని కలిసి నిరసనలు చేపట్టారు.

ఈ కాలంలోనే సంఘటిత నిరసనలు, వినతిపత్రాలు, ర్యాలీలు, పర్యావరణ ఉద్యమాలు ఉధృతమయ్యాయి. కొన్ని చోట్ల ప్రజలు చిప్కో ఉద్యమాన్ని గుర్తు చేస్తూ, నరుకుతున్న చెట్లను కౌగిలించుకుని (తీవవ ప్రబహ్రఅ్ర) ప్రతీకాత్మక నిరసనల్ని కూడా నిర్వహించారు. ఇంత చేసినా ప్రభుత్వం 'దున్నపోతు మీద వాన కురిసినట్టు' వ్యవహరించడంతో ఇక చేసేదేం లేక, 2022 లో పర్యావరణ సంఘాలు కోర్టుని ఆశ్రయించాయి. కోర్టు ఇటువంటి కొన్ని అనుమతులపై ప్రశ్నలు లేవనెత్తింది. ఈ నేపథ్యంలో, అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల, పర్యావరణంపై పడే ప్రభావం గురించి దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. ఇది 2024 వరకు కొనసాగింది. ఇక ప్రస్తుత పరిస్థితికి వస్తే ఇప్పటికే దాదాపుగా 4000 వేల చెట్లని నరికివేశారని, పలుచోట్ల ఇప్పటికే నిర్మాణ పనులు మొదలయ్యాయని, అక్కడి స్థానికులు, పర్యావరణ వేత్తలంటు న్నారు. ఒకవైపు ప్రభుత్వం ఇది అభివృద్ధిలో భాగం అని చెప్తుంటే, ఎందుకు మరోవైపు స్థానిక ప్రజలు, పర్యావరణవేత్తలు దీన్ని వ్యతిరేకిస్తున్నారు?...

చెట్లని నరికి రోడ్డుని విస్తరింపచేస్తే, ఆ దారి గుండా రహదారి మార్గమేర్పడితే ప్రయాణికులకు సులభంగా వుంటుందని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ, వాస్తవానికి హిమాలయ ప్రాంతం చాలా సున్నితమైనది. అక్కడ చెట్లని తొలగిస్తే, కొండచరియలు విరిగిపడే ప్రమాదం వుంటుంది. భూస్ఖలనం, వరదల తీవ్రత రెట్టింపవుతుంది. దాని ప్రభావం నేరుగా గంగా నదిపై పడుతుంది (ఋషికేష్ గంగ నది ఒడ్డున వుంది). అడవులు తగ్గితే, నీటి నిల్వ తగ్గిపోతుంది. భూగర్భజలం తగ్గుతుంది. జీవవైవిధ్యం దెబ్బతింటుంది. అంతేకాదు అక్కడ నివసించే ఏనుగులు, చిరుతలు, జింకలు, అనేక పక్షులవంటి వన్యప్రాణుల నివాసాలు కనుమరుగైపోతాయి, అప్పుడవి గ్రామంలోకి వచ్చే అవకాశం వుంది. చాలా మటుకు కుటుంబాలు నేరుగా ప్రకృతిపైనే ఆధారపడి వున్నాయి. కొండ ప్రాంతాల్లో చిన్న చిన్న పొలాల్లో బియ్యం, గోధుమలు, పప్పులు, కూరగాయలు పండిస్తూ బతుకు సాగిస్తుంటా రు వాళ్ళు. "చెట్లని నరకడం అంటే కేవలం ఒక మొక్కని పీకి పారేయడం కాదు. కొండ బలహీనమవుతుంది, నీరు తగ్గుతుంది, మా జీవితమే మారిపోతుంది." అంటున్నారు అక్కడి జనాలు. అందుకే నరికివేతలకి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు.

**ఇలాంటి ఉద్యమం ఇంతకు ముందెన్నడు జరగలేదా? :**

1973 లో కూడా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అడవులను కాంట్రాక్టర్లకు అప్పగించింది. చెట్లను నరికేయడానికి కార్మికులు వచ్చినప్పుడు, "ముందు మమల్ని నరికి చెట్లని నరకండి!" అంటూ అక్కడి ప్రజలు చెట్లని 'హత్తుకొని'(హిందీలో 'చిప్కో'), కూలీలకు అడ్డంగా నిలబడ్డారు. దీన్నే చిప్కో మూమెంట్ అని అంటారు. దీనికి సుందర్ లాల్ బహుగుణ, చండి ప్రసాద్ భట్ నాయకత్వం వహించారు.

ఈ ఉద్యమం ఊపందుకోవడంతో దీని ప్రభావం చాలా చోట్లనే పడింది. అందువల్ల ఎన్నోచోట్ల ప్రభుత్వం చెట్ల నరికివేతని ఆపేసింది. అంతే కాకుండా హిమాలయ ప్రాంతాల్లో, వాణిజ్యపరమైన చెట్ల నరికివేతపై కేంద్ర ప్రభుత్వం దీర్ఘకాలిక నిషేధం విధించింది. ప్రపంచ వ్యాప్తంగా ఈ ఉద్యమం, పర్యావరణ పరిరక్షణకు ఒక చారిత్రక ఉదాహరణగా గుర్తింపు పొందింది. ప్రజల ఆవేదనని, ఆ ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని అప్పటి ప్రభుత్వం ఆ చెట్ల నరికివేతని నిలిపివేసింది. మరి రోజు రోజుకి ఉద్రిక్తం అవుతున్న ఈ ఉద్యమాన్ని, ఇప్పటి ప్రభుత్వం ఎలా తీసుకుంటుందో చూడాలి. ప్రస్తుతానికి ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి, ఈ చెట్ల నరికివేతను తాత్కలికంగా నిలిపివేశారు. వివిధ అంశాల కారణంగా అటు విద్యార్థులు, ఇటు జనాలు ప్రొటెస్ట్‌లో తమ ప్రాణాల్ని కోల్పోయినా లెక్కచేయని ప్రభుత్వం, వీళ్ళని ఎంత పట్టించుకుంటుందో.. ఈ ఉద్యమం కూడా ఎటు నుండి ఎటు మలుపు తీసుకుంటుందో చూడాలి. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వానికి వంత పాడుతూ, మాలాంటి వాళ్లందర్నీ అభివృద్ధి విరోధకులు అనే వారికీ చివరగా నాదో ప్రశ్న... అభివృద్ధి అవసరమే.. కానీ ప్రకృతిని నాశనం చేసే అభివృద్ధి, విధ్వంసాన్ని సృష్టించే అభివృద్ధి ఏం అభివృద్ధి??



- దియా విఘ్నేష్.

# తెలంగాణ భాషలో పలుకుబడులు!!




తెలంగాణ భాష, యాస మరియు అందులోని పలుకు బడులు మన ప్రాంత సంస్కృతికి ,చారిత్రక వైభవానికి మరియు ప్రజల జీవన విధానానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయి. శతాబ్దాల కాలంగా వివిధ రాజరికాల పాలన , ముఖ్యంగా నిజాం నవాబుల పాలన ప్రభావం వల్ల తెలంగాణ తెలుగు భాషలు ఉర్దూ, పర్షియన్, మరాఠీ, కన్నడ పదాలు సహజంగా కలిసిపోయి, ఒక విలక్షమైన రూపాన్ని సంతరించుకున్నాయి. మన తెలంగాణ భాషా కేవలం ఒక సంభాషణ మాధ్యమం మాత్రమే కాదు; అది ఆయా అంతలా శ్రమజీవుల స్వేదం, ఉనికి , మట్టి వాసన మరియు ఆత్మీయతల కలయిక. తెలంగాణ పలుకుబడు లలో కనిపించే నిష్కల్మషత్వం, అందులోనే సామెతలు, పొడుపు కథలు, జాతీయాలు నిత్య జీవితంలోని కష్టసుఖాలను హాస్యాన్ని, వ్యంగాన్ని అద్భుతంగా ప్రతిబింబిస్తాయి. తెలంగాణ భాష పలుకుబడులు అంటే ముఖ్యంగా చెప్పాల్సింది ఏమిటంటే మన తెలంగాణ పల్లెల్లో జీవన విధానంలో నిత్యం మాట్లాడుకునే స్వచ్ఛమైన సహజమైన తెలుగు భాష నుడికారాలని తెలియజేయవచ్చు. ఇవి కేవలం పదాలు మాత్రమే కాకుండా వాటి ఉచ్చారణ లో ఉండే విలక్షణతను, సంస్కృతిని, ఆచారాలను, సంప్రదాయాలను, జీవన విధానాన్ని ప్రతిబింబిస్తాయి. ముఖ్యంగా తెలంగాణ భాష, యాస, పలుకుబడులు అనేవి మన తెలంగాణ మట్టి పరిమళాన్ని, జీవన విధానాన్ని, తెలంగాణ వైభవాన్ని, ప్రత్యేకతను చాటుతాయి. ఇవి సామాన్యుడి హృదయానికి హత్తుకుని నుడికారాలుగా నిమగ్నమైపోయాయి. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సెప్టెంబరు 9న తెలంగాణ భాషా దినోత్సవం అధికారికంగా నిర్వహిస్తారు. "తెలంగాణ రచయిత కాళోజీ నారాయణరావు 100వ జయంతి సందర్భంగా.. కాళోజీ పుట్టినరోజైన సెప్టెంబరు 9ని తెలంగాణ భాషా దినోత్సవంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది." తెలంగాణ ప్రజల గుండె చప్పుడు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం ఈ దినోత్సవాన్ని ప్రకటించింది. ఈ ప్రత్యేక రోజున తెలంగాణ భాష, సాహిత్యం మరియు సంస్కృతిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, పాఠశాలలు మరియు కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కవి కాళోజీ నారాయణరావు చేసిన సాహిత్య సేవలను, తెలంగాణ మాండలికం యొక్క గొప్పతనాన్ని ఈ వేడుకల్లో గుర్తుచేసుకుంటారు. ఈ దినోత్సవం సందర్భంగా ఉత్తమ కవులు, రచయిత లకు తెలంగాణ ప్రభుత్వం కాళోజీ పురస్కారం అందజేసి సత్కరిస్తుంది. ఈవిధంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు అన్నట్లు "బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాష కావాలి." దక్కన్ పీఠభూమి చరిత్ర సంస్కృతి, నిజాం పాలన ప్రభావం వల్ల ఉర్దూ పదాలు కూడా ఈవిధంగా మన తెలంగాణ భాషలో చేరినాయి.

ఇప్పుడున్న తెలుగు వ్యవహారిక భాష పూర్తిగా సంస్కృతమయై ఉంది. తెలంగాణ భాషలో ఎలాంటి అస్పష్టత లేదు. కారణం దేశీయ పద్ధతిలో తెలుగును గానం చేసే మౌలిక తత్వం, శ్రమైక జీవన సంస్కృతి, మానవీయమైన ఆదాన ప్రదనాలను తావునిచ్చే సహృదయత తెలంగాణ గడ్డలో ఉంది. ఇక్కడి జీవన విధానంలో నిస్వార్థ చింతన ఉంది. అందుకే తెలంగాణ పేరు సార్థకమైంది. తెలంగాణ భాషా పదాల సొగసు, మాధుర్యం,సృజనాత్మకత, మౌలికత, సార్థకత తెలంగాణ మట్టి వాసనాలు భాషాపరమైన అనేక విషయాల్లో ఇతర భాషలతో పోల్చుకుంటే తెలంగాణ తెలుగు భాషలో స్పష్టత కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఖ, ఘ,ఛ,ఝ,ఠ,ఢ,థ, ధ,ఫ,భ మొదలగు మహాప్రాణాలు వాటి ప్రయోగాలు ద్రావిడ భాషల్లో లేనట్లే తెలంగాణ తెలుగులో లేవు. క,చ,ట,త,ప, లు అనే శ్వాసాలే కొన్నిసార్లు నాదాలుగా ఉచ్చరింపబడ్తాయి. తెలుగు భాషలో ఇవి గ,జ,డ,ద,బ లుగా మారుతుంటాయి. తెలంగాణ తెలుగు భాషలో శ,ష,స లకు మధ్య భేదం కనిపించదు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో భాష ఒక కీలక పాత్ర పోషించింది. ఉద్యమ సందర్భంగా అచ్చమైన తెలంగా ణ పలుకుబడిలో కెసిఆర్ చేసిన ప్రసంగాలు తెలంగాణ సమాజాన్ని ఉత్తేజపరిచాయి. సీమాంధ్ర పాలకుల హయాంలో తెలంగాణ పలుకుబడిలో ఎవరైనా మాట్లాడడానికి వెనుక ముందు ఆడేవారు. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణ భాషను ఆయుధంగా చేసుకుని కెసిఆర్ ఉద్యమాలోకి దిగారు. అడుగడుగు నా తెలంగాణ భాషలో సాగే కెసిఆర్ ప్రసంగాలు తెలంగాణ ప్రజలకు కట్టి పడేశాయి. "నీళ్లు, నిధులు, నియామకాలు" ప్రధానంగా ఈ మూడు అంశాలపై తెలంగాణ ప్రజలు ఉద్యమించారు. ఈ మూడే కాదు తెలంగాణ ఉద్యమానికి బలమైన కల్చరల్ కోణం కూడా ఉంది. అనేక ప్రత్యేకతను సొంతం చేసుకున్న తెలంగాణ భాషకు ఇతర సాంప్రదాయాలకు సరైన గుర్తింపు లభించడం లేదన్న ఆవేదన కూడా ఉంది. ప్రత్యేక రాష్ట్రం కోసం సాగిన ఉద్యమంలో తెలంగాణ భాషకున్న ప్రాధాన్యం ప్రత్యేకమైంది.

తెలంగాణ ప్రజలు ఎంతో అర్థవంతమైన భాష మాట్లాడుతున్నారు. ఉదాహరణకు మేర పదానికి ఇతర ప్రాంతాల వారు దర్జీ అంటారు. ఇది ఉర్దూ పదం వాస్తవానికి తెలంగాణలో వాడే మేర పదాన్ని పరిశీలిస్తే పొలిమేర, ఆమేరకు, ఈమేరకు అనే మౌఖిక ప్రయోగాలు తెలంగాణలో ఉన్నాయి. మేరల అనగా హద్దులమేరకు అని ఉంది. అనగా మేర వారు గుడ్డల్ని కత్తిరించి కుట్టే వ్యక్తిమేర. ఇది అసలు సిసలు తెలుగు పదం. సోయి, సోయిలేదు, సోయిసుద్ధి, సోయిసెప్పటం లాంటివన్నీ తెలుగు పదాలు. ఈ విధంగా తెలంగాణ తెలుగు భాషా సౌందర్యంలో కొన్ని స్పష్టమైన విలక్షణత్వాలను గుర్తించవచ్చు. భాషలో అచ్చమైన తెలుగు పోకడలు ఇక్కడ ఉన్నాయి. తెలంగాణ తెలుగులో ఉర్దూ పదాలు అత్యంత జమిలిగా రీతిలో కలగలసి పోవటం గొప్ప విశేషం. తెలంగాణ తెలుగులో దీర్ఘాలు బాగా పొడవైన సమాసాలు సంస్కృత పదా భూయిష్టమైన తీరుతెన్నులు బాగా తక్కువ. నలిమెల భాస్కర్ 'తెలంగాణ పదకోశం' లో అనేక పదాల కూర్పు జరిగింది. తెలంగాణ పద సౌందర్యాన్ని కొంతవరకు బయలు ఏర్పగలిగిన అయినా ఇట్లా అంటాడు. "ఏ భాషకైనా జవజీవాలు, జాతీయాలు సామెతలే!... తెలంగాణ వాసుల పలుకు పలుకులో నుడికారం ఉంటుంది. చల్లగా ఉండేది చల్ల (మజ్జిగ), ఎర్రగా ఉండేది ఎర్ర (వానపాము), లాగుతూనే వేసుకునేది లాగు = ప్యాంటు, అంగాన్ని కప్పి ఉంచేది = అంగి, కంకుతూ తింటం గనుక కంకి. ఇలాంటి మాటలెన్నో నలిమెల భాస్కర్ మనమందు ఉంచాడు. అదేవిధంగా "గుమ్మి" అనేది ప్రముఖ తెలంగాణ కథా రచయిత మరియు నవలాకారుడైన డా. కాలువ మల్లయ్య రచించిన ఒక విశిష్టమైన పుస్తకం. తెలంగాణ అస్తిత్వ చైతన్యం, అక్కడి జీవన విధానంపై విస్తృతంగా రచనలు చేసిన ఆయన, ఈ పుస్తకం ద్వారా స్థానిక భాషా సంపదను అక్షరబద్ధం చేశారు. ఈ పుస్తకం "తెలంగాణ వాడుక భాషా పలుకులు, పలుకుబడులు" అనే అంశంపై రాయబడింది. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు నిత్యం మాట్లాడే విలక్షణమైన పదాలు, సామెతలు, జాతీయాలు మరియు మరుగున పడిపోతున్న పలుకుబడులను ఇందులో పొందుపరిచారు. 'గుమ్మి' అంటే తెలంగాణ పల్లెల్లో ధాన్యాన్ని దాచుకునే పెద్ద బుట్ట లేదా నిల్వ పాత్ర. పల్లె ప్రజల నోట పలికే అమూల్యమైన భాషా పదాలను భద్రపరిచే ఒక నిల్వ పాత్ర లాంటిది కాబట్టే ఈ పుస్తకానికి ఆయన "గుమ్మి" అని పేరు పెట్టారు. తెలంగాణలో మనుషులు సహృదయాలు. వారి జీవితం నిర్మలమైనది. కల్మషం, కుట్ర కుతంత్రాలు ఎఱగనోళ్ళు, వారి కార్యక్రమాల్లో ఎన్నో పలుకుబడులు నిత్యం తానం ఆడుతాయి. కొన్నింటిని పరిశీలిద్దాం;

మిగితా తరువాయి రేపటి సంచికలో..

-జాటావత్ రాజు (యువ కవి, రచయిత)
9347196264,తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.

# భగాయత్ ఫేస్ - 2లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- కాలనీ అభివృద్ధికి కృషి చేస్తాం
- ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, జూలై 19 (జనం సాక్షి) :** ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లేఅవుట్ ఫేస్--2లో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. వాసవి మెట్రోపోలిస్ గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ ఆహ్వానం మేరకు ఆదివారం ఆయన ఫేస్--2 ప్రాంతంలో విస్తృతంగా పర్యటించి కాలనీలోని సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ వాసులతో కలిసి పలు ప్రాంతాలను సందర్శించిన పరమేశ్వర్ రెడ్డి, స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వివరాలు తెలుసుకున్నారు. మౌలిక వసతుల కల్పనలో ఉన్న లోపాలు, రహదారుల పరిస్థితి, ఖాళీ స్థలాల్లో వ్యర్థాల పారవేత, భద్రతా సమస్యలు తదితర అంశాలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాసవి మెట్రోపోలిస్ గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, దేవాలయం, కమ్యూనిటీ సెంటర్ కోసం కేటాయించిన స్థలాలను ఆక్రమణల నుంచి రక్షించేందుకు వెంటనే ప్రహరీ గోడలు నిర్మించాలని కోరారు. అలాగే కాలనీలో ఇప్పటికీ పూర్తికాని అప్రోచ్ రహదారులను నిర్మించడంతో పాటు, దెబ్బతిన్న అంతర్గత రహదారులకు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఖాళీ స్థలాల్లో కొందరు విచక్షణారహితంగా చెత్త, నిర్మాణ వ్యర్థాలను పడేస్తుండటంతో దుర్వాసన వ్యాపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై సంబంధిత శాఖలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, చెత్త పారవేతను పూర్తిగా అరికట్టాలని కోరారు. అదేవిధంగా కాలనీలో పోలీసు గస్తీని పెంచి భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కాలనీ వాసులు ప్రస్తావించిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని మందుముల పరమేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. దేవాలయం, కమ్యూనిటీ సెంటర్ స్థలాల పరిరక్షణ కోసం ప్రహరీ గోడల నిర్మాణం, పెండింగ్‌లో ఉన్న రహదారుల నిర్మాణం, దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, పారిశుధ్య సమస్యల పరిష్కారం, భద్రతా చర్యల బలోపేతం వంటి అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి మెట్రోపోలిస్ గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ వాసులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మణికొండలో ముగిసిన తెలంగాణ అండర్-15 బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్




**రాజేంద్రనగర్, జూలై 19 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో మణికొండలోని మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ స్టేడియంలో నిర్వహించిన యోనెక్స్ సన్‌రైజ్ 12వ తెలంగాణ రాష్ట్ర అండర్-15 బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2026 ఆదివారం ఘనంగా ముగిసింది. మూడు రోజులపాటు జరిగిన పోటీల్లో చిన్మయ్ వాంకెడే బాలుర సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో విజేతగా నిలిచి డబుల్ క్రౌన్ సాధించగా, షాన్వి రెడ్డి నిమ్మ బాలికల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో రెండు స్వర్ణ పతకాలు కైవసం చేసుకుంది. టోర్నమెంట్ సందర్భంగా భారత ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ పోటీలను వీక్షించి యువ క్రీడాకారులను అభినందించారు. ముగింపు వేడుకలో విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేసి సత్కరించగా, యువ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని అతిథులు ఆకాంక్షించారు. అకాడమీ చైర్మన్ ముప్పాల వేణు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి టోర్నమెంట్లను నిర్వహిస్తామని తెలిపారు.

## చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు ఆలవర్చుకోవాలి

- సరస్వతి శిశు మందిర్‌లో విద్యార్థి మండలి ఎన్నికలు



**తాండూరు, జూలై 19 (జనంసాక్షి) :** విద్యార్థీని విద్యార్థులుచదువుతో పాటు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సేవాభావం ఆలవర్చుకోవాలని పేర్కొన్నారు. శనివారం పట్టణంలో నిశ్రీ సరస్వతి శిశు మందిర్, ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థి మండలి ఎన్నికలు ఎంతో ఉత్సాహంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో విజయవంతంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పారిశ్రామిక వేత్త సుబ్బారావు, దేవనూర్ శంకర్ హాజరయ్యారు. వారు ముందుగా పాఠశాలలో సరస్వతీ మాత పూజలో, ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సేవాభావం కూడా చాలా అవసరమని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు మరియు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో జరిగింది. నామినేషన్ల నుంచి ప్రచారం, రహస్య బ్యాలెట్ ద్వారా ఓటింగ్, ఆ తర్వాత ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశను పారదర్శకంగా నిర్వహించారు. విద్యార్థులు కూడా ఎంతో ఆసక్తిగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇలాంటి ఎన్నికల ద్వారా విద్యార్థుల్లో బాధ్యతాయుత భావన, ప్రజాస్వామ్య విలువలు పెరుగుతాయని అన్నారు. ఎన్నికైన విద్యార్థి ప్రతినిధులు పాఠశాల అభివృద్ధికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. చివరగా పాఠశాల యాజమాన్యం తరపున ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందానికి, ఎన్నికల నిర్వహణలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. మొత్తంగా శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో జరిగిన ఈ విద్యార్థి మండలి ఎన్నికలు, విద్యార్థులకు ఒక మంచి అనుభవంగా నిలిచాయి.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

- సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ఎ. సలీం




**మక్తల్, జూలై 19 (జనంసాక్షి) :** సోనమ్ వాంగ్ చుక్ ఆమరణ నిరాహార దీక్ష విరమింప చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ కేంద్ర కమిటీ నిరసన కార్యక్రమాలు చేపట్టాలనే పిలుపులో భాగంగా మక్తల్ పట్టణంలో ఆదివారం అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సోనమ్ వాంగ్ చుక్ భరతదేశం లోని లడఖ్‌కు చెందిన ఇంజనీర్, విద్యా సంస్కర్త, ఆవిష్కర్త, పర్యావరణ ఉద్యమకారుడు అన్నారు. పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధి, స్థానిక అవసరాలకు అనుగుణమైన సాంకేతిక పరిష్కారాల కోసం ఆయన ప్రసిద్ధి చెందారు. 2018లో ఆయనకు రామన్ మాగ్సెసే అవార్డు లభించిందన్నారు. ఇటీవలి కాలంలో నీట్ పేపర్ లీక్ కారణంగా సుప్రీంకోర్టు జస్టిస్ వ్యాఖ్యలతో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్మంతర్ దగ్గర జరుగుతున్న నిరసనలో భాగంగా సోనమ్ వాంగ్ చుక్ ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి 20 రోజులు గడుస్తున్నప్పటికిని కేంద్ర ప్రభుత్వం చర్చలు చేపట్టలేదు. దున్నపోతు మీద వాన పడ్డట్టు వ్యవహరించింది. పైగా సోనం వాంగ్చుక్కు పై దేశద్రోహి అని ముద్ర వేస్తూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం నిందితులకు వత్తాసు పలుకుతుందని విమర్శించారు. నీటి పేపర్ లీకేజీ చేసిన దొంగలను కఠినంగా శిక్షించాలని కోరారు. పేపర్ లీకేజ్‌కి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం ఎల్ ) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ఎ సలీం, ఏఐయుకేఎస్ జిల్లా అధ్యక్షులు భగవంతు, టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు కిరణ్, పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు శారద, సీపీఐ(ఎం ఎల్ )మాస్ లైన్ నాయకులు కళ్యాణం రాజు, టి యు సి ఐ జిల్లా కోశాధికారి కొలిమి రాములు, టి ప్ర జి ప వ యు నాయకులు నరేష్ లు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 16న చెంగిచెర్లలో ఘనంగా బోనాల ఉత్సవాలు



**బోడుప్పల్, జూలై 19 (జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే రాష్ట్ర పండుగ బోనాల ఉత్సవాలను ఈ ఏడాది ఆగస్టు 16న చెంగిచెర్లలో ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి సంవత్సరం నిర్వహించే బోనాల ఉత్సవాలను ఈసారి కూడా భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఉత్సవాల విజయవంతానికి గ్రామ ప్రజలు, యువత, కాలనీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు, మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్ ,బింగి జంగయ్య యాదవ్ బోడుప్పల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్, చెంగిచెర్ల గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్, సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు కొత్త రవి గౌడ్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు రంగ బ్రాహ్మణ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొత్త ప్రభాకర్ గౌడ్, కుర్రి శివశంకర్, కొత్త శ్రీశైలం గౌడ్, కొత్త గోపాల్ గౌడ్, కొత్త విక్రమ్ గౌడ్, కుర్రి మహేష్, వివిధ కుల సంఘాల పెద్దలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

## తెలుగు భాషకు మాతృభాషే పట్టుకొమ్మ



**మల్కాజిగిరి, జూలై 19 (జనంసాక్షి) :** భాషా వికాసానికి, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు మాతృభాషే పట్టుకొమ్మని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నమోజు బాలచారి అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో,అక్షర కౌముది సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ అవధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్ స్వర్ణావధాన విజయోత్సవ సభ ఆదివారం మల్కాజిగిరిలో ఘనంగా జరిగింది. ఈ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ. మాతృభాష పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పాటు, భాషా చైతన్యం కోసం అక్షర కౌముది సంస్థ చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఇలాంటి సాహిత్య కార్యక్రమాలకు అక్షర అకాడమీ ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ పక్షాన ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డికి సినారె పురస్కారం,ప్రముఖ సినీ నటులు బాబు మోహన్‌కు గురు సౌభాగ్య పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా కోశాధికారి బాలచందర్ గౌడ్, ఆలయ ప్రధానార్చకులు ముడుంబై వెంకట రమణాచార్యులు, కండ్లకుంట యాదగిరాచార్యులు, మారుమాముల దత్తాత్రేయ శర్మ, కవి రామకృష్ణ చంద్రమౌళి, తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షులు బడే సాబ్, అక్షర కౌముది సంస్థ ప్రతినిధులు తులసి విజయలక్ష్మి, డా. తులసి వెంకట రమణాచార్యులు, మూర్తి శ్రీదేవి, బచ్చల మాధవి, పోచం సుజాత తదితర సాహితీవేత్తలు పాల్గొన్నారు.


## నిజాంపేట్‌లో వైభవంగా పూరి జగన్నాథ రథయాత్ర



నిజాంపేట్, జూలై 19 (జనం సాక్షి) : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన పూరి జగన్నాథ రథయాత్ర ఎంతో వైభవంగా నిర్వహించారు. జగన్నాథ రథయాత్ర కార్యక్రమాన్ని దేవస్థాన ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. దేవస్థానము నుంచి మొదలైన రథయాత్ర జయదీపిక ఎస్టేట్స్ వరకు ఎంతో కన్నుల హర్ష పండుగగా కొనసాగిన రథయాత్రలో శ్రీనివాస్ రెడ్డి సైతం పాల్గొన్నారు . ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో రథయాత్రలో పాల్గొని జగన్నాథ స్వామికి జయజయ హర్షధ్వానాలు తెలిపారు ఈ కార్యక్రమంలో దేవస్థాన భక్తబృందం, ఆలయ ప్రధాన అర్చకులు బదరినారాయణ చార్యులు, వెంకటరమణ చార్యులు, వాసు వరగాని, ఏలూరి సత్య(నాని), రామచంద్రనాయక్, లక్మణ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో మహనీయుల విగ్రహాలు, అమరవీరుల స్తూపం ఆవిష్కరణ

- మంత్రి జూపల్లి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ఫరూఖ్ నగర్, జూలై 19 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజా నాయకులు, దేశానికి విశిష్ట సేవలందించిన మహనీయుల జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే శంకర్ చేతుల మీదుగా ఆవిష్కరణ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాత జాతీయ రహదారి పక్కన ఉన్న మండల పరిషత్ ప్రహరీ ముందు ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, స్వాతంత్ర్య పోరాట యోధుడు రాజా వెంకటరెడ్డి, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, ప్రజాకవి గద్దర్ విగ్రహాలను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కోదండరాం రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంయుక్తంగా ఆవిష్కరించారు. యువతక స్ఫూర్తిదాయకమైన మహనీయులు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం, విద్య, విజ్ఞాన రంగాల్లో విశేష కృషి చేసిన మహనీయుల జీవితాలు యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. వారి ఆశయాలను భావితరాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. హర్షం వ్యక్తం చేసిన ప్రజలు, సంఘాల నాయకులు వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, మహనీయుల అభిమానులు విగ్రహాల ఆవిష్కరణ పట్ల హర్షం వ్యక్తం చేశారు. పట్టణానికి ఈ విగ్రహాలు ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, గిరిజన ఆదివాసీ కోఆర్డినేటర్ పి. రఘు, చెంది తిరుపతి రెడ్డి, కృష్ణారెడ్డి, సజీవన్, ముబారక్ అలీ ఖాన్ తదితరులతో పాటు ఐకాసా నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంతలో సందడి చేసిన షార్ట్ ఫిలిం హీరోయిన్ కళ్యాణి

- షూటింగ్‌ను ఆసక్తిగా తిలకించిన జనాలు
- పల్లెటూరి ప్రేమ కథను చూపించేలా పాట చిత్రీకరణ
- వివరాలు వెల్లడించిన దర్శకుడు ఈర్లపల్లి రమేష్

**బొంరాస్‌పేట, జూలై 19 (జనం సాక్షి) :** మండల పరిధిలోని తుంకిమెట్ల, బొంరాస్ పేట ఏకో టూరిజం పార్కులోని గజేమో వద్ద షార్ట్ ఫిలిం ఫేమస్ హీరోయిన్ కళ్యాణి ఆదివారం సందడి చేశారు. దుద్యాల మండలం లగచర్ల గ్రామానికి చెందిన దర్శకుడు ఈర్లపల్లి రమేష్ భార్యాభర్తల అనుబంధంలో కొనసాగే ప్రేమను చూపించే విధంగా పల్లెటూరి ప్రేమ కథను చూపించే చిత్రాన్ని షూటింగ్ నిర్వహించారు. లఘు చిత్ర షూటింగు సందడి కూరగాయల మార్కెట్లో జనాలు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో కెమెరామెన్ సునీల్, సంగీతం శంకర్,ప్రొడక్షన్ మేనేజర్ చందు, విష్ణు,నరసింహ,వంశీ,తదితరులు పాల్గొన్నారు. హీరోయిన్ గా కళ్యాణి హీరోగా విక్కీ నటించిన జరిగిందన్నారు.



# అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ సీఎం రేవంత్ రెడ్డి

- కేసీఆర్‌పై మరోసారి మాట్లాడితే ఖబడ్దార్
- మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



**బోడుప్పల్, జూలై 19 (జనంసాక్షి) :** అబద్ధాలు, అసత్య ప్రచారాలతో ప్రజలను మోసం చేస్తూ అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అస్తవ్యస్తం చేసిందని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అబద్ధాలు చెప్పడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిట్ట అని విమర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. కేటీఆర్ నిర్వహించిన యువ సంగ్రామ సభతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత బట్టబయలైందని, ఆ సభ విజయాన్ని చూసి కాంగ్రెస్ నాయకులే ఆందోళన చెందుతున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి ప్రతీక అయిన ప్రజాకవి అందెశ్రీ పేరును కూడా స్వార్థ రాజకీయాల కోసం వాడుకోవడం దుర్మార్గమని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధన నుంచి అభివృద్ధి వరకు కేసీఆర్ చేసిన సేవలను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరువరని, అలాంటి నాయకుడిపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి హెచ్చరిక చేశారు. మరోసారి కేసీఆర్ గురించి అనుచితంగా మాట్లాడితే బీఆర్ఎస్ శ్రేణులు చూస్తూ ఊరుకోవని, ప్రజలే తగిన సమాధానం చెబుతారని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కాళేశ్వరం నీటిని ఇతర ప్రాంతాలకు మళ్లిస్తూ రైతులను నష్టపరుస్తోందని, హైడ్రా పేరిట పేదల ఇళ్లను కూల్చివేస్తోందని, ఉద్యోగ నియామకాల పేరుతో యువతను మోసం చేస్తోందని జక్క వెంకట్ రెడ్డి ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు ప్రస్తుత ప్రభుత్వం తన పాలనలో చేసిన ఖర్చులు, అమలు చేసిన హామీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎరువులు లేవని, సాగునీరు అందడం లేదని, ఉద్యోగులు, నిరుద్యోగులు, మహిళలు, గ్రామ పంచాయతీలు ఇలా అన్ని వర్గాలు కాంగ్రెస్ పాలనతో విసిగిపోయాయని అన్నారు. భూదందాలు, అవినీతి, మాట తప్పిన హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని విమర్శించారు. ఇప్పుడే ముందస్తు ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీకి ఘోర పరాభవం తప్పదని జక్క వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి ,మంద సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పరిపూర్ణంకు ఎక్సలెన్సీ ఇన్ జర్నలిజం అవార్డు



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జూలై 19 (జనంసాక్షి) :** సమాజానికి నిబద్ధతతో సేవలందిస్తున్న వారిని గుర్తించి సత్కరించడం ద్వారా వారు మరింత ఉత్సాహంతో ప్రజాసేవలో ముందుకు సాగేందుకు ప్రోత్సాహం లభిస్తుందని మాజీ మంత్రి పుష్పలీల అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిజం రంగంలో విశేష సేవలు అందిస్తున్న పరిపూర్ణంకు ఎక్సలెన్సీ ఇన్ జర్నలిజం అవార్డును మాజీ మంత్రి పుష్పలీల చేతుల మీదుగా ప్రదానం చేశారు. అనంతరం పుష్పలీల మాట్లాడుతూ ఉత్తమ సేవలందించిన వ్యక్తులను గుర్తించి సత్కరించడం ద్వారా వారు మరింత బాధ్యతతో, నిబద్ధతతో ప్రజలకు సేవలందించేలా చేయడమే ఇటువంటి అవార్డుల ముఖ్య ఉద్దేశమని అన్నారు. నేటి సమాజంలో కుటుంబ విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ముఖ్యంగా పిల్లలు తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకుండా వారి ఆలనాపాలన చూసుకోవాలని సూచించారు. మన తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను గౌరవిస్తూ భావితరాలకు అందించాలని, ఉన్నత పౌర సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరిపూర్ణం గతంలోనూ జర్నలిజం రంగంలో చేసిన సేవలకు అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2012లో కర్నూలు జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ చేతుల మీదుగా వీఆర్ బొమ్మారెడ్డి అవార్డు అందుకున్నారు. అనంతరం 2013లో ప్రకాశం జిల్లా ఎల్లటూరులో రెండోసారి అదే అవార్డును అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం 2015లో అప్పటి జిల్లా కలెక్టర్ రోనాల్డ్ రోజ్ చేతుల మీదుగా ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు, 2016లో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ మరియు అప్పటి మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా మరోసారి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డును అందుకుని తన ప్రతిభను చాటుకున్నారు. తాజాగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రగతి ఫౌండేషన్ ప్రదానం చేసిన ఎక్సలెన్సీ ఇన్ జర్నలిజం అవార్డు అందుకోవడం పట్ల పరిపూర్ణం హర్షం వ్యక్తం చేశారు. ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని, ప్రజా సమస్యలను నిష్పాక్షికంగా వెలుగులోకి తీసుకురావడంలో మరింత కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రగతి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనివాసులు, భీష్మరాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజ్‌కుమార్ రెడ్డి, అవార్డు గ్రహీతలు, పాత్రికేయులు, సాహితీవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఉపాధ్యాయులకు పిఆర్‌సి, డిఏ వెంటనే ప్రకటించాలి

- టిఆర్టిఎఫ్ ప్రధాన కార్యదర్శి మా రెడ్డి అంజిరెడ్డి




**నంగునూర్, జూలై 19 (జనం సాక్షి) :** ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు పి ఆర్ సి, డి ఎ , వెంటనే ప్రకటించాలని టిఆర్టిఎఫ్ ప్రధాన కార్యదర్శి మా రెడ్డి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రోజు సిద్దిపేట పట్టణంలోనిలోని ఎస్ఎస్‌బి గార్డెన్స్ లో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ ద్వితీయ కార్యవర్గ సమావేశం నిర్వహించబడింది. సమావేశంలో ప్రధాన కారుదర్శి మారెడ్డి అంజిరెడ్డి నివేదికను ప్రవేశపెట్టారు. నివేదికపై 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తమ అభిప్రాయాలను తెలియచేశారు. రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్ మాట్లాడుతూ పిఆర్సి , డిఎ లను వెంటనే ప్రకటించాలని, సిపిఎస్ ను రద్దు చేసి ఓ పి ఎస్ ను అమలుచేయాలని, టెట్‌లో సర్వీస్ పాయింట్స్‌ని కేటాయించాలని అందరికి 40% అర్హత మార్కులకు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ ని ఫ్రేమ్ చేయాలని, 190 జీవో ను అమలుచేయాలని, 25 జీవో కి సవరణ చేసి ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్ ను కేటాయించి మోడల్ ప్రైమరీ స్కూల్స్‌ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్టిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణ టీజేఎంయూతోనే సాధ్యం



**నారాయణఖేడ్, జూలై 19 (జనం సాక్షి) :** ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణ టీజేఎంయూతోనే సాధ్యమని టీపీసీ ప్రధాన కార్యదర్శి, టీజేయంయూ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ అన్నారు. ఆదివారం నారాయణఖేడ్ డిపో కార్మికులతో సమావేశమై అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఆర్టీసీ కార్మికులను వంచించి మోసం చేసిందన్నారు. తెలంగాణ సాధనలో ఆర్టీసీ కార్మికులకు కీలక పాత్ర పోషించినప్పటికీ, తెలంగాణ సాధించిన అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల హక్కులను కాలరాశాడన్నారు. 2017లో కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం టీజేఎం యూను స్థాపించి, అనేక పోరాటాలను చేయడం జరిగిందన్నారు. 2019లో 97 డీపోలో కార్మికుల చైతన్య యాత్రను చేసి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని పోరాటాలు చేసి, ఆ దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఆర్టీసీ కార్మికులను కూడా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు రావడమే కాకుండా అన్ని వసతులు కల్పిస్తామని, సమాజంలో కూడా గుర్తింపు ఉంటుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రవాణా మంత్రి పొన్నాల ప్రభాకర్ లు, కార్మికులు సంక్షేమానికి, ఆర్టీసీ పరిరక్షణ చర్యలు చేపట్టారన్నారు. అందువల్ల త్వరలో జరగనున్న గుర్తింపు ఎన్నికల్లో టీజేఎంయూ ను బలపరచాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీజేఎంయూ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పల్లె కృష్ణమూర్తి, సంగారెడ్డి రీజినల్ సెక్రెటరీ అంజయ్య గౌడ్, స్థానిక కార్మికులు పాల్గొన్నారు. అంతకుముందు తోపాజి అనంత్ కిషన్, హనుమంతు ముదిరాజ్, పల్లె కృష్ణమూర్తి, అంజయ్య గౌడ్ స్థానిక మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శెట్కర్, డిసిసి ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి కలిసి నారాయణఖేడ్ లో టీజేఎంయూ బలపడి విధంగా సహకరించాలని కోరారు.

## ప్రజలకు పరిశుద్ధి నీటిని సరఫరా చేయాలి

- వాటర్ పంప్ హౌస్‌ను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్



**నారాయణపేట, జూలై 19 (జనం సాక్షి) :** పట్టణ ప్రజలకు పరిశుద్ధ నీటిని సరఫరా చేయాలని నారాయణపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కొండ స్వేత సత్య యాదవ్ పంపు హౌస్ సిబ్బందికి సూచించారు. ఆదివారం ఉదయం 7 గంటలకు నారాయణపేట పట్టణానికి నీటి సరఫరా చేసే సింగారం సమీపంలోని వాటర్ పంప్ హౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వాటర్ పంప్ హౌస్‌లోని నీటి సరఫరా, పంపింగ్ వ్యవ స్థను స్వయంగా పంప్ హౌస్ పైకి వెళ్లి పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నారాయణపేట పట్టణ ప్రజలకు నిరంతరాయంగా తాగునీటి సరఫరా అందిం చేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించా రు.వాటర్ పంప్ హౌస్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, ఎప్పటికప్పుడు శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని అధికా రులకు సూచించారు. అలాగే నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రస్తుతం నారాయణపేట పట్టణానికి రోజుకు సుమారు 6.6 ఎం ఎల్ డి నీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. ప్రజలకు తాగునీటి ఇబ్బం దులు కలగకుండా మున్సి పాలిటీ తరఫున అన్ని చర్యలు తీసుకుంటున్నా మని చైర్‌పర్సన్ తెలిపారు.ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, నీటి విలువను గుర్తించి మున్సిపాలిటీకి సహకరించాలని కొండ స్వేత కోరారు.

# లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

- నారాయణపేట జిల్లా ఏఐటియుసి ఉపాధ్యక్షులు పి. వెంకటేష్



**ధన్వాడ, జూలై 19 (జనం సాక్షి) :** లోడింగ్ అన్ లోడింగ్ హమాలీ కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని నారాయణపేట జిల్లా ఐ టి యు సి ఉపాధ్యక్షులు పి వెంకటేష్ డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో ఆదివారం నాడు లోడింగ్ అన్లోడింగ్ హమాలి కార్మికుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపుగా 30 సంవత్సరాలుగా హమాలి కార్మికులు పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు. కావున నేటి వరకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందక కార్మికుల జీవితాలు నిరాశ్రయంగా అవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హమాలి కార్మికులు రోడ్లపై ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని పని చేస్తున్నారన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వాలు జిల్లాలో పేట జిల్లాలో అనేక మండలాల్లో పనిచేస్తున్న హమాలి కార్మికులకు నేటి వరకు ప్రభుత్వపరంగా ప్రస్తుతం గుర్తింపు కార్డు లేవన్నారు. అందుకు ప్రభుత్వం వెంటనే కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికులకు ప్రభుత్వ స్థలాల్లో హమాలీ కార్యాలయం కోసం ప్రభుత్వ అధికారులు స్పందించి వారికి వంద గజాల స్థలాన్ని కేటాయించాలన్నారు. అదేవిధంగా హమాలి కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు పేదలను గుర్తించి ఇవ్వాలన్నారు. అదేవిధంగా వీరికి జీవిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న హమాలీ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తించకపోతే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హమాలి సంఘం అధ్యక్షులుగా నేటి శ్రీనివాసులు, కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షులు రాములు, సహాయ కార్యదర్శి తిమ్మన్న, కోశాధికారి ఎల్లప్ప, శ్రీనివాసులు నాగరాజు చిన్న వెంకటన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

- మూడు గ్రామాలకు గ్రామశాఖ అధ్యక్షుల ప్రకటన



**బెజ్జంకి, జూలై 19 (జనం సాక్షి) :** మండలంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా నూతన గ్రామ కమిటీల ఏర్పాటు చేపట్టినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ తెలిపారు.బెజ్జంకి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వద్లూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడిగా కాసాని శ్రీనివాస్,తలారివానిపల్లె గ్రామశాఖ అధ్యక్షుడిగా ఎల తిరుపతి,దేవక్కపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా మెండే నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రకటించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన గ్రామశాఖ అధ్యక్షులు పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని,కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని,పార్టీ సిద్ధాంతాలు,నియమావళికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీపీ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ నూతన గ్రామశాఖ అధ్యక్షులను శాలువాలతో సన్మానించి అభినందించారు.గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిలువెరి శ్రీనివాస్ రెడ్డి,వద్లూరు సర్పంచ్ పులి రమేష్,డైరెక్టర్ పులి సంతోష్,తలారివానిపల్లె సర్పంచ్ గండికోట సురేష్,ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి,లక్ష్మీనరసింహస్వామి ఆలయ మాజీ చైర్మన్ జెల్ల ప్రభాకర్,ఒంటెల సంపత్ రెడ్డి,బైర సంతోష్,రావుల నర్సయ్య,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రావుల సందీప్, రాసూరి మల్లికార్జున్,గుండారం గ్రామశాఖ అధ్యక్షుడు ప్రశాంత్‌తో పాటు పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ నూతన కమిటీకి ఎమ్మెల్యే టీఆర్ఆర్ దిశానిర్దేశం



**మహమ్మదాబాద్, జూలై 19 (జనంసాక్షి) :** రైతుల సంక్షేమం,సహకార సంఘం బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. మహమ్మదాబాద్ నంచర్ల గేట్ ఎక్స్‌రోడ్డులోని పల్లవి ఆడిటోరియంలో ఇటీవల గండీడ్ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)నూతన పాలకవర్గానికి ఏర్పాటు చేసిన ఘన సన్మాన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. (పీఏసీఎస్)చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కమతం శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన కమతం విష్ణువర్ధన్ రెడ్డితో పాటు నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే టీఆర్ఆర్ శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం నూతన పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించి,తమకు అందించిన సహకారం, ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీఆర్ఆర్ మాట్లాడుతూ..రైతులకు అండగా నిలిచే ప్రధాన సంస్థలు పీఏసీఎస్‌లేనని పేర్కొన్నారు. రైతుల విశ్వాసాన్ని నిలబెట్టేలా పారదర్శకత,నిబద్ధతతో సేవలందించాలని నూతన కమిటీకి సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేఎం నారాయణ,అనంతలక్ష్మి రెడ్డి, మాజీ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు కొత్త నారాయణ, బాలముకుందం,బోయిని పుష్పలత గోపాల్,మాజీ ఎంపీపీ శాంతిబాయి, సర్పంచులు జె.రామ్‌లాల్,దొంగల మణెమ్మ, అంజా నాయక్, రాజశేఖర్ శ్రీనివాసులు,లక్ష్మీ మోహన్, లక్ష్మీ మైభయ్యా, పాలకవర్గసభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి




**సంగారెడ్డి, జూలై 19 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లాను ప్రభుత్వం తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలని, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, రైతులు వేసిన పంటలు ఎండి పోవడంతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా చుక్క రాములు తెలిపారు. ఆదివారం సిపిఎం సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతంగంలో తీవ్ర ఆందోళన నెలకొంటుందని, దీనికి తోడు విద్యుత్ కోతలు కూడా పెరిగిపోతున్నాయని రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాలు లేక సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లోని వర్షాధార పంటలపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. ముఖ్యంగా పత్తి, కంది, మినుము వంటి పంటలు సాగు చేసే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తేమ లేకపోవడం వల్ల విత్తనాలు మొలకెత్తే దశలోనే ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, ఎం. మానిక్ రాజయ్య, సాయిలు, రాంచందర్ నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్, నాగేశ్వర్ రావు, యాదగిరి, మహిపాల్, విద్యాసాగర్, రేవంత్, కృష్ణ తది తరులు పాల్గొన్నారు.

# గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్లొద్దు

- ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 19 (జనం సాక్షి) :** ప్రజల సొమ్ము దోచుకోనేం దుకు సైబర్ నేరగాళ్ళు రోజు,రోజుకి కొత్త కొత్త పోకడలతో ప్రజల బలహీ నతలను పెట్టుబడిగా చేసుకోనేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారు.మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలకు ఒక ప్రకటనలో తెలిపారు.గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తూ ప్రజలను మోసం చేసే మల్టిలెవెల్ వ్యాపారాలు పెరుగుతున్నా యి, మీ క్రింద ఎక్కువ మంది ఎజెంట్లను చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే వాటిని నమ్మవద్దు అని ఎస్పీ అన్నారు. ఇలాంటి మల్టీలెవల్ వ్యాపారం చేస్తూ ప్రజల నుండి డబ్బు లు సేకరించి ఆర్థికంగా మోసం చేస్తూ చైన్ సిస్టం మార్కెటింగ్ వ్యాపారాల ద్వారా ఆర్థికపరమైన మోసాలు జరుగుతున్నా యని ప్రజలు గుర్తించాలని కోరారు.ఎక్కువమంది ఏజెంట్లను చేర్పిస్తే రివార్డు లు, పాయింట్లు లభిస్తాయని కేటుగాళ్లు ఆశ చూపు తారు.ఇలాంటి వారి మాయమాటలు నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టం జరుగుతుంది అన్నారు.సైబర్ మోసగాళ్ళు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నా రు.సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ మోస గాళ్లు మల్టీలెవెల్ మార్కెటింగ్ పై దృష్టి సారించి గొలుసుకట్టు వ్యాపారాల పేరుతో వాట్సప్, టెలిగ్రా మ్, ఫేస్బుక్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు చేసి అమాయ కులను ఆకర్షించి మోసగిం చి ఆర్థిక నష్టాన్ని కలగజే స్తారు. మల్టీ లెవెల్ మార్కె టింగ్ ను చాలామంది విదేశాల్లో ఉండి ఒక రాకెట్ లా నడుపుతారు భారీ లాభాలు తోపాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట తమ ముఠాలతో అమాయ కులకు వలపన్నుతారని ఎలాంటి మాయ మాటలు నమ్మరాదు అని ఎస్పీ తెలి పారు.అతి తక్కువ కాలం లో అధిక లాభాలు వస్తా యని ఎవరైనా చెప్తే అది మోసమని గ్రహించాలి, లేదంటే ప్రజల్ని మాయలోకి దింపి డబ్బులు కొల్లగొడ తారు,అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం.గొలుసుకట్టు మార్కెటింగ్ లో ముందుగా చేరిన వారికి లాభాలు వస్తాయి ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిం దేనన్నారు.ఇలాంటి నెట్వర్క్ లో ఎవరు చేరొద్దు ఆయా సంస్థల నిర్వాహ కులు,కంపెనీలు పెట్టే సభలు, సమావేశాలకు ఎవరు వెళ్ళవద్దు. సోషల్ మీడియాలో వచ్చే అబ ద్ధపు ప్రకటన పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి, అనుమానాస్పద ప్రకటన లు, వెబ్ లింకులు, ఏపీకె ఫైల్స్ లాంటివి డౌన్లోడ్ చేయవద్దు. మోసపూరిత ప్రకటనలపై, ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయండి అని ఎస్పీ తెలిపారు.

## పొరుగు రాష్ట్రాలలో హెల్త్ కార్డులు చెల్లుబాటు కావాలి




**మల్దకల్, జూలై 19 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని ఎస్‌టియు భవన్ లో జరిగిన 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ప్రత్యేక సమావేశం ఆదివారము నిర్వహించారు.జోగులాంబ గద్వాల జిల్లా నుండిజోగులాంబ గద్వాల జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి యండి.యూనుస్ పాష పాల్గొని చర్చించిన అంశాలు సిజిహెచ్ఎస్ ప్యాకేజీ ధరలను సవరించి అన్ని కార్పొరేట్, నెట్వర్క్ ఆసుపత్రులలో ఎలాంటి సీలింగు లేకుండా హెల్త్ కార్డ్స్ అమలు చేయాలి. పొరుగు రాష్ట్రాల్లో కూడా కర్నూలు,రాయచూరు హెల్త్ కార్డ్స్ చెల్లుబాటు కావాలి,భార్య, భర్తలో ఎవరైనా సాఫ్ట్వేర్ బ్యాంకుకేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయిన సందర్భంలో ఆప్షన్ ఇవ్వాలి,పదోన్నతులు బదిలీలు చేపట్టాలి.ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ తో పాటు అర్హత మార్కులు తగ్గించాలి, 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు వారి సొంత జిల్లాలకు పంపాలి,పిఆర్సిపెండింగ్ డిఏల సాధనకు ఉద్యమించాలని కోరారు.ఈ సమావేశంలో ఆ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగాలివ్వాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి




**కాజీపేట, జూలై 19 (జనం సాక్షి) :** కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రైల్వే జేఏసీ, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మాడికొండ నుంచి కాజీపేట రైల్వే జంక్షన్ స్టేషన్ వరకు నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేరాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో వరంగల్ ప్రాంత యువత ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉద్యోగాల కల సాకారం కావాలని అన్నారు. ఫ్యాక్టరీలో కల్పించే ఉద్యోగాల్లో స్థానికులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో రైల్వే జేఏసీ తీసుకునే నిర్ణయాలకు అన్ని రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలని, జేఏసీ నాయకత్వంలో ఉద్యమం ఐక్యంగా కొనసాగాలని పిలుపునిచ్చారు. ఫ్యాక్టరీలో సుమారు మూడు వేల ఉద్యోగాలను స్థానిక యువతకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు లేని యువతకు శిక్షణ అందించేందుకు ప్రభుత్వం, సంబంధిత సంస్థలు ముందుకు రావాలని, అవసరమైన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించేందుకు తాము కూడా సహకరిస్తామని తెలిపారు. స్థానిక యువతకు వారి అర్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారానే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అదేవిధంగా, కోచ్ ఫ్యాక్టరీ కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, అలాగే ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు కూడా తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ప్రాంత అభివృద్ధికి, యువత భవిష్యత్తుకు మైలురాయిగా నిలవాలంటే స్థానికులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వే జేఏసీ నాయకులు,ప్రజా సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూల్చివేతకు సిద్ధంగా జీడబ్ల్యూఎంసీ భవనం!

- ఖాళీ చేసిన వివిధ కార్యాలయాల సెక్షన్లు
- వెనకాల ఉన్న కొత్త భవనంలోకి మార్పు
- 1970లో నిర్మించిన గ్రౌండ్ ఫ్లోర్ బిల్డింగ్
- 1988 లో అప్పటి సీఎం బ్రహ్మనంద రెడ్డి ఆధ్వర్యంలో రెండో ఫ్లోర్ నిర్మాణం
- 56 ఏండ్ల చరిత్ర ఉన్న మున్సిపల్ భవనం




**వరంగల్ బ్యూరో, జూలై 19 (జనం సాక్షి) :** చారిత్రక వరంగల్ నగరంలోని వరంగల్ మున్సిపల్ భవనం కూల్చివేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ క్రమంలో భవనంలోని వివిధ కార్యకలాపాలు నిర్వహించే ఇన్వార్డ్ అవుట్ వార్డ్, పౌర సేవలు, జనన మరణ ధ్రువీకరణ సెక్షన్, ట్రెజరీ, పెన్షన్, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్యం, పీఆర్వో, హార్టికల్చర్ మొదలైన కార్యాలయాలు, సెక్షన్లను భవనం వెనకాల ఉన్నటువంటి నూతన భవనంలోకి మార్చేశారు. ప్రస్తుతం అక్కడే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

### శిథిలావస్థకు చేరడమే కారణం..!

1970 సంవత్సరంలో అపటి సెక్రటరీ గోపాల్ రావు ఎగ్ బోటి ఆధ్వర్యంలో మొదట గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం చేశారు. ఆ తర్వాత 1988లో అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రడ్డి ఆధ్వర్యంలో రెండో ఫ్లోర్ నిర్మాణం జరిగినట్టు మున్సిపల్ భవనం వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకాల ద్వారా తెలుస్తుంది. సుమారు 56 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరడమే కాకుండా అప్పుడప్పుడు స్లాబ్ పెచ్చులు ఊడిపోయి, కార్యాలయంలో పనిచేసే సిబ్బంది మీద పడిన సందర్భాలు కూడా ఉండడం, వర్షం వస్తే స్లాబ్ నుండి నీళ్లు కారడం వల్ల కొత్త భవనం నిర్మించాలనే సంకల్పంతో మున్సిపల్ వ్యవస్థ సిద్ధమైనట్టు తెలుస్తుంది.

### చిన్న పురపాలక సంఘం నుండి గ్రేటర్ వరకు..

1934లో ఒక చిన్న పురపాలక సంఘంగా ఏర్పడింది. 1952లో హైదరాబాద్ ప్రభుత్వం మొదటిసారి ఎన్నికల నిర్వహించింది. 1959 జూలైలో, 1960 జూలైలో ఒక ప్రత్యేక మున్సిపాలిటీగా మార్చబడింది. అంచలంచెలుగా ఎదుగుతూ 1994లో మున్సిపల్ కార్పొరేషన్ గా రూపాంతరం చెందింది. 2015లో చుట్టుపక్కల ఉన్నటువంటి 42 గ్రామాలను విలీనం చేసి వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ స్థాయికి విస్తరించబడింది. ప్రస్తుతం 66 డివిజన్లతో ఏర్పడి ఉంది. ఇప్పటివరకు ఎందరో మున్సిపల్ చైర్మన్ లు, మేయర్లుగా ఎన్నికై పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు. అయితే 2011 నాటికి నగరంలో 6,2749 జనాభా ఉండగా , ప్రస్తుతం 8 ,30,281 జనాభా కంటే ఎక్కువ సుమారు పది లక్షల వరకు పెరిగినట్లు సమాచారం.

### నూతన భవనంలో కార్యకలాపాలు

పాత భవనం వెనకాల ఉన్నటువంటి కొత్త భవనంలో హార్టికల్చర్, పెన్షన్, ట్రెజరీ, డేట్ అఫ్ బర్త్, పీఆర్ఓ, ఇన్వార్డ్ అవుట్ వార్డ్, టౌన్ ప్లానింగ్, ఆరోగ్యశాఖ, మొదలైన శాఖల కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వరంగల్ నగరం పౌరులు ఆయా సెక్షన్లకు వెళ్లి సంబంధిత సిబ్బందిని కలుస్తున్నారు. మరికొద్ది నెలల్లో గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిషాన్ కనిపించకపోవచ్చు. ఆ స్థలంలో మరో నూతన భవనం నిర్మించే ఆలోచనలు ఉన్నట్టు సమాచారం.

## స్వతంత్ర సమరయోధుడు నున్న వెంకటయ్యకు ఘన నివాళి!

- ఉయ్యాలవాడలో ఘనంగా 15వ వర్ధంతి
- మహా అన్నదానం,బస్ షెల్టర్ పునఃప్రారంభం



**డోర్నకల్ జూలై 19 (జనం సాక్షి) :** భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి,ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు దివంగత నున్న వెంకటయ్య 15వ వర్ధంతి వేడుకలు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ గ్రామంలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన కుటుంబ సభ్యులు గ్రామంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో గ్రామంలో నున్న వెంకటయ్య – శేషమ్మల జ్ఞాపకార్థం నిర్మించిన బస్ షెల్టర్ ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా పునర్నిర్మించి, నేడు దానిని కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు కలిసి పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు,బంధుమిత్రులు దివంగత వెంకటయ్య దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాలను,ఆయన చూపిన ధైర్యసాహసాలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా యాది చేసుకున్నారు.సమాజ సేవలో ఆయన చూపిన బాటలోనే నేటి తరం నడవాలని పలువురు ఆకాంక్షించారు.

## పేద కుటుంబానికి పెద్ద ఆపద






- రోడ్డు ప్రమాదంలో కాలు నుజ్జునుజ్జు
- వైద్య ఖర్చులకు ఆదుకోవాలని కుటుంబీకుల వేడుకోలు

**నిర్మల్, జూలై 19 (జనంసాక్షి) :** ఖానాపూర్ మండలంలోని ఏర్వచింతల్ జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనలో అదే గ్రామానికి చెందిన కొడారి రాజమణి తీవ్రంగా గాయపడ్డారు.ఆ ప్రమాదం లో ఆమె కుడి కాలు నుజ్జు నుజ్జు కావడంతో డాక్టర్లు కాలు తొలగించారు.అలాగే ఎడమ కాలు విరిగింది.రెక్కాడితే గానీ డొక్కా ఆడని కుటుంబానికి క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యాయి.ప్రస్తుతం ఆమె జిల్లా కేంద్రంలోని దేవేందర్ రెడ్డి హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఉంది.నిన్నటి నుంచి ఆమె చికిత్స కొరకు రక్తం అవసరం కావడం తో సోషల్ మీడియాలో వైరల్ కావడం తో ఎంతో మంది మానవతా దృక్పథం తో ముందుకు వచ్చి రక్తదానం చేస్తున్నారు. ఆమె వైద్య చికిత్స కి ఎక్కువ మొత్తంలో డబ్బులు అవసరం పడుతుంది అని డాక్టర్లు చెబుతున్నారు.దీంతో ఆ కుటుంబీకులు దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారు.ఆమె వైద్య ఖర్చులకు ఎవరైనా తమకు ఆర్థికంగ ఆదుకోవాలి అని కుటుంబీకులు కన్నీటి పర్యంతం అవుతున్నారు .మానవత్వంతో స్పందించి, మీకు తోచినంత ఆర్థిక సహాయం చేసి ఆమెకు అండగా నిలవాలనికోరుతున్నారు.

### స్పందించిన రక్తదాతలు

ఈ ఘటనలో కోడారి రాజమణి కి బి పాజిటివ్ రక్తం అవసరం కావడంతో వివిధ మాధ్యమాల ద్వారా తెలుసుకున్న ఖానాపూర్ కాంగ్రెస్ జిల్లా యూత్ నాయకులు మడిగేలా అనిల్ వెంటనే దేవేందర్ రెడ్డి హాస్పిటల్ కి వచ్చి 21 వ సారి రక్త దానం చేశారు.అలాగే ఏర్వచింతల్ గ్రామానికి చెందిన జామిడి వినోద్, మరియు పలువురు రక్తదానం చేశారు.

**విరాళం పంపడానికి యూపీఐ వివరాలు**

పేరు: కోడారీ రామ్
ఫోన్ నంబర్: 6309324676
యూపీఐ ఐడీ: 6309324676@ybl

## సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలి



- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క
- ఎంచగూడెంలో ఘనంగా అమరుడు దేవన్న 26వ వర్ధంతి

**కొత్తగూడ జూలై 19 (జనంసాక్షి) :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెం గ్రామంలో సిపిఐ (ఎంఎల్) జనశక్తి రాష్ట్ర నాయకులు, ఉత్తర తెలంగాణ కార్యదర్శి భరత్ (దేవన్న) 26వ వర్ధంతి సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమరవీరునికి ఘన నివాళి.. నూతన విగ్రహానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంచగూడెంలోని దేవన్న అమరవీరుల స్థూపం వద్ద విమలక్క పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం దేవన్న విగ్రహ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో భాగంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు ఆలోచింపజేశాయి. విమలక్క మాట్లాడుతూ.. అమరవీరుల ఆశయాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, ఆ మార్గంలోనే ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. శాస్త్రీయ దృక్పథంతో సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు . సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం నెలకొల్పేందుకు ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ సిపిఐ ఎం ఎల్ జనశక్తి నాయకులు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు, వివిధ ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## 21న మంచిర్యాలకు కేటీఆర్ రాక



**మంచిర్యాల ప్రతినిధి జులై 19 (జనం సాక్షి) :** ఈనెల 21న మంచిర్యాల జిల్లాకు మాజీ మంత్రి కేటీఆర్ వస్తున్నారని రైతు సదస్సుకు హాజరవుతారని బిఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు విజిత్ రావు తెలిపారు. ఆదివారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో లక్షెట్టిపేట లో వాసవి హాల్లో ఏర్పాటు చేసే రైతు సదస్సులో పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువు దోపిడీకి గురి చేస్తుందని తెలిపారు. రైతు భరోసా, యూరియా కోసం రైతులు పడుతున్న బాధలు వర్ణాతీతం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువు దోపిడీకి గురి చేసిందని ఆరోపించారు .రైతుల కోసం చెప్పిన పథకాలు ఒకటి అమలుకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. సర్ ప్రక్రియ తప్పుల తడక గా కొనసాగుతుందని తెలిపారు. చాలామందికి ఫామ్ ఇవ్వడం లేదని ప్రతి ఒక్కరు సర్ ఫామ్ రింపి ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తెలిపారు . సర్ పై నిర్లక్ష్యం ఉంటే ఓటు హక్కు కోల్పోతారని పేర్కొన్నారు. మే నెలలో కురిసిన అకాల వర్షం తో పాటు పడిన పిడుగుపాటుకు గురై చనిపోయిన నలుగురు రైతు కుటుంబాలను పరామర్శించి వారికి ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయల చొప్పున రైతు కుటుంబ సభ్యులకు అందజేస్తారని తెలిపారు. రైతు సదస్సుకు రైతులందరూ తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని తెలిపారు.

## రాష్ట్రంలోని రైస్ మిల్లర్లందరికీ ఓటు హక్కు కల్పించాలి



**ములుగు, జూలై 19 (జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వానికి సీఎంఆర్ పెట్టె రైస్ మిల్లర్లు అందరికీ త్వరలో జరిగే రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా మిల్లర్లు డిమాండ్ చేశారు.ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో ములుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆరు జిల్లాలకు చెందిన అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు,సీనియర్ నాయకులు పాల్గొన్నారు.2013 నుంచి అసోసియేషన్ కు ఎన్నికలు జరగకపోవడంతో అప్పటినుంచి ఒకే కార్యవర్గం అధికారంలో ఉందని తెలిపారు.గ్రామీణ స్థాయిలో ఉన్న మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో ఆ కమిటీ పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. మిల్లర్ల సంక్షేమానికి వారు చేసింది ఏమి లేదన్నారు. దీంతో సదరు అసోసియేషన్ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా రైస్ మిల్లర్లు బయటకు వచ్చినట్లు పేర్కొన్నారు. తిరుగుబాటుకు భయపడ్డ రాష్ట్ర కమిటీ అసోసియేషన్ కార్యవర్గాన్ని రద్దు చేసిందని ఇది ఉమ్మడి జిల్లా రైస్ మిల్లర్ సాధించిన విజయమని స్పష్టం చేశారు. అయితే పాత బైలా ప్రకారంగా 25 వేల మెట్రిక్ టన్నుల సిఎంఆర్ కు ఒక ఓటు చొప్పున నిర్ణయించారని,ఇది రైస్ మిల్లర్ల సంక్షేమానికి పూర్తి విరుద్ధమని వెల్లడించారు. మిల్లు నడుపుతున్న ప్రతి యజమానికి ఓటు ఒక కల్పించాలన్నది తమ ప్రధాన డిమాండ్ అని తెలిపారు.దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైస్ మిల్లర్ ను సమీకరించి ఎన్నికల కమిటీపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు.ఉద్యమ కార్యచరణ సిద్ధమైందని,రైస్ మిల్లర్లు అందరూ సంఘటితం కావాలని కోరారు.ఈ సమావేశంలో ఆల్ ఇండియా రైస్ మిల్లర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు తోట సంపత్ కుమార్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవునూరి అంజయ్య వరంగల్ జిల్లా అధ్యక్షులు గోనెల రవీందర్,జనగామ జిల్లా అధ్యక్షులు ముత్తయ్య,భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు కోరే రవి,మహబూబాద్ జిల్లా కోశాధికారి సతీష్ మరియు వివిధ జిల్లాల కార్యదర్శులు నాయకులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో మొదటి స్థానంలో నిలవాలి

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపునకు ప్రయత్నిస్తున్న బిజెపి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**స్టేషన్ ఘన్‌పూర్, జూలై 19 (జనంసాక్షి) :** ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం రాష్ట్రం లోనే మొదటి స్థానంలో నిలవాలని ఆ దిశగా ప్రతీ ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పని చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య , మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు.

స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణ కేంద్రంలో ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్ ) పై నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్ లు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచు లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య , ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఏఐసిసి పరిశీలకులు అహ్మద్ నాసిర్ , టీపిసిసి నియోజకవర్గ పరిశీలకులు దుద్దిల్ల శ్రీను బాబు, మాస్టర్ ట్రైనర్ రాజశేఖర్ రెడ్డి , హన్మకొండ, జనగామ డిసిసి అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, లకావత్ ధన్వంతి పాల్గొన్నారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని, అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిర్లక్ష్యంగా తీసుకుంటే భవిష్యత్తులో ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధి అందకుండా ఇబ్బందులు తలెత్తేఅవకాశం ఉందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఓటరికి ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని, డబుల్ ఓట్లు, చనిపోయిన వారి పేర్లు, నకిలీ ఓట్ల తొలగింపుతో పాటు చట్టబద్ధమై న ఓటు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగిపోకుండా చూడాలని సూచించారు.ప్రస్తుతం నియోజకవర్గం జాబి నమోదు లో సుమారు 80 శాతం ప్రక్రియ పూర్తయిందని, మ్యాపింగ్ పనులు 94 శాతం వరకు జరిగినట్లు తెలిపారు. మిగిలిన రోజులలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని, జాబితాలో లేని వారిని ఫోన్ ద్వారా సంప్రదించి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బి ఎల్ ఓ లతో నిరంతరం సమన్వ యం కొనసాగించాలని, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే ఇన్‌చార్జీలు, వార్‌రూమ్ ప్రతినిధులు, పరిశీలకుల సహకారం తీసుకోవాలని పేర్కొన్నా రు. అర్బన్ ప్రాంతాల్లో ఉద్యోగాలు, బదిలీలు, పిల్లల చదువుల కారణంగా ప్రజలు నివాసాలు మారడంవల్ల ఓటర్లను గుర్తించడం కష్టంగా మారు తోందని, అలాంటి ప్రాంతాల్లో మరింత శ్రద్ధ అవసరమన్నారు.రాబోయే స్థానిక సంస్థలు, శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలపైకూడా ఈ సవరణ ప్రభావం ఉంటుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం ఎస్ఐఆర్ పేరుతో పెద్ద ఎత్తున ఓట్ల తొలగిం పునకు ప్రయత్నిస్తోందని ఆరోపించిన ఎంపీ, ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాల ని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో కనీసం 95 శాతం వరకు ఓటర్ల ధృవీకరణ పూర్తయ్యేలా కృషి చేయాలని కోరారు.ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలని అన్నా రు. ప్రస్తుతం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం రాష్ట్రంలో 4వ స్థానంలో ఉన్నట్లు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూమ్ మీటింగ్ లో తెలపడం సంతోషంగా ఉందని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో నిబద్ధతతో పని చేస్తున్న క్లస్టర్ ఇంచార్జ్ లు,బిఎల్ఏ లకు అభినం దనలు తెలిపారు. 25వ తేదీ మధ్యాహ్నం 3గంట లకు మరోసారి నియోజకవర్గ స్థాయి ఓటరు జాబి తా సవరణ కార్యక్రమంపై పూర్తిస్థాయి సమావేశం ఉంటుందని అన్నారు. 25వ తేదీ కి ఇంకా 6 రోజు ల సమయం ఉందని ఈ 6రోజులలో ప్రతీ బూత్ లో 95శాతం ఎన్యూమరేషన్ పూర్తి చేయాలని సూచించారు. బిఎల్ఏ లు, క్లస్టర్ ఇంచార్జ్ లు, సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు ప్రతీ ఒక్కరూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని పని చేయాలని తెలిపా రు. 25వ తేదీన క్లస్టర్ ఇంచార్జ్ లు, బిఎల్ఏలు, సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులతో నియోజకవ ర్గ స్థాయి సమావేశం ఉంటుందని,ఈ సమావేశాని కి క్లస్టర్ ఇంచార్జ్ ల పరిధిలో బిఎల్ఏలు,సర్పంచు లు, గ్రామ అధ్యక్షులు సమావేశానికి హాజరయ్యే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత క్లస్టర్ ఇంచార్జ్ లదే అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 100 శాతం ఎన్యూమరేషన్ పూర్తి చేసిన క్లస్టర్ ఇంచార్జ్ లకు కండువా కప్పి సత్కరించారు.ఈ కార్యక్రమం లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజ్, ఓటరు జాబితా సవరణ నియోజకవ ర్గ ఇంచార్జ్ లు, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్ లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నా రు.

## అందెశ్రీ స్మారక స్థూపం ఏర్పాటు అభినందనీయం

- బోడుప్పల్లో 387వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు జ్ఞానమాల
- తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారుల పాత్ర కీలకం
- తెలంగాణ ఉద్యమకారుల ఎంపిక పారదర్శకంగా కొనసాగాలి
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు




**బోడుప్పల్, జూలై 19 (జనంసాక్షి) :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 387వ ఆదివారం జ్ఞానమాల సమర్పించి భారత రాజ్యాంగ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను, త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రీయ గీతం రచయిత అందెశ్రీ స్మారక స్థూపాన్ని ఘట్కేసర్లో ఏర్పాటు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, తెలంగాణ ఉద్యమంలో కవులు,కళాకారులు కీలక పాత్ర పోషించారని, తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని, అదేవిధంగా తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వ ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చర్యలు వేగవంతం చేయడం అభినందనీయమని, అదే సమయంలో ఉద్యమకారుల గుర్తింపు పారదర్శకంగా కొనసాగాలని, ప్రతి ఉద్యమకారుడుకి 250 గజాలు ఇంటి స్థలం, పెన్షన్, ఆరోగ్య భద్రత కార్డు కల్పించాలని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గరుగుల యాకయ్య, శ్రీరాముల జ్ఞానేశ్వర్, రాపోలు వెంకటేష్, సాయి బండారి, యేసు రాజు, చిల్ల అంజయ్య, మేడే శ్రీకాంత్, రామకృష్ణ జి వెంకటేశ్వర్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు శంఖుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

- రూ. 31 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన
- కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు బైక్ ర్యాలీ

**మణుగూరు, జూలై 19 (జనంసాక్షి) :** ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం పినపాక నియోజకవర్గం లోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పినపాక నియోజకవర్గంలోని అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందంజలో ఉందని తెలిపారు.ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సన్న బియ్యం తో ప్రతి పేదవాడు కడుపు నిండా తినాలనే ఉద్దేశం తో రేషన్ సరఫరా చేస్తున్నామని తెలిపారు.



### అభివృద్ధి పనులకు శంఖుస్థాపన

మణుగూరు మండలం సమితి సింగారం లో రూ.3.50 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ, గుట్ట మల్లారం నుండి కట్టు మల్లారం వరకు రూ.1 కోటి అంచనా వ్యయంతో నిర్మించబోయే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, అలాగే సాయి నగర్ నుండి లంక మల్లారం వరకు రూ.2 కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించబోయే హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు నిర్వహించిన భూమి పూజ చేశారు. అశ్వాపురం మండలంలో అశ్వాపురం నుండి మొండికుంట వరకు సుమారు రూ. 22 కోట్లతో బీటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, వర్షాకాలంలో ప్రజల రాకపోకలకు ఉన్న ఇబ్బందులు తొలగి, గ్రామాల మధ్య అనుసంధానం మరింత బలోపేతం కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు , భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా సబ్ కలెక్టర్, మృణాల్ శ్రేష్ట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ , డీసీసీ జిల్లా అధ్యక్షురాలు, సంబంధిత శాఖల అధికారులు, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మైనారిటీ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, యూత్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ-సర్వే, అటవీ రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

- భూ రీ-సర్వే పనుల్లో జాప్యాన్ని ఉపేక్షించేది లేదు
- భూముల రీ సర్వే నిర్ణీత గడువులో పూర్తి చేయాలి
- రెవెన్యూ అటవీ పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి
- శ్రీనివాసగుట్టను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలై 19 (జనంసాక్షి) : రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భూముల రీ-సర్వే పనుల పురోగతి, అటవీ--రెవెన్యూ భూ సమస్యల పరిష్కారం, పోడు భూముల అంశం, పాల్వంచ శ్రీనివాసగుట్ట అభివృద్ధిపై జిల్లా అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో 70 గ్రామాల్లో చేపడుతున్న భూముల రీ-సర్వే పనుల పురోగతిని మంత్రి సమీక్షించారు. అధికారులు జిల్లాలో ప్రస్తుతం 14 గ్రామాల్లో రీ-సర్వే పనులు కొనసాగుతుండగా, వాటిలో ఐదు గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని వివరించారు. మిగిలిన గ్రామాల్లో కూడా నిర్ణీత గడువులో రీ-సర్వే పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. పాల్వంచలో కొనసాగుతున్న సర్వే పనుల పురోగతిపై మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసి చాలా కాలం గడిచినా పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. రీ-సర్వే పనుల్లో జాప్యాన్ని, పొరపాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పనుల్లో జాప్యానికి గల కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూముల రీ-సర్వే ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని మంత్రి సూచించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న సర్వేయర్లు, రోవర్ పరికరాలు, వాటి వినియోగం, సాంకేతిక సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకుని అవసరమైన చోట అదనపు వనరులు సమకూర్చాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లాలో భూముల రీ-సర్వే, అటవీ--రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను మంత్రికి వివరించారు. జిల్లాలో దశలవారీగా రీ-సర్వే పనులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం 14 గ్రామాల్లో పనులు చేపట్టగా ఐదు గ్రామాల్లో పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా నిర్ణీత గడువులో సర్వే పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామని చెప్పారు. రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖల సమన్వయంతో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా రీ-సర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, కొత్తగూడెం ఆర్డీవో మధు, డివిజనల్ అటవీ అధికారులు, రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖల అధికారులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆగ్రహం

- తక్షణమే వాకింగ్ ట్రాక్ పనులు చేపట్టాలని ఆదేశం



**జడ్చర్ల, జూలై 19 (జనంసాక్షి) :** జడ్చర్ల మున్సిపాలిటీలో నెలకొన్న తీవ్రమైన పారిశుద్ధ్య లోపాలు, పెరుగుతున్న విష జ్వరాల పట్ల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలోని 8వ, 9వ వార్డులు, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ప్రశాంత్ నగర్, విజయనగర్, అశోక్ నగర్ మరియు న్యూ బస్టాండ్ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉండటంతో, ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఈ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తున్న జవాన్ల పనితీరు అత్యంత అధ్వాన్నంగా ఉందని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించిందని అదనపు కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానికులు తరచూ అనారోగ్యానికి గురై ఆసుపత్రుల పాలవుతుండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే పారిశుద్ధ్య చర్యలను మెరుగుపరచాలని అధికారులను హెచ్చరించారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

- మామిళ్లపల్లి చెరువులో ముమ్మర గాలింపు చర్యలు
- రంగంలోకి దిగిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

**ఉప్పునుంతల, జూలై 19 (జనం సాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన ఆవుల తిరుపతయ్య (55) చెరువులో చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. శనివారం మధ్యాహ్నం గ్రామ చెరువులో చేపల వేటకు వెళ్లిన తిరుపతయ్య రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. భార్య చంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉప్పునుంతల ఎస్సై పుట్ట మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు ప్రారంభించారు. ఫైర్ స్టేషన్ ఎస్సై శంకర్ గౌడ్, గ్రామ సర్పంచ్ మోహన్ గౌడ్‌తో పాటు అగ్నిమాపక సిబ్బంది చెరువులో తిరుపతయ్య కోసం ముమ్మరంగా గాలింపు చేపట్టారు. ఆదివారం సాయంత్రం వరకు తిరుపతయ్య ఆచూకీ లభించలేదు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చెరువులో విస్తృతంగా గాలించినప్పటికీ ఆయన మృతదేహం లభించలేదు. గాలింపు చర్యలను సోమవారం కూడా కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు.



## డ్రగ్స్ నియంత్రణ అందరి బాధ్యత

- ప్రజాస్వామ్య పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకం
- రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు

**సూర్యాపేట, జూలై 19 (జనంసాక్షి) :** సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో యువత వాటికి బానిస కాకుండా కాపాడేందుకు పోలీసులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులు, మాజీ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణలో పోలీసుల పాత్ర ఎంత ముఖ్యమో, అదే స్థాయిలో యువత, తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి వర్గం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.మాదక ద్రవ్యాల అక్రమ తయారీ, రవాణా, విక్రయాలపై రాష్ట్ర పోలీసు శాఖ ఇప్పటికే కఠిన చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.ఈ చర్యలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.మాదక ద్రవ్యాల నిర్మూలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందని, ఇందుకు కృషి చేసిన పోలీసు అధికారులు, సివిల్ సొసైటీ సంస్థలు, మీడియాను అభినందించారు.ప్రస్తుత తెలంగాణ డీజీపీ, నాటి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి.ఆనంద్ నాయకత్వంలో మాదక ద్రవ్యాల నియంత్రణలో హైదరాబాద్ పోలీసులు దేశానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు.హైదరాబాద్ పోలీసుల హెచ్ న్యూ కార్యక్రమం ద్వారా మాదక ద్రవ్యాల నిర్మూలన, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, కట్టుదిట్టమైన అమలు చర్యల ద్వారా విశేష ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. ఈ కృషికి గుర్తింపుగా వరల్డ్ పోలీస్ సమ్మిట్ 2025లో ప్రతిష్ఠాత్మక ఎక్సలెన్స్ ఇన్ యాంటీ నార్కోటిక్స్ అవార్డు లభించడం తెలంగాణ పోలీసు శాఖకు గర్వకారణంగా నిలిచిందన్నారు.ప్రభుత్వంతో పాటు కళాశాల యాజమాన్యాలు, అధ్యాపకులు, తల్లిదండ్రులు కూడా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అవసరమైతే కళాశాల స్థాయిలో మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ప్రజాస్వామ్య పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు.పోలీసులు నిష్పక్షపాతంగా, నిజాయితీ, సేవాభావంతో విధులు నిర్వర్తించినప్పుడే ప్రజల్లో పోలీసు వ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజల నమ్మకమే పోలీసు శాఖకు నిజమైన బలమని, అదే పోలీసు అధికారులకు గౌరవాన్ని తీసుకువస్తుందని తెలిపారు.పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ పోలీసు వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించడంతో పాటు ప్రజల హక్కుల పరిరక్షణకు కట్టుబడి పని చేస్తుందని తెలిపారు.చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. దేశంలో శాంతి భద్రతలు నెలకొనడం, అవినీతిరహిత సమాజ నిర్మాణం కోసం విద్యావంతులు, మేధావులు, సామాజిక సంస్థలు, మీడియా ప్రతినిధులు తమ వంతు బాధ్యతగా ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పోలీసు అధికారుల అధికార దుర్వినియోగం,తీవ్రమైన అభియోగాలపై వచ్చే ఫిర్యాదులను ఈ అథారిటీ స్వీకరించి దర్యాప్తు చేస్తుందని తెలిపారు.పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు.



## ఇంటిగ్రేటెడ్ భవనాల నిర్మాణంలో తీవ్ర జాప్యం

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వచ్చి 40 రోజులు దాటినా అంగుళం కదలని పనులు
- నాడు 15 రోజుల్లో స్లాబ్ వేస్తామన్న అధికారులు.. నేడు ముఖం చాటేస్తున్న వైనం
- మంత్రి ఆదేశాలకే విలువ లేకపోతే.. మా పరిస్థితి ఏంటంటున్న సామాన్యులు

**మాడుగులపల్లి, జూలై 19 (జనం సాక్షి) :** ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారు, కానీ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం మాత్రం మారడం లేదు నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్స్ (సమన్వయ భవనాలు) ఇందుకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి ఒక రాష్ట్ర క్యాబినెట్ మంత్రి స్వయంగా క్షేత్రస్థాయికి వచ్చి, పనులను పరిశీలించి, గడువు విధించి వెళ్లినా ఇక్కడ పరిస్థితి మారకపోవడం గమనార్హం.
ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిన ఈ భవన నిర్మాణంపై మండల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
మంత్రి ముందే మాటల మూటలు.. తీరా చూస్తే శూన్యం!
గత 40 రోజుల క్రితం రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ బిల్డింగ్ నిర్మాణ పనుల పరిశీలన కోసం మాడుగులపల్లికి వచ్చారు పనులు నత్తనడకన సాగుతుండటంపై అప్పట్లోనే ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను, అధికారులను గట్టిగా ఆదేశించారు మంత్రిగారి ఆగ్రహాన్ని చూసి ఉలిక్కిపడిన అధికారులు, కాంట్రాక్టర్ సార్ మొదటి స్లాబ్ పనులను కేవలం 10 నుండి 15 రోజుల్లో పూర్తి చేస్తాం అని మంత్రి సమక్షంలోనే పెద్దపెద్ద మాటలు చెప్పారు. తీరా మంత్రిగారు వెళ్లి 40 రోజులు గడుస్తున్నా, అక్కడ ఒక్క ఇటుక కూడా అదనంగా కదిలిన దాఖలాలు లేవు నాటి పాలకుల ఆర్భాటపు శంకుస్థాపనల తర్వాత పనులు ఎలా ఉన్నాయో, నేడు మంత్రిగారు వచ్చి వెళ్లిన తర్వాత కూడా పనులు అలాగే ఉండటం అధికారుల నిమ్మకు నీరెత్తిన చందానికి నిదర్శనంగా నిలుస్తోంది



### మంత్రి మాట అంటే లెక్క లేదా..?

ఈ వ్యవహారం ఇప్పుడు మండల వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది ఒక పవర్ ఫుల్ మంత్రి వచ్చి ఆదేశాలు జారీ చేస్తేనే పనులు జరగకపోవడంపై జనం ముక్కున వేలేసుకుంటున్నారు

### ప్రజాప్రతినిధుల విలువ ఎంత..?

రాష్ట్ర మంత్రి చెప్తేనే పరిస్థితి ఇలా ఉంటే, ఇక స్థానిక ప్రజాప్రతినిధుల పరిస్థితి ఏంటి? వారు చెప్తే అధికారులు వింటారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి

### ఎవరి అండతో ఈ నిర్లక్ష్యం..?

మంత్రి మాట అంటే కాంట్రాక్టర్‌కు అంత చులకనా? లేక అధికారులకు కాంట్రాక్టర్లతో ఉన్న అవగాహన వల్ల మంత్రి ఆదేశాలను కూడా పక్కన పెట్టేస్తున్నారా? అని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు

### సమస్యల సుడిగుండంలో సామాన్యుడు

మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోటకు చేరి, ప్రజలకు పాలన సులభతరం కావాలనే సత్సంకల్పంతో ఈ ఇంటిగ్రేటెడ్ భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు కానీ కాంట్రాక్టర్ల అలసత్వం, పర్యవేక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ ప్రాజెక్టు ప్రశ్నార్థకంగా మారింది మంత్రికి ఇచ్చిన మాట ప్రకారం 15 రోజుల్లో స్లాబ్ వేయకపోగా, 40 రోజులైనా పట్టించుకోని కాంట్రాక్టర్‌పై, సమాధానం చెప్పాల్సిన అధికారులపై చర్యలు ఎందుకు లేవని మండల ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి, ఇచ్చిన హామీని బేఖాతరు చేసిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్స్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మాడుగులపల్లి మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మోత్కూర్ పీహెచ్‌సీలో స్టోర్‌రూమ్‌లుగా మారిన టాయిలెట్లు

- రోగులకు కష్టాలు..

**మోత్కూర్, జూలై 19 (జనం సాక్షి) :** మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఔట్‌పేషెంట్ల కోసం నిర్మించిన మరుగుదొడ్లు వినియోగానికి వీలులేక నిరుపయోగంగా మారడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆస్పత్రిలో శానిటేషన్ పనులు చేపట్టి, ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు వాటర్ ట్యాంక్‌ను శుభ్రపరిచారు. అయితే రోగులకు అత్యంత అవసరమైన మరుగుదొడ్ల సమస్య మాత్రం అలాగే కొనసాగుతోంది. ఔట్‌పేషెంట్ల కోసం నిర్మించిన మరుగుదొడ్లను స్టోర్‌రూమ్‌లుగా ఉపయోగిస్తుండటంతో చికిత్స కోసం వచ్చే మహిళలు, వృద్ధులు, ఇతర రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆస్పత్రి సిబ్బందికి ప్రత్యేక మరుగుదొడ్లు ఉన్నప్పటికీ, రోగుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై ఆస్పత్రి సిబ్బందిని ప్రశ్నించగా, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, నీటి సరఫరా లేకపోవడం వల్ల మరుగుదొడ్లు వినియోగంలో లేవని తెలిపారు. అయితే సమస్యలను పరిష్కరించి మరమ్మతులు చేయాల్సిన అధికారులు వాటిని స్టోర్‌రూమ్‌లుగా మార్చడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు బహిరంగ ప్రదేశాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన కంటి ఆస్పత్రి వైద్యులు నిర్వహించే ఉచిత కంటి పరీక్షలు, శస్త్రచికిత్సల శిబిరానికి వచ్చే వృద్ధులు కూడా మరుగుదొడ్ల సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోవడం, రోగుల కోసం నిర్మించిన మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు విమర్శిస్తున్నారు. రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు, రోగులు కోరుతున్నారు.



# విపణి




## జీతాల పెంపులో యాక్సెంచర్ 50: 50 విధానం

**న్యూఢిల్లీ:**ప్రముఖ టెక్ దిగ్గజం యాక్సెంచర్ ఉద్యోగులకు జీతాల పెంపులో కీలక మార్పులు చేసింది. జూన్ నెల వేతన పెంపు సైకిల్‌లో కొత్తగా 50: 50 ఫార్ములాను తీసుకొచ్చింది. అంటే పెరిగే జీతం 50 శాతం మూల వేతనంలో కలుస్తుంది. మిగిలిన 50 శాతం అనేది ఏకమొత్తంలో వేతనంతో పాటు ఉద్యోగికి చెల్లిస్తారు. ప్రమోషన్ సమయంలో ఈ ఫార్ములా నుంచి మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు కంపెనీ తన అంతర్గత మెమోలో పేర్కొంది. సాధారణంగా అర్హులైన ఉద్యోగికి ఎంత శాతం వేతనం పెంచాలనేది టాలెంట్ ఆధారంగా గ్రూప్ లీడర్ నిర్ణయిస్తారు. ఉదాహరణకు ఉద్యోగికి 3 శాతం జీతం పెరిగితే అందులో 1.5 శాతం మూలవేతనంలో పెరుగుతుంది. మిగిలిన 1.5 శాతం వన్‌టైమ్ పేమెంట్ కింద చెల్లిస్తారు. దీనివల్ల ఒకేసారి ఎక్కువ మొత్తం ఉద్యోగికి చేతికందుతుంది. దీనివల్ల కంపెనీ నెలవారీ పేరోల్ మీద ప్రభావం పడదు. ఈ తరహా పెంపు వల్ల ఎక్కువ మందికి వేతన పెంపు చేపట్టడం వీలుపడుతుందని కంపెనీ భావిస్తోంది. అలాగే, వన్‌టైం పేమెంట్ అనేది డిసెంబర్‌లో చెల్లించే బోనస్‌లకు ప్రత్యామ్నాయం కాదని పేర్కొంది. గతేడాది చాలా తక్కువ మందికి మాత్రమే యాక్సెంచర్ జీతాలు పెంచింది. ప్రస్తుత స్థూల ఆర్థిక పరిస్థితుల్లో వీలైనంత ఎక్కువ మంది ఉద్యోగులకు వేతన పెంపును చేపడుతూనే.. దీర్ఘకాలంలో కంపెనీపై ఆర్థిక భారం పడకుండా ఈ నిర్ణయం తీసుకుంది.

## ప్లాస్టిక్ కరెన్సీ నోట్ల తయారీకి గ్లోబల్ టెండర్లు

### ఆహ్వానించిన ఆర్‌బీఐ

### దేశీయంగానే పూర్తిస్థాయి వ్యవస్థకు సన్నాహాలు

**జనంసాక్షి:**మన దేశంలో త్వరలోనే ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు వినియోగంలోకి తెచ్చేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం వాడుతున్న సంప్రదాయ కాగితపు నోట్ల స్థానంలో, ఎక్కువ కాలం మన్నిక ఉండే పాలిమర్ (ఒక రకమైన ప్లాస్టిక్) నోట్లు తీసుకురావాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్ణయించిన సంగతి విదితమే. ఆర్‌బీఐకి కరెన్సీ నోట్లు ప్రింటింగ్ చేసే 'భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రన్ ప్రైవేట్ లిమిటెడ్' (బీఆర్‌బీఎన్ఎంపీఎల్).. పాలిమర్ నోట్ల కోసం ఈనెల 17న అంతర్జాతీయ ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ–గ్లోబల్ టెండర్)ను జారీ చేసింది. దేశంలోనే పాలిమర్ సబ్‌స్ట్రేట్ (ప్లాస్టిక్ నోట్ల తయారీకి వినియోగించే బేస్ మెటీరియల్) తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయడమే దీని ప్రధాన ఉద్దేశం.

అంతర్జాతీయ కంపెనీలకు ఆహ్వానం

ప్లాస్టిక్ నోట్లు ముద్రించడానికి అవసరమైన హై–సెక్యూరిటీ పాలిమర్ సబ్‌స్ట్రేట్ ఫిల్మ్‌లు తయారు చేయడంలో అపార అనుభవం, ఇప్పటికే సాంకేతికతలు ఉన్న అంతర్జాతీయ భాగస్వాములను బీఆర్‌బీఎన్ఎంపీఎల్ అన్వేషిస్తోంది. ఈ మెటీరియల్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకోకుండా, గ్లోబల్ కంపెనీల సాయంతో సాంకేతికతను మన దేశానికే బదిలీ చేసి, దేశంలోనే సొంతంగా ఈ వ్యవస్థను ఏర్పాటు చేయలనేది ప్రభుత్వ లక్ష్యం. ప్రస్తుతం జారీ చేసిన ఈఓఐ కేవలం అందుబాటులో ఉన్న టెక్నాలజీలు, భాగస్వాములను అంచనా వేయడానికి వేసిన మొదటి అడుగు మాత్రమే. ఇది కమర్షియల్ ఆర్డర్ కాదు.

**లాభాలివే..:**ప్రస్తుతం దేశంలో మెజారిటీ నోట్లను పత్తి




ఆధారిత కాగితంతో తయారు చేస్తున్నారు. వీటి స్థానంలో పాలిమర్ నోట్లను వాడటం వల్ల బహుళ ప్రయోజనాలున్నాయి. సాధారణ కాగితపు నోట్ల కంటే చాలా ఎక్కువ కాలం ఇవి మన్నుతాయి. నీటిలో నానవు, త్వరగా చిరిగిపోవు, తేమను తట్టుకోగలవు. ఈ నోట్లు మురికిని, ధూళిని త్వరగా పీల్చుకోవు, కాబట్టి ఎప్పుడూ శుభ్రంగా ఉంటాయి. ప్లాస్టిక్ నోట్లలో అత్యంత అధునాతనమైన కంటికి కనిపించే విండోస్, ఆప్టికల్ సెక్యూరిటీ ఫీచర్లను అమర్చొచ్చు. దీని వల్ల నకిలీ నోట్లను తయారు చేయడం అసాధ్యమవుతుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 60 కంటే ఎక్కువ దేశాలు ఇప్పటికే ప్లాస్టిక్ నోట్లను పూర్తి స్థాయిలో లేదా కొన్ని నిర్దిష్ట డినామినేషన్‌ల కోసం విజయవంతంగా వినియోగిస్తున్నారు.

స్వదేశీ ఉత్పత్తి ఎందుకు కీలకమంటే?

మన దేశంలో గతంలో కూడా ప్లాస్టిక్ నోట్లపై ప్రయోగాలు చేసినప్పటికీ, అప్పట్లో సబ్‌స్ట్రేట్ మెటీరియల్ కోసం విదేశీ సరఫరాదారులపైనే ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చింది. దేశంలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం వల్ల, వ్యూహాత్మక సెక్యూరిటీ మెటీరియల్ కోసం ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గుతుంది. దీర్ఘకాలంలో కరెన్సీ ము ద్రణ ఖర్చులు, దిగుమతి భారం గణనీయంగా తగ్గుతా యి. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'ఆత్మనిర్భర్ భారత్' వ్యూహానికి ఇది బలం చేకూరుస్తుంది.

ప్రజల చేతుల్లోకి ఎప్పుడు వస్తాయంటే..

ప్లాస్టిక్ నోట్ల తయారీ ప్రక్రియ ప్రస్తుతం మొదటి దశలో ఉంది. టెక్నాలజీ భాగస్వాములను ఎంపిక చేయడం, తయారీ ప్లాంట్‌లను నిర్మించడం, ఆపై ప్రయోగాత్మక పరిశీలనలు పూర్తి చేసి ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం నుంచి తుది అనుమతులు రావడానికి మరింత సమయం పడుతుంది. కేవలం ప్లాస్టిక్ నోట్లే కాకుండా, వాటిపై రంగులు మారే ఫిల్మ్‌లు, ప్రత్యేక పిగ్మెంట్లు, అధునాతన సెక్యూరిటీ ప్రోడక్ట్స్ తయారీ సాంకేతికతను దేశంలోకి తీసుకురావడానికి కూడా ఈ ఏడాది ప్రారంభంలో ఆర్‌బీఐ సంస్థ అంతర్జాతీయ బిడ్డర్‌లను ఆహ్వానించింది. ఇవన్నీ భారత కరెన్సీ వ్యవస్థను పూర్తిగా ఆధునికీకరణ వైపు నడిపిస్తున్నాయి.

## శాంసంగ్‌లో లేఆఫ్‌లు..

### టెక్సాస్‌కు ఆఫీస్‌ను తరలించడమే కారణమా?

**న్యూఢిల్లీ:**దక్షిణకొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శామ్‌సంగ్ ఉద్యోగ కోతలకు సిద్ధమైంది. అమెరికాలోని తన ప్రధాన కార్యాలయాన్ని న్యూజెర్సీ నుంచి టెక్సాస్‌కు తరలించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీంతో వందలాది మంది ఉద్యోగులపై వేటు పడనుంది. ముఖ్యంగా డిస్‌ప్లే, ఫోన్ వంటి విభాగాల్లో ఈ లేఆఫ్‌లు ఉంటాయని ఓ అంతర్జాతీయ వార్తా సంస్థ పేర్కొంది.న్యూజెర్సీలో దాదాపు 739 మంది సిబ్బందిపై వేటు పడనున్నట్లు శాంసంగ్ పేర్కొంది. వీరిలో చాలా మందికి తిరిగి రీలొకేషన్ ఆఫర్లు అందాయని.. మరికొందరిని శాశ్వతంగా తొలగించినట్లు తెలుస్తోంది. మరోవైపు టెక్సాస్‌లోని కార్యాలయంలో మొబైల్ డివిజన్‌కు చెందిన సుమారు 100 మందిని తొలగించినట్లు సమాచారం. కృతిమ మేధ కారణంగా సెమీకండక్టర్ విభాగం రికార్డు స్థాయిలో లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ చిప్ ధరలు పెరగడంతో తీవ్రమైన పోటీని ఎదుర్కొంటున్నాయి. దీంతో తక్కువ పన్నులు, వ్యాపార అనుకూల నిబంధనల కారణంగా శాంసంగ్‌తో పాటు టెస్లా, ఒరాకిల్ వంటి ఇతర టెక్ కంపెనీలు కూడా తమ కార్యకలాపాలను టెక్సాస్‌కు తరలిస్తుండటం గమనార్హం.




### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,53,140 | ₹ 1,67,064 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,60,000

## అనిల్ అంబానీ సంస్థల కార్యాలయాల్లో సీబీఐ సోదాలు

దిల్లీ: రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్ఎల్), రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్ఎఫ్ఎల్)పై నమోదైన కేసుల వ్యవహారంలో దిల్లీ, ముంబయిలోని 15 ప్రాంతాల్లో శనివారం కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) సోదాలు నిర్వహించింది. అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఏడీఏ గ్రూపుతో సంబంధమున్న 23 సంస్థల్లో ఈ సోదాలు జరిగినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. ముంబయి ప్రత్యేక కోర్టు నుంచి వారెంట్‌లు తీసుకున్నాకే ఈ సోదాలు చేపట్టినట్లు వెల్లడించారు. వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్‌ఐసీ నుంచి వచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆర్‌సీఎఫ్ఎల్, ఆర్‌హెచ్ఎఫ్ఎల్‌లపై ఏడు ఎఫ్ఐఆర్‌లను సీబీఐ నమోదుచేసింది.

## ఐసీఐసీఐ బ్యాంక్ లాభం రూ.15,440 కోట్లు

**ముంబయి:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026–27) ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో ఐసీఐసీఐ బ్యాంక్ రూ.15,440 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.13,558 కోట్లతో పోలిస్తే ఇది 13.88% అధికం. స్టాండలోన్ ప్రాతిపదికన నికర లాభం రూ.12,768 కోట్ల నుంచి 15.95 శాతం పెరిగి రూ.14,804 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 12.7 శాతం పెరిగి రూ.24,384 కోట్లకు చేరింది. రుణాలు సుమారు 20 శాతం పెరిగాయి. నికర వడ్డీ మార్జిన్ 4.36 శాతంగా నమోదైంది. డిపాజిట్లు 14 శాతం పెరిగాయి. ఇతర ఆదాయం (ట్రెజరీ ఆదాయం మినహా) 16 శాతం పెరిగి రూ.8,425 కోట్లకు చేరింది. ట్రెజరీ ఆదాయం రూ.151 కోట్లుగా నమోదైంది. ఆస్తుల నాణ్యతకొస్తే స్థూల నిరర్థక ఆస్తులు 1.67 శాతం నుంచి 1.38 శాతానికి మెరుగయ్యాయి. జనవరి–మార్చి త్రైమాసికంలో ఇవి 1.4 శాతంగా ఉన్నాయి. కేటాయింపులు రూ.1,815 కోట్ల నుంచి రూ.1,260 కోట్లకు తగ్గాయి. 2026 జూన్ 30 నాటికి బ్యాంకు కనీస మూలధన నిష్పత్తి 16.84 శాతంగా నమోదైంది.




# భారత అంతరిక్షానికి ప్రైవేట్ ఊతం

- పదేళ్లలో రూ.3.85 లక్షల కోట్ల స్థాయికి స్పేస్ ఎకానమీ
- దూసుకెళుతున్న ఏపీ,తెలంగాణ రాష్ట్రాల అంకుర సంస్థలు

**హైదరాబాద్:**భారత ప్రైవేటు అంతరిక్ష రంగంలో సరి కొత్త అధ్యాయం మొదలైంది. హైదరాబాద్‌కు చెందిన స్పేస్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ తన విక్రమ్–1 ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. 'ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ తొలి ప్రైవేట్ ప్రయోగం విజయవంతం కావడంతో, అంతరిక్ష వాణిజ్య రంగంలో భారత్ తన పట్టును మరింత బలోపేతం చేసుకుంది. అమెరికా, చైనా తర్వాత ఒక ప్రైవేటు సంస్థ ఆర్బిటల్ రాకెట్‌ను కక్ష్యలోకి పంపిన మూడో దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం దాదాపు రూ.86 వేల కోట్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ రాబోయే దశాబ్ద కాలంలో ఏకంగా రూ.3.85 లక్షల కోట్ల (40 బిలియన్ డాలర్లు) స్థాయికి చేరడానికి సిద్ధంగా ఉంది. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు, ప్రైవేటు భాగస్వామ్యం పెరగడం, ఆవిష్కరణల వేగం ఈ రంగాన్ని ముందుకు నడిపిస్తున్నాయి.

ఇప్పటివరకూ భారత ప్రైవేటు అంతరిక్ష సంస్థలు కేవలం ఇస్రో వంటి ప్రభుత్వ సంస్థలకు విడిభాగాలు, సాఫ్ట్‌వేర్ అందించేందుకే పరిమితమయ్యాయి. విక్రమ్–1 ప్రయోగంతో ఒక ప్రైవేటు సంస్థ రాకెట్ రూపకల్పన, తయారీ, ప్రయోగం వంటి దశలను విజయవంతంగా పూర్తి చేయగలదని నిరూపితమైంది. దేశీయ సరఫరా గొలుసులో వచ్చిన ఈ మార్పు వల్ల అంతర్జాతీయ ఉపగ్రహ తయారీదారులు సైతం ఇకపై భారతీయ ప్రైవేటు సంస్థల వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. 2014లో భారత్‌లో కేవలం ఒకే ఒక్క స్పేస్ స్టార్టప్ ఉండేది. అదీ హైదరాబాద్‌కు చెందిన ధ్రువ స్పేస్. 2026 నాటికి ఈ సంఖ్య 400కు పైగా చేరింది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఇండియన్ స్పేస్ పాలసీ–2023 ప్రైవేటు రంగానికి సరికొత్త మార్గాలను తెరిచింది. ఉపగ్రహాల తయారీ, రాకెట్ లాంచ్‌లు, స్పేస్ అప్లికేషన్లు, డేటా విశ్లేషణ.. ఇలా ప్రతి విభాగంలోనూ ప్రైవేటు సంస్థలకు అవకాశాలు వచ్చాయి. అంతరిక్ష రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ)ను అనుమతించడమూ ఊతాన్ని ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఇన్–స్పేస్'తో ప్రైవేటు కంపెనీలకు ఇస్రో మౌలిక వసతులు, లాంచ్‌ప్యాడ్‌లను వాడుకునే వెసులుబాటు లభించింది. స్టార్టప్‌లకు మద్దతుగా ప్రభుత్వం రూ.1,000 కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్‌ను ఏర్పాటు చేసింది. రూ.500 కోట్ల టెక్నాలజీ అడాప్షన్ నిధులనూ




కేటాయించింది. ప్రస్తుతం ఉన్న జోరు చూస్తుంటే, భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ 2040 నాటికి రూ.9.6 లక్షల కోట్ల (100 బి.డాలర్లు) స్థాయికి చేరుకుంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

అపార అవకాశాలు:దేశీయ ప్రైవేటు అంతరిక్ష సంస్థలకు దేశంలో ఎన్నో అవకాశాలు కనిపిస్తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా వేల సంఖ్యలో కమ్యూనికేషన్స్, బ్రాడ్‌బ్యాండ్ ఉపగ్రహాలను ప్రయోగిస్తున్నారు. అమెరికాలోని స్పేస్–ఎక్స్‌పైనే భారం పడుతున్న తరుణంలో, భారత్‌కు చెందిన స్కైరూట్, అగ్నికుల్ సంస్థలు చౌకైన, నమ్మకమైన ప్రత్యామ్నాయాలుగా మారుతున్నాయి. భారత రక్షణ రంగం సరిహద్దుల నిఘా, సురక్షిత కమ్యూనికేషన్ కోసం సొంత ఉపగ్రహాల వైపు మొగ్గు చూపుతోంది. దీనివల్ల దేశీయ రక్షణ ఆర్డర్లు ప్రైవేటు సంస్థలకు భారీగా లభించే అవకాశం ఉంది. సాంకేతిక నిపుణులు, తక్కువ తయారీ వ్యయం వల్ల 'భారత్‌లో తయారీ' అంతరిక్ష రంగానికి సానుకూలాంశంగా మారనుంది. ఇస్రో సైతం తన అవసరాల కోసం ప్రైవేట్ సంస్థలకు కాంట్రాక్టులను ఇవ్వడం ప్రారంభించింది. ఇది అంకురాలకు స్థిరమైన ఆదాయ వనరుగా మారుతుంది.

సవాళ్లూ ఉన్నాయి:విక్రమ్–1 ప్రయోగం సాంకేతికంగా విజయం సాధించినప్పటికీ, వాణిజ్యపరంగా లాభాల బాట పట్టాలంటే భవిష్యత్తులో వరుస ప్రయోగాలు విజయవంతంగా నిర్వహించాల్సి ఉంటుంది. శాటిలైట్ తయారీదారులు, నిర్వహణదారుల నుంచి దీర్ఘకాలిక ఒప్పందాలను దక్కించుకోవడం, నిరంతరంగా అవసరమయ్యే భారీ పెట్టుబడులను సమకూర్చుకోవడం, అంతర్జాతీయ సంస్థలతో పోటీపడటం వంటి సవాళ్లు ఈ రంగంలో ఉన్నాయి. దేశంలోని మరికొన్ని స్టార్టప్‌లూ సొంత రాకెట్ల తయారీలో నిమగ్నమై ఉండటంతో ముమ్ముందు పోటీ మరింత పెరగనుంది.

రేసులో ఉన్న అంకురాలివే..

స్కైరూట్ ఏరోస్పేస్ (హైదరాబాద్): భారత తొలి స్పేస్‌టెక్ యూనికార్న్ ఇది. ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా ఈ అంకురాన్ని ప్రారంభించారు. 2022లో విక్రమ్–ఎస్ అనే సబ్ ఆర్బిట్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన ఈ సంస్థ, ఇప్పుడు విక్రమ్–1తో సరికొత్త చరిత్ర సృష్టించింది. భవిష్యత్తులో అంతర్జాతీయ మార్కెట్‌ను చేజిక్కించుకోవడానికి విక్రమ్–2, విక్రమ్–3 సిరీస్ రాకెట్లను సిద్ధం చేస్తోంది.

అగ్నికుల్ కాస్మోస్ (చెన్నై): ఐఐటీ మద్రాస్‌లో రూపుదిద్దుకున్న అంకురం ఇది. శ్రీనాథ్ రవిచంద్రన్, మోయిన్, ప్రొఫెసర్ ఎస్.ఆర్ చక్రవర్తి కలిసి ఈ సంస్థ అగ్నిబాణ్ అనే రాకెట్‌ను అభివృద్ధి చేశారు. 2024లో దేశంలోనే తొలిసారి పూర్తిగా 3డీ–ప్రింటెడ్ సెమీ క్రయోజెనిక్ ఇంజిన్‌ను విజయవంతంగా పరీక్షించింది. ఇస్రో సాయంతో శ్రీహరికోటలో సొంతంగా ప్రైవేట్ లాంచ్‌ప్యాడ్‌ను నిర్మించుకుంది.

పిక్సెల్ (బెంగళూరు): అమిత్ కుమార్, అవైస్ అహ్మద్‌లు స్థాపించిన ఈ సంస్థ, భూ పర్యవేక్షణ కోసం అత్యాధునిక ఇమేజింగ్ ఉపగ్రహాల సమూహాన్ని నిర్మిస్తోంది. గూగుల్ తదితర అంతర్జాతీయ సంస్థల నుంచి వీరు పెట్టుబడులను ఆకర్షించారు.

ధ్రువ స్పేస్ (హైదరాబాద్): సంజయ్ నెక్కంటి, కృష్ణతేజ పెనమకూరు, అభయ్ ఈగోర్, చైతన్య దొర సూరపురెడ్డి సహ–వ్యవస్థాపకులుగా ఉన్న ఈ సంస్థ ఉపగ్రహాలు తయారు చేయడంతోపాటు, వాటిని అంతరిక్షంలోకి పంపే లాంచ్ డిప్లాయర్లు, గ్రౌండ్ స్టేషన్లనూ అందిస్తోంది.

బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్ (బెంగళూరు): ఉపగ్రహాలను కక్ష్యలో ఉంచేందుకు, వాటి దిశను మార్చేందుకు అవసరమైన అత్యాధునిక ప్రొపల్షన్ వ్యవస్థలను ఈ అంకురం అందిస్తోంది.

కాస్మోసర్వ్ స్పేస్ (హైదరాబాద్): ఇస్రో మాజీ శాస్త్రవేత్త చిరంజీవి ఫణీంద్ర స్థాపించిన ఈ అంకురం అంతరిక్షంలోని వ్యర్థాలను, పనిచేయని ఉపగ్రహాలను తొలగించే లక్ష్యంతో పనిచేస్తోంది. విక్రమ్–1లో మిషన్ ఎంబ్రేస్‌ను అంతరిక్షానికి పంపించింది సంస్థ.

## ఫేక్ ఓఎంఆర్ షీట్లను సబ్‌మిట్ చేస్తే కఠినచర్యలు..

### విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎన్టీఏ కీలక అడ్వైజరీ జారీ


న్యూఢిల్లీ(జనంసాక్షి):నీట్–యూజీ రీ టెస్ట్ 2026 ఫలితాలకు సంబంధించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక అడ్వైజరీ జారీ చేసింది. మార్కుల్లో వ్యత్యాసం ఉందంటూ తప్పుడు లేదా ఏఐ సాయంతో రూపొందించిన ఓఎంఆర్ షీట్లను సబ్‌మిట్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. న్యాయపరంగా చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. ఈ నెల 16న నీట్ యూజీ రీ టెస్ట్ పరీక్ష ఫలితాలు వెల్లడైన సంగతి తెలిసిందే. అయితే, ఓఎంఆర్ షీట్ ఆధారంగా అంచనా వేసిన మార్కులకు, నీట్ స్కోరుకు మధ్య వ్యత్యాసం ఉందంటూ కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్‌టీఏను ఆశ్రయిస్తున్నారు. వారి ఫిర్యాదులను పరిశీలించగా.. వాటిలో చాలా వరకు కృత్రిమమేధ సాయంతో తయారు చేసిన ఓఎంఆర్ షీట్లు సబ్‌మిట్ చేసినట్లు తేలింది. తప్పుదోవ పట్టించి మార్కులు పొందేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు నిర్ధరణకు వచ్చిన ఎన్‌టీఏ తాజాగా ప్రకటన విడుదల చేసింది.

## అమెరికాను కమ్మిన కెనడా కార్చిచ్చు పొగ

### ఆ దేశంపై అదనపు సుంకాలు విధిస్తాం: ట్రంప్

### కెనడాలో కార్చిచ్చు కారణంగా న్యూజెర్సీలోని జెర్సీ సిటీని కమ్మేసిన పొగ

**న్యూయార్క్:** వాతావరణ మార్పుల వల్ల అమెరికా, కెనడాలలో కార్చిచ్చులు రేగుతూనే ఉన్నాయి. అదుపులేని అడవి మంటల వల్ల శుక్రవారం అమెరికాలో మిన్నెసోటా, ఇల్లినోయీ, మిషిగాన్, డెట్రాయిట్‌తో సహా పలు ప్రాంతాలలో గాలి నాణ్యత క్షీణించింది. అమెరికా రాజధాని నగరం వాషింగ్టన్‌ను కూడా దట్టమైన పొగ కమ్మేసింది. ప్రజలు, ముఖ్యంగా గుండె లేదా ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు, వృద్ధులు, పిల్లలు గాలి నాణ్యత మెరుగుపడే వరకు బయటకు వెళ్లరాదని అధికారులు సూచించారు. చాలా రాష్ట్రాల్లో శనివారం వరకు ప్రమాదకర పరిస్థితులు కొనసాగుతాయన్నారు. కార్చిచ్చుల ద్వారా వ్యాపిస్తున్న పొగ, మంటలకు కెనడా అటవీ నిర్వహణ లోపాలే కారణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు.కెనడాపై అదనపు



సుంకాలను విధిస్తామని హెచ్చరించారు. ట్రంప్ వ్యాఖ్యలపై కెనడా ప్రభుత్వం మొదట్లో స్పందించలేదు. గతంలో కార్చిచ్చులను ఎదుర్కోవడంలో అమెరికాకు కెనడా సహాయం చేసిందని ఆంటారియో రాష్ట్ర నేత డగ్ ఫోర్డ్ గుర్తుచేశారు. 'రాజకీయ నాయకులు ఫిర్యాదులు చేయడం మాని పొరుగువారికి సహాయం చేయడం మంచిది. మనం మన అమెరికన్ స్నేహితుల కోసం గతంలో కచ్చితంగా అదే పని చేశాం' అని ఫోర్డ్ చెప్పారు. కెనడాలోని ఉత్తర అంటారియోలో సుమారు 190 చోట్ల కార్చిచ్చులు, మంటలు వ్యాపించాయి. మంటలు రేగుతున్న ప్రాంతాల నుంచి ప్రజలను ఖాళీ చేయించారు. మరికొన్ని ప్రాంతాల ప్రజలను ఖాళీ చేసే అవకాశం ఉంది.

## జీమెయిల్ గుడ్‌న్యూస్..

**న్యూఢిల్లీ:**జీ–మెయిల్ వాడేవారికి గుడ్‌న్యూస్. యూజర్లు ఎన్నో రోజులుగా వేచి చూ స్తున్న జీ–మెయిల్ ఐడీని (యూజర్‌నేమ్) మార్చుకునే అవకాశాన్ని ఎట్టకేలకు తీసుకొచ్చింది. దీంతో కొత్తగా ఇ–మెయిల్ ఐడీని క్రియేట్ చేసుకునే అవసరం తప్పుతుంది. చివర్లో ఏజీమెయిల్.కామ్ అలానే ఉంటూ అడ్రస్‌ను మార్చుకోవచ్చన్నమాట. ఇంతకీ ఎలా చేయాలి? మార్చుకున్నాక ఎదురయ్యే ఇబ్బందులేంటో చూద్దాం..అవగాహన లేకనో, పేర్లు అందుబాటులో లేకనో ఏదో ఒక యూజర్ ఐడీతో కొందరు మెయిల్ ఐడీని క్రియేట్ చేసుకుని ఉంటారు. చాలా చోట్ల అదే మెయిల్ ఐడీని ఇచ్చేసి ఉంటారు. తర్వాత దాన్ని మార్చుకుందామంటే కుదరదు. దీంతో కొత్తగా ఇ–మెయిల్ ఐడీని క్రియేట్ చేసుకోవడం తప్ప ఇన్నాళ్లు ఇంకో ఆప్షన్ లేదు. పాత డేటా కోల్పోవడం ఇష్టం లేనివారు దాన్నే వాడుతుంటారు. ఈ క్రమంలోనే ఇ–మెయిల్ ఐడీని మార్చుకునే వెసులుబాటును గూగుల్ తీసుకొచ్చింది. వాస్తవానికి గతేడాదే యూజ్‌నేమ్ ఫీచర్‌నేమ్ ఫీచర్ తీసుకొస్తున్నట్లు వార్తలు రాగా.. ఎట్టకేలకు యూజర్లకు అందుబాటులోకి తెచ్చింది. మీ యూజర్‌నేమ్ మారినా పాత మెయిల్‌ఐడీ అలానే కొనసాగుతుంది.

ఎలా చేసుకోవాలి?

గూగుల్ అకౌంట్ మేనేజ్‌మెంట్ పేజీలోకి




వెళ్లండి.అక్కడ పర్సనల్ ఇన్ఫోలో ఉండే ఇ–మెయిల్ ఆప్షన్‌ను క్లిక్ చేయండి.అక్కడ గూగుల్ అకౌంట్ ఇ–మెయిల్ ఆప్షన్ కనిపిస్తుంది.అక్కడ మీకు నచ్చిన/అందుబాటులో ఉన్న యూజర్ నేమ్‌ను ఎంచుకోవచ్చు.ఆక్సిజన్ ఓఎస్‌కు వన్‌ప్లస్ గుడ్‌బై.. ఇకపై కలర్‌ఓఎస్ అప్‌డేట్స్ .కొత్త ఇ–మెయిల్ ఐడీని ఎంచుకున్నప్పటికీ.. దాన్ని పాత అకౌంట్‌గానే గూగుల్ పరిగణిస్తుంది. అంటే పేరు మాత్రమే మారుతుందన్నమాట. మనిషికి రెండు పేర్లున్నట్లే జీమెయిల్‌కూ ఇకపై రెండు యూజర్‌నేమ్‌లు ఉంటాయన్నమాట. పాత మెయిల్ ఐడీ కూడా కొనసాగుతుంది. ఆ మెయిల్ ఐడీకి వచ్చిన ఫొటోలు, మెసేజులు, ఇ–మెయిల్స్ పోతాయన్న చింత కూడా అక్కర్లేదు. పాత ఐడీకి వచ్చిన మెయిల్స్ అన్నీ మీ కొత్త ఇన్‌బాక్స్‌కే చేరుతాయి. మీ మెయిల్స్, కాంటాక్ట్స్, ఫొటోలు, డ్రైవ్ ఫైల్స్ అన్నీ యథాతథంగా సురక్షితంగా ఉంటాయి. ఒకసారి జీమెయిల్ ఐడీ మార్చుకున్నాక మళ్లీ ఏడాది వరకు మార్చుకునే వెసులుబాటు ఉండదు.

**సమస్య ఇక్కడే:**మీరు చాలా వెబ్‌సైట్లు లేదా యాప్‌లలో లాగిన్ అవ్వడానికి మీ పాత జీమెయిల్ ఐడీని యూజర్‌నేమ్‌గా ఇచ్చి ఉండొచ్చు. కొన్ని సైట్లలో కొత్త ఐడీతో 'సైన్ఇన్ విత్ గూగుల్' అని చేసినప్పుడు అది మిమ్మల్ని కొత్త యూజర్‌గా గుర్తిస్తుంది. దీనివల్ల ఆయా యాప్స్‌లో మీ పాత డేటా లేదా సబ్‌స్క్రిప్షన్లు కనిపించకపోవచ్చు.మీ స్నేహితులు, ఆఫీస్ సిబ్బంది లేదా బ్యాంక్ అకౌంట్లలో మీ పాత ఇ–మెయిల్ ఐడీ సేవ్ అయ్యి ఉంటుంది. వారు పంపే మెయిల్స్ మీ ఇన్‌బాక్స్‌కు వస్తాయి గానీ, మీరు కొత్త యూజర్‌నేమ్‌కు మారిన విషయంలో తెలీదు కాబట్టి మీరు పంపే మెయిల్స్ కొత్త మెయిల్ అనుకునే ప్రమాదం ఉంది.మీ బ్యాంక్ అకౌంట్లు, ఆధార్, ఇన్సూరెన్స్ వంటి సేవలకు పాత జీమెయిల్ ఐడీ ఉంటే వాటిని మాన్యువల్‌గా అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది.ఎవరికైనా పాత మెయిల్ ఐడీతో మెయిల్ చేయాలంటే అడ్రస్‌బార్‌లో డ్రాప్‌డౌన్ మెనూ కనిపిస్తుంది. అక్కడే సెలక్ట్ చేసుకుని మెయిల్స్ పంపుకోవచ్చు. మెయిల్ చేసిన ప్రతిసారీ పాత మెయిల్ నుంచే చేయాలంటే సెట్టింగ్స్‌లో 'సెండ్ మెయిల్ యాజ్' అనే ఆప్షన్‌లోకి వెళ్లి డిఫాల్ట్ మెయిల్ ఐడీని సెట్ చేసుకోవచ్చు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
20 జూలై 2026




# వాన కోసం దేవాలయం.. మసీదు ఒకే స్వరం

## హనుమాన్ మందిరంలో సప్తహ - ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

- మత సామరస్యానికి ఎడపల్లి నిలువెత్తు నిదర్శనం

**ఎడపల్లి, జూలై 19 ( జనంసాక్షి ) :** వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ ఆదివారం ఎడపల్లి మండల కేంద్రంలోని హనుమాన్ మందిరంలో సప్తహ ను ప్రారంభించగా మైనార్టీ సోదరులు వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ మేరకు హనుమాన్ మందిరంలో శ్రీరామ మఠం వ్యవస్థాపకులు జయరాం మహరాజ్, గ్రామ పురోహితులు సాంబ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సప్తహ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందగట్ల రాంచందర్, ఉప సర్పంచ్ మచ్కూర్ గంగాధర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పోల మల్కారెడ్డి, ప్రతినిధులు బంజ కామప్ప, కరణం శంకర్ రావు, జనగం మోహన్ రెడ్డి, కట్కం పెద్ద సాయిలు, కల రాజేశ్వర్, నాయుడు పోతన్న, మాణిక్ ఎల్లయ్య యాదవ్, గుంజరి రెడ్డి, న్యావనంది సుభాష్, న్యావనంది గోపాల్, కంజర్ వినాయక్ రాజు, దూస గంగాధర్, రాజిరెడ్డి, జోగ్గరి మోహన్, గంగారెడ్డి, పేట గంగాధర్, దేరడి అబ్బ రెడ్డి, కంజర్ బబ్బి, కంజర్ నాని, మాణిక్యం, జక్కలి నగేష్, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. అలాగే మైనార్టీ సోదరులు గ్రామంలోని మసీదు వద్ద ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్ హైమద్, ముస్తాక్, లాయక్ అలీ, చికెన్ సెంటర్ హైమద్ తో పాటు మైనార్టీ సోదరులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 20వ తేదీన గోదావరి జలాలతో గ్రామదేవతలకు అభిషేకాలు నిర్వహించి కార్యక్రమాన్ని ముగించనున్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- రాష్ట్ర అధ్యక్షుడు సదానంద్ గౌడ్
- ఉపాధ్యాయ అర్హత పరీక్ష అర్హత మార్కులు తగ్గించాలి
- రాష్ట్ర సంఘానికి పంపరి ప్రవీణ్ కుమార్ వినతి




**కామారెడ్డి ప్రతినిధిజులై 19( జనం సాక్షి) :** రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం తెలంగాణ (ఎస్టీయూటీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలోని సంఘ భవనంలో 33 జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు సదానంద్ గౌడ్ మాట్లాడుతూ సంఘం స్థాపనకు 80 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా సెప్టెంబర్ 2026లో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ అర్హత పరీక్షకు సంబంధించి విధుల్లో ఉన్న ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తామని, ఉద్యోగ భద్రతపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని హామీ ఇచ్చారు. అలాగే వేతన సవరణ, కరవు భత్యం, సేవా నియమాలు, బదిలీలు, పదోన్నతుల అంశాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఆరోగ్య కార్డుల ద్వారా మెదడు సంబంధిత సమస్యలు, కోమా వంటి క్లిష్ట వ్యాధులకు ఖర్చుల తిరిగి చెల్లింపు నిబంధనలు అమలులో ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పంపరి ప్రవీణ్ కుమార్ పలు సమస్యలను రాష్ట్ర శాఖ దృష్టికి తీసుకువెళ్లారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష రెండో పత్రంలో పాఠశాల సహాయ ఉపాధ్యాయులు బోధించే అంశాలకు సంబంధం లేని పరీక్షలు పదేపదే నిర్వహించడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. జూన్-2026లో జరిగిన పరీక్షలో ఒకటి, రెండు మార్కుల తేడాతో పలువురు ఉపాధ్యాయులు అర్హత కోల్పోయారని, పంజాబ్, జార్ఖండ్ రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలో కూడా అర్హత మార్కులను తగ్గించాలని కోరారు. ఆరోగ్య కార్డుల్లో బాహ్య రోగుల చికిత్స సౌకర్యాన్ని కల్పించాలని, శిక్షణ కార్యక్రమాల్లో పాఠ్య ప్రణాళికల రచన వల్ల బోధన సమయం వృథా అవుతోందని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రగతి పత్రాన్ని ఎనిమిది పేజీలుగా ఉంచడం సమంజసం కాదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు, జిల్లా ప్రతినిధులతో పాటు కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ కలిముద్దీన్ పాల్గొన్నారు.

# విద్యార్థుల సురక్షిత రవాణాకు సైబరాబాద్ పోలీసుల వినూత్న ముందడుగు

- స్టూడెంట్ పోర్టల్ ప్రారంభం.. క్యాంపస్ కంప్లయెన్స్ వర్క్‌షాప్ నిర్వహణ
- విద్యార్థుల భద్రతకు సమగ్ర రవాణా వ్యవస్థ రూపకల్పన
- పోలీసులు, విద్యాశాఖ, ఆర్టీఏ, టీజీఎస్ఆర్టీసీ సమన్వయానికి ప్రాధాన్యం
- దేశానికి ఆదర్శంగా సైబరాబాద్ మోడల్ తీర్చిదిద్దడమే లక్ష్యం



**శేరిలింగంపల్లి, జూలై 19 (జనంసాక్షి):** విద్యార్థుల సురక్షిత రవాణా కోసం సైబరాబాద్ పోలీసులు మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్‌లో భాగంగా గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీలో ఆదివారం క్యాంపస్ కంప్లయెన్స్ వర్క్‌షాప్ నిర్వహించి, విద్యా సంస్థలు-ప్రభుత్వ శాఖలను అనుసంధానించే స్టూడెంట్ పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ, విద్యార్థులు ఇంటి నుంచి విద్యాసంస్థలకు, తిరిగి ఇంటికి సురక్షితంగా చేరుకునేలా సమగ్ర రవాణా వ్యవస్థను రూపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, రవాణా నిర్వాహకులు, పోలీసులు, రవాణా శాఖ, విద్యాశాఖ, టీజీఎస్ఆర్టీసీ సమన్వయంతో పనిచేస్తేనే విద్యార్థుల భద్రత మరింత మెరుగుపడుతుందని తెలిపారు. సైబరాబాద్ పరిధిలోని 520కుపైగా విద్యాసంస్థల్లో నిర్వహించిన సర్వే, 750కుపైగా విద్యాసంస్థల ప్రతినిధులతో సంప్రదింపులు, 500కుపైగా విద్యార్థులతో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు ఆధారంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. విద్యాసంస్థల పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ, సేఫ్ స్టూడెంట్ మొబిలిటీ కారిడార్ల ఏర్పాటు, రవాణా భద్రత ప్రమాణాల అమలుపై వర్క్‌షాప్‌లో చర్చించారు. కొత్తగా ప్రారంభించిన స్టూడెంట్ పోర్టల్ ద్వారా విద్యార్థుల రవాణా భద్రత, సమస్యల పరిష్కారం, సమాచార మార్పిడి, వివిధ శాఖల సమన్వయం మరింత సమర్థవంతంగా సాగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, డీసీపీలు రితిరాజ్, రవికుమార్, టీజీఎస్ఆర్టీసీ అధికారులు, విద్యాసంస్థల ప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

> “ సైబరాబాద్ పరిధిలోని 520కు పైగా విద్యాసంస్థల్లో నిర్వహించిన సమగ్ర సర్వే, 750కుపైగా విద్యాసంస్థల ప్రతినిధులతో సంప్రదింపులు, 500 మందికిపైగా విద్యార్థులతో చేపట్టిన పైలట్ ప్రాజెక్ట్ ఆధారంగా స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్‌ను రూపొందించినట్లు అధికారులు వివరించారు. ఈ అధ్యయనాల ద్వారా విద్యార్థుల ప్రయాణంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారాలు అందించేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు.



# సరోజినీ ఆసుపత్రిలో పసికందు మృతి

**కరీంనగర్ బ్యూరో, జూలై 19 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరంలోని సరోజినీ ఆసుపత్రిలో ఆదివారం ఒక పసికందు మృతి చెందడం ఉద్రిక్తతకు దారి తీసింది. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఊటూరు గ్రామానికి చెందిన పోచంపల్లి కుమార్ భార్య సంధ్య పురిటినొప్పులతో గురువారం నగరంలోని సరోజినీ ఆసుపత్రిలో చేరింది. కాగా, ఆమె అక్కడ ఒక ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆదివారం తల్లి పసికందుకు పాలు పట్టిన తర్వాత, పాపకు ఎక్కిళ్లు రావడంతో ఒక్కసారిగా పరిస్థితి విషమించింది. ఆ సమయంలో ఆసుపత్రిలో పిల్లల వైద్యులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో, అక్కడి సిబ్బంది పాపను నగరంలోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో పాపను వేరే ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ పరీక్షించిన వైద్యులు పసికందు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమయానికి ఆసుపత్రిలో పిల్లల డాక్టర్ అందుబాటులో లేకపోవడం వల్లే తమ పాప ప్రాణాలు కోల్పోయిందని ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, బంధువులు సరోజినీ ఆసుపత్రి యాజమాన్యాన్ని నిలదీశారు. దీంతో ఆసుపత్రి వద్ద కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న 2 టౌన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, బాధితులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

# పింఛన్ పేరుతో పోస్టాఫీస్ ఖాతాల హడావిడి

## వృద్ధులకు ఇబ్బందులు

**గాంధారి, జూలై 18 జనంసాక్షి :** పింఛన్ డబ్బులు ఇకపై పోస్టాఫీస్ ఖాతాల్లోనే జమ అవుతాయని ప్రచారం చేస్తూ పాన్ కార్డు, ఆధార్, పాస్‌బుక్‌తో కొత్త ఖాతాలు తెరవాలని కొందరు పోస్టాఫీస్ సిబ్బంది సూచిస్తున్నారని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.500 జమ చేసి ఖాతా తెరవాలని చెప్పడంతో వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే వందలాది ఖాతాలు తెరిచినట్లు స్థానిక పోస్టాఫీస్ వర్గాలు చెబుతున్నాయి.
అయితే ఈ ప్రచారాన్ని డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి ఖండించారు. పింఛన్ కోసం పోస్టాఫీస్ ఖాతా తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఎలాంటి జీవో లేదా సర్క్యులర్ జారీ చేయలేదని స్పష్టం చేశారు. ప్రజలు ఇలాంటి వదంతులను నమ్మి కొత్త ఖాతాలు తెరవొద్దని, ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు వస్తే తామే మీడియా ద్వారా పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి ప్రచారం జరుగుతున్నట్లు సమాచారం అందిందని, అవసరమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మహానగరంలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు నేటినుండి శ్రీకారం



**శేరిలింగంపల్లి, జూలై 19 (జనంసాక్షి) :** విశ్వ నగరం హైదరాబాదులో లోయర్ ఇన్కమ్ గ్రేడ్ స్థాయికి సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారులు సోమవారం నుండి శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా క్యూర్ పరిధిలో లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ ఉండబోతున్నట్లు తెలుస్తోంది. గ్రామం నుంచి మహానగరం వరకు ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పిస్తామని రాష్ట్ర ప్రజాబద్ధల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. పేదల సొంతింటి కలలను సాకారం చేయడమే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ సంకల్పం అని గాంధీ వివరించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజ ఇళ్ల కార్యక్రమాన్ని నేడు రాష్ట్ర సచివాలయంలో ప్రారంభించుకోవడం జరుగుతుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇండ్లు కలిపి మొత్తం 3.50 లక్షల కొత్త ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం రాష్ట్ర ప్రభుత్వం పూలుకుందన్నారు. గతేడాది మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షలకు పైగా పేద కుటుంబాల జీవితాల్లో సొంతింటి వెలుగులు నింపడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. రాష్ట్రంలో పేదవాడి సొంతింటికల నెరవేరే వరకు ఇందిరమ్మ ఇళ్ల యజ్ఞం నిరంతరంగా కొనసాగుతుందని, ఇది ఒకసారి చేపట్టి ముగించే కార్యక్రమం కాదని, రాష్ట్రంలో గూడులేని ప్రతి అర్హులైన నిరుపేద కుటుంబానికి చివరి లబ్ధిదారుని వరకు సొంతింటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రతి నియోజకవర్గాన్ని ప్రత్యేక యూనిట్‌గా తీసుకుని అమలు చేస్తున్న ఈ పథకంలో ఏ నియోజకవర్గానికి సంబంధించిన ప్రజలు ఆ నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకోవాలని అరికపూడి సూచించారు.

# జిల్లా డిఎంహెచ్ఓ వేధింపులు ఆపాలి

## ఆరోగ్య మంత్రి దామోదర రాజ్ నరసింహనను కలిసి టీఎన్జీవో రాష్ట్ర నాయకులు జగదీశ్వర్ జిల్లా అధ్యక్షులు ఊటు యశ్వంత్



**ఇబ్రహీంపట్నం జూలై 19 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణ కుమారి కిందిస్థాయి డాక్టర్లను, ఏఎన్ఎం లను,ఆశావర్కర్లను వేదింపులకు చేస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోద రాజనర్సిహను కలసి విన్నవించినా టిఎన్జీవో రాష్ట్ర నాయకులు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో జిల్లా టీఎన్జీవో అధ్యక్షులు ఊటు యశ్వంత్ కార్యదర్శి శ్రీనివాసరావు కలిశారు..కిందిస్థాయి ఉద్యోగులపైన ఇష్టానుసారంగా జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణ కుమారి వేధిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి డాక్టర్లను, ఏఎన్ఎం లను వేధిస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని టీఎన్జీవో ఉద్యోగ సంఘాలకు హామీ ఇచ్చారు..

# ‘బిఆర్ఆర్ ఫౌండేషన్’ మెగా ఉచిత వైద్య శిబిరాలు

**ఇబ్రహీంపట్నం, జూలై 19(జనం సాక్షి) :** నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందించడమే లక్ష్యంగా బి.ఆర్.ఆర్ ఫౌండేషన్ అధినేత బూడిద రామ్ రెడ్డి ఆధ్వర్యంలో, సాయి కీర్తన్ రెడ్డి లెగసి ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాలు ఆదివారంతో విజయవంతంగా ముగిశాయి. “ఆరోగ్యమే ఆస్తి - ఆరోగ్యమే ఆనందం” అనే శీర్షికతో ఈ నెల 17న ఉప్పరిగూడ గ్రామంలో ప్రారంభమైన ఈ శిబిరాలు, 18న ఇబ్రహీంపట్నం భారత్ గార్డెన్స్, యాచారం గ్రామపంచాయతీ మీదుగా ప్రయాణించి, నేడు (ఆదివారం) తుర్కయంజాల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్ మరియు అబ్దుల్లాపూర్‌మెట్‌లోని వైఎస్ ఆర్ గార్డెన్స్‌లలో ముగింపు శిబిరాలను నిర్వహించారు.
ఈ శిబిరాల్లో సాధు రామ్ హాస్పిటల్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి వైద్య బృందం, డాక్టర్ వినయ్ రెడ్డి వైద్య బృందాలు రోగులకు ప్రత్యేక సేవలు అందించాయి. సాధారణ వైద్య పరీక్షలతో పాటు న్యూరాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, ఉచిత కంటి పరీక్షలు, స్త్రీల ఆరోగ్య సమస్యలు మరియు పిల్లల వైద్య విభాగాల్లో నిపుణులైన వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. తుర్కయంజాల్ లో 520 మంది, అబ్దుల్లాపూర్‌మెట్ కేంద్రంలో 240 మంది.. మొత్తంగా 760 మంది రోగులు ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. అదేవిధంగా సంగం బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 54 మంది రక్తదానం చేసి తమ ఉదారతను చాటుకున్నారు.
ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఆర్ ఫౌండేషన్ అధినేత బూడిద రామ్ రెడ్డితో, ఫౌండేషన్ సభ్యులు నందకుమార్, బూడిద నర్సింహారెడ్డి, మనీష్ రెడ్డి, మాజీ సర్పంచ్ పూజారి శంకరయ్య గౌడ్, గుండ్ల రాజిరెడ్డి, మడుపు గోపాల్, అమరేందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ధనంజయ రెడ్డి, నాగేష్ గౌడ్, ఉదయ్, మంగ ఐలేష్, పున్నమి రాము, ఎంపల్ల మోహన్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, జర్మన్ రెడ్డి, బత్తుల వెంకటేష్, గొరిగి రమేష్, బొడుసు వెంకటేష్ యాదవ్, సామల శ్రీనివాస్ రెడ్డి, బోసు పల్లి కరుణాకర్, హరికృష్ణ, ఆర్మీ మోహన్, వట్టిపల్లి రామ్ రెడ్డి, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు బలమైన పునాది

## జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్

**తాండూరు జులై 19(జనంసాక్షి) :** బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో, న్యూ లోటస్ హాస్పిటల్, తాండూర్ సౌజన్యంతో తాండూర్ బీసీ కాలేజ్ గర్ల్స్ హాస్టల్ విద్యార్థినులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు, తాండూర్ నియోజకవర్గ బీసీ సంఘం కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో విజయాలు సాధించగలరని అన్నారు. ఇంటర్ విద్య ప్రతి విద్యార్థి జీవితానికి టర్నింగ్ పాయింట్ అని పేర్కొంటూ, ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదువుకోవాలని సూచించారు.
బీసీ సంఘం సామాజిక బాధ్యతలో భాగంగా ప్రతి వారం ప్రభుత్వ హాస్టళ్లలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. ఇందులో భాగంగా గత వారం బీసీ స్కూల్ హాస్టల్‌లో, ఈ వారం బీసీ కాలేజ్ గర్ల్స్ హాస్టల్‌లో వైద్య శిబిరం నిర్వహించామని, రానున్న రోజుల్లో ఇతర హాస్టళ్లలో కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ఈరోజు విద్యార్థులే రేపటి భారతదేశ నిర్మాతలు. ఆరోగ్యవంతమైన విద్యార్థులే కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధికి బలమైన పునాది” అని రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ షుకూర్, బీసీ మహిళా సంఘం నాయకులు అనిత, మంజులా, నర్సమ్మ, జగదీశ్వరి, మంబాపూర్ మంజులా, గోట్కె విజయలక్ష్మి, బీసీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బసవరాజ్, బీసీ నాయకులు పర్మేష్, రాము ముదిరాజ్, రామ్‌రెడ్డి, దుబాయ్ వెంకటేష్, కిరణ్, వివేక్ పాల్గొన్నారు. అలాగే న్యూ లోటస్ హాస్పిటల్ ప్రతినిధి మాణిక్యం ఆధ్వర్యంలో డాక్టర్ జుబేర్ అహ్మద్, డాక్టర్ ఫిరోజ్ అహ్మద్, డాక్టర్ నౌరీన్ జహాన్, డాక్టర్ మహీదర్, డాక్టర్ సీమ, డాక్టర్ ముజమ్మిల్తో పాటు ఆసుపత్రి వైద్య బృందం, సిబ్బంది పాల్గొని విద్యార్థినులకు వైద్య సేవలు అందించారు.

# కాంగ్రెస్ గెలుపు కోసం సైనికుడిలా పనిచేయాలి

- మేడిపల్లి డివిజన్ నాయకుల సమావేశంలో తుంగతుర్తి రవి పిలుపు
- ప్రతి కార్యకర్త పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలి
- బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రత్యేక కమిటీలు
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యమని స్పష్టం



**బోడుప్పల్, జూలై 19 (జనంసాక్షి):** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి డివిజన్‌లో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డీసీసీ ప్రధాన కార్యదర్శి జలేందర్ రెడ్డి, పోచారం డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అధిష్ఠానం గుర్తింపు ఇస్తుందని అన్నారు. తుంగతుర్తి రవి మాట్లాడుతూ, గత పదేళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ కాంగ్రెస్ కోసం కార్యకర్తలు అంకితభావంతో పనిచేశారని చెప్పారు. పార్టీలో పాత, కొత్త అనే భేదం లేకుండా అందరూ కలిసి పనిచేసి పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. డివిజన్‌లో బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు త్వరలో పూర్తి స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని, మేడిపల్లి డివిజన్‌లో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# దక్షిణ భారతంలో రెండో స్థానంలో గాయత్రి బ్యాంక్

- రూ.4,558.89 కోట్ల వ్యాపారంతో కొత్త మైలురాయి
- 86 శాఖలు, 9.36 లక్షల మంది ఖాతాదారులతో విస్తరణ
- 2025-26లో రూ.27.21 కోట్ల నికర లాభం నమోదు
- సేవింగ్స్ ఖాతాదారులకు రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం
- వార్షిక సర్వసభ్య సమావేశంలో వివరాలు వెల్లడించిన యాజమాన్యం




**జగిత్యాల బ్యూరో, జూలై 19 (జనంసాక్షి):** రూ.4,558.89 కోట్ల వ్యాపారం, 86 శాఖలతో గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ దక్షిణ భారతదేశంలో రెండో స్థానానికి చేరుకుందని బ్యాంకు అధ్యక్షుడు గుండేటి గంగాధర్ తెలిపారు. ఆదివారం జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 26 ఏళ్ల ప్రయాణంలో బ్యాంకు 9,36,346 మంది ఖాతాదారులను సంపాదించి మల్టీ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంకుగా ఎదిగిందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.27.21 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసి, స్టాట్యుటరీ ఆడిటర్లచే ‘ఏ’ గ్రేడ్ బ్యాంకుగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.6,204.06 కోట్ల వ్యాపార లక్ష్యంతో పాటు మరో 1.5 లక్షల మంది కొత్త ఖాతాదారులను చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. సొంత ఐఎఫ్ఎస్సీ కోడ్‌తో ఆర్టీజీఎస్, నెఫ్ట్ సేవలు ప్రారంభించడంతో పాటు 202 మంది బ్యాంకింగ్ కరెస్పాండెంట్ల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు సేవలను విస్తరించినట్లు చెప్పారు. బ్యాంకు సీఈఓ వనమాల శ్రీనివాస్ మాట్లాడుతూ, మార్చి 31, 2026 నాటికి బ్యాంకు డిపాజిట్లు రూ.2,356.68 కోట్లకు, రుణాలు రూ.1,868.92 కోట్లకు చేరాయని తెలిపారు. గ్రాస్ ఎన్‌పీఏ 1.02 శాతం, నికర ఎన్‌పీఏ సున్నా శాతంగా నమోదైందని, 737 మందికి ఉపాధి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఐఎంపీఎస్, టోల్‌ఫ్రీ బ్యాంకింగ్ వంటి ఆధునిక సేవలను అందిస్తున్నామని తెలిపారు.
సామాజిక బాధ్యతలో భాగంగా సేవింగ్స్ ఖాతాదారులకు రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని అందిస్తున్నామని, ఇప్పటివరకు ప్రమాదవశాత్తు మరణించిన 607 మంది ఖాతాదారుల కుటుంబాలకు బీమా సాయం అందించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన ముగ్గురు ఖాతాదారుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ప్రమాద బీమా చెక్కులను అందజేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు ఎస్. రవికుమార్, డైరెక్టర్లు, సహకార శాఖ అధికారులు, సభ్యులు, ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# మనుబోతులగూడెం ఘటనపై మంత్రి సీతక్క ఆరా

- కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి వివరాల సేకరణ
- సామరస్యపూర్వక పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు
- విధి నిర్వహణలో అతిగా వ్యవహరించి ఉంటే చర్యలు తప్పవు
- ఆదివాసుల హక్కులకు రక్షణ.. కొత్త పోడు ఆక్రమణలకు ప్రోత్సాహం లేదని స్పష్టం



**హైదరాబాద్, జూలై 19 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మనుబోతులగూడెంలో పోడు భూముల వివాదానికి సంబంధించి చోటుచేసుకున్న ఘటనపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కూడా పరిస్థితిపై చర్చించి సమీక్ష నిర్వహించారు. స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని అధికారులకు మంత్రి సీతక్క సూచించారు. విధి నిర్వహణ పేరుతో ఎవరైనా అతిగా వ్యవహరించినట్లు విచారణలో తేలితే సంబంధిత సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూముల విషయంలో అటవీ ఆధారిత ఆదివాసి, గిరిజన కుటుంబాల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో పరిరక్షిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన స్థానికులకు చట్టబద్ధంగా హక్కులు కల్పించే ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. అదే సమయంలో కొత్తగా పోడు భూములను ఆక్రమించే చర్యలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఆదివాసి, గిరిజనుల హక్కుల పరిరక్షణతో పాటు అటవీ సంపద సంరక్షణ కూడా ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతేనని ఆమె పేర్కొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డు ఒక వరం

- లేబర్ కార్డు కలిగిన వారికి రెండో కుమార్తె జననానికి రూ.30 వేల ప్రసూతి సాయం అందజేత
- సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు రాజకుమారి



**జమ్మికుంట, జూలై 19 (జనం సాక్షి):** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కార్డు పథకం మరో కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలిచింది. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని 7వ వార్డుకు చెందిన షాహొద్దీన్ కుటుంబంలో రెండో కుమార్తె జన్మించిన సందర్భంగా తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో లేబర్ కార్డు ద్వారా రూ.30,000 ప్రసూతి ఆర్థిక సాయం మంజూరైంది. ఈ ఆర్థిక సహాయాన్ని సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు రాజకుమారి ప్రత్యేక చొరవతో లబ్ధిదారునికి అందజేశారు. పథకానికి సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ నుంచి నిధుల మంజూరు వరకు కార్మిక కుటుంబానికి అవసరమైన సహకారం అందించి సాయం అందేలా కృషి చేశారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు తప్పనిసరిగా లేబర్ కార్డును నమోదు చేసుకుని ఎప్పటికప్పుడు రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. లేబర్ కార్డు ఉన్న కార్మికులకు ప్రసూతి ఆర్థిక సాయం, పిల్లల విద్యా సహాయం, ప్రమాద బీమా, సహజ మరణం లేదా ప్రమాద మరణం సంభవించినప్పుడు పరిహారం, వివాహ సహాయం, అంత్యక్రియల సాయం వంటి అనేక సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి భవన నిర్మాణ కార్మికుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు షాహొద్దీన్ కుటుంబ సభ్యులు సీఐటీయూ నాయకురాలు రాజకుమారికి కృతజ్ఞతలు తెలిపారు. లేబర్ కార్డు ద్వారా అందిన ఆర్థిక సాయం తమ కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్మికులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సీడ్ ప్రొడ్యూసర్స్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: సీపీఎం



**కరీంనగర్ టౌన్, జూలై 19, (జనం సాక్షి) :** జిల్లాలో రైతులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్న సీడ్ ప్రొడ్యూసర్స్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఒప్పందం ప్రకారం రైతులకు పూర్తి చెల్లింపులు చేయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని ముకుంద్ లాల్ మిశ్రా భవన్‌లో జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025 నవంబర్‌లో రైతులతో కుదుర్చుకున్న ఒప్పందాలను పక్కనపెట్టి, పంట సీడ్ ప్లాంట్లకు చేరిన తర్వాత ధరలను తగ్గించడం రైతులను మోసం చేయడమేనని ఆయన ఆరోపించారు. తరుగు, తూకం, సంచి బరువు పేర్లతో ప్రతి ఏటా రైతుల నుంచి అక్రమంగా కోతలు విధిస్తున్న సీడ్ ప్లాంట్ల యజమానులపై నాన్‌బెయిలబుల్, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులు అడిగితే బెదిరింపులకు దిగుతున్నారని కూడా విమర్శించారు. అలాగే జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, సాగునీరు అందించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, కన్నెపల్లి నుంచి అన్నారం బ్యారేజీకి నీటిని ఎత్తిపోసే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు వెంటనే పంపిణీ చేయాలని, అన్ని రకాల వరి వంగడాలకు బోనస్ ఇవ్వాలని, వ్యవసాయానికి నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా దశలవారీ ఆందోళనలు చేపడతామని మిల్కూరి వాసుదేవరెడ్డి హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు వర్ణ వెంకట్‌రెడ్డి, జి. బీమాసాహెబ్, ఉప్పునూటి శ్రీనివాస్, సుంకర సంపత్, ఎడ్ల రమేష్, జి. రాజేశం, డి. నరేష్ పటేల్, కోనేటి నాగమణి, కొప్పుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అస్తిత్వమే సేన నినాదం

- పంచ జన్య సంకల్ప సభలో - తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత




**కోరుట్ల జులై 19(జనం సాక్షి) :** కోరుట్లలో జరిగిన పంచ జన్య సంకల్ప సభలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత కోరుట్ల సభలో పాల్గొని ప్రస్తుత గత ప్రభుత్వాలపై, ప్రస్తుత ప్రభుత్వం పై ఘాటైన విమర్శలు చేశారు. గతంలో తాను టిఆర్ఎస్ లో ఉన్నప్పుడు కూడా అనేక విషయాలపై ముక్కుసూటిగా ప్రశ్నించడంతోనే తనను కొందరు కుట్ర చేసి పార్టీ నుంచి బయటకు పంపేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదేమైనా సామాజిక న్యాయం జరగని పార్టీలలో ఉండడం కంటే బడుగు బలహీన వర్గాలైన బీసీ, ఎస్సీ ఎస్టీమరియు మైనారిటీ వర్గాలకు అండగా ఉండటమే ముఖ్యం అనిపించి అంతర్జాతీయ నిపుణులతో చర్చించిన తర్వాతనే నూతన పార్టీ తెలంగాణ రక్షణ సేన ఆవిర్భవించిందని తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే బీసీలకు ప్రభుత్వం ఇస్తానన్న 42 శాతం రిజర్వేషన్ గురించి నిర్ణయం తీసుకుంటామని,ఎస్సీ ఎస్టి, మైనారి టీలను సామాజిక న్యాయం జరిగేలా చూస్తామన్నారు. మహాభారతంలో శ్రీకృష్ణుడు అధర్మంపై యుద్ధం చేసే ముందు పాంచ జన్యం పూరించాడు. ఆయన స్ఫూర్తితోనే నేను కూడా పేదల కోసం ఐదు కీలక అంశాలను లక్ష్యంగాలు చేసుకొని రాజకీయ పార్టీగా మీ ముందుకు వచ్చానన్నారు . విద్య, వైద్యం ఉపాధి పేదరిక నిర్మూలన, అవినీతి అంతం స్పష్టమైన అవగాహనతో మీ ముందుకు వస్తున్నాను. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేద తల్లిదండ్రులైన తమ పిల్లలకి లక్షలు ఖర్చు చేసి కార్పోరేట్ విద్యానందిస్తున్నారు. అలాంటి లక్షల విలువ చేసి కార్పొరేట్ విద్య నేను మీ బిడ్డలకు అందుబాటులోకి తీసుకొస్తాను అన్నారు. వైద్యం అందగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరికీ కార్పొరేట్ లెన్స్ అందిస్తానని,విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉపాధి లేక బిక్కుబిక్కుమంటే ఎదురుచూస్తున్న సందర్భంలో వారికి అద్భుతమైన ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అవినీతి లేని రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దామని తెలిపారు. బీసీ ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ వర్గాలకు ప్రభుత్వంలో ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తామని, అదేవిధంగా ఈ సామాజిక వర్గాలకు మరిన్ని పథకాలతో సామాజిక న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. రైతులను రాజులుగా చేసి చూపిస్తామని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా వారిని మోసం చేస్తుందని విమర్శించారు. వాళ్లకు 50% రైతులకు ఇప్పటికీ రుణమాఫీ కాలేదు రైతులంటే ప్రభుత్వానికి అంత చులకన వారికి సకాలంలో పంటల కోసం యూరియా కూడా అందరి పరిస్థితి అందుకే రైతును రాజులు చేసి చూపిస్తాం ప్రతి ప్రభుత్వ ఆఫీసులో రైతుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలందరూ తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక స్వావలంబన సాధించేలా తెలంగాణ రాష్ట్ర రక్షణ సేన చూస్తుందని తెలిపారు.

## కొండగట్టులో ఆంజనేయస్వామిని దర్శించుకున్న మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి



**మల్యాల, జూలై 19 (జనంసాక్షి):** తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని తెలంగాణ మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థానం అర్చకులు, అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందజేశారు. దర్శనానంతరం స్వామివారి తీర్థప్రసాదాలను పార్థసారథి కుటుంబ సభ్యులకు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎస్. అంజనారెడ్డి మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథిని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతి, ఏఈఓ హరిహారనాథ్, సూపరింటెండెంట్ సునీల్, చంద్రశేఖర్ తదితర ఆలయ అధికారులు పాల్గొన్నారు. దర్శనానికి విచ్చేసిన భక్తులు కూడా పార్థసారథిని మర్యాదపూర్వకంగా పలకరించారు.

# వికలాంగుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య
- మొయినాబాద్‌లో కాంగ్రెస్ వికలాంగుల విభాగం సభ్యత్వ నమోదు ప్రారంభం



**మొయినాబాద్,జూలై19, జనంసాక్షి:** కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న ఓం శాంతి నిలయంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.నరసింహ చారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, టీపీసీసీ నాయకుడు షాబాద్ దర్శన్ ముఖ్యఅతిథులుగా హాజరై సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ.. వికలాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. వికలాంగుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వికలాంగుల సమస్యలు పట్టించుకోలేదని, వికలాంగుల కార్పొరేషన్ పనితీరు కూడా కనిపించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వికలాంగులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం నమోదు చేసుకొని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడి జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షుడు ఏం.సురేష్, ఈ. జ్ఞానేశ్వర్ గౌడ్, పరమేష్, శేఖర్ రెడ్డి, కె.విజయ్ కుమార్, ఈ.సునీత, జంగయ్య, కె.చారి, బి. శేఖర్, రంగారెడ్డి జిల్లాలోని దివ్యాంగులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు, పాల్గొన్నారు.

## ఉద్యమకారుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తా

### తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పిడమర్తి రవి.



**ఓయూ, జులై 19( జనంసాక్షి) :** ఉద్యమకాల్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పిడమర్తి రవి పేర్కొన్నారుఆదివారం హైదరాబాద్లోని ఓయూ ఆర్ట్స్ కళాశాల ముందు తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పిడమర్తి రవి అధ్యక్షతన ఉద్యమకారుల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ ప్రతి ఉద్యమకారుడికి న్యాయం జరిగే విధంగా ఉద్యమకాల్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 250 గజాల ఇంటి స్థలం పింఛన్ గుర్తింపు ప్రతి ఉద్యమకారుడికి వచ్చే వరకు ఉద్యమించాలని అన్నారు. త్వరలో కమిటీలు వేసి జిల్లా రాష్ట్రస్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యమకారుల సభలను నిర్వహిస్తామని అన్నారు మూడు నెలల్లో ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు ఏ విధంగా అందిస్తాము చెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం గడువు విధించిందని గడువులోపు ఉద్యమకారులకు న్యాయం చేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఒంగోని శ్రీనివాస్, జిలాని, సంజయ్ గౌడ్ , ప్రకాష్ గౌడ్, ఎస్ నాగేందర్, రొంపల్లి అశోక్ తెలంగాణ ఆర్టిఐ మాజీ చైర్మన్ శంకర్ నాయక్ ఓయూ జేఏసీ నాయకులు రహీం చందర్ నాయక్ ఇతర ఉద్యమకారులు పాల్గొన్నారు.

# చలో లేబర్ ఆఫీస్ జయప్రదం చేయండి

## జీవో-12 రద్దు చేయాలి

- భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిధులను ప్రైవేట్ కంపెనీలకు మళ్లిస్తున్నారు : సీఐటీయూ
- సీఎస్‌సీ ద్వారా నిర్వహిస్తున్న హెల్త్ టెస్టులను తక్షణమే నిలిపివేయాలి
- పెండింగ్ క్లెయిమ్‌లు, కార్డు రెన్యూవల్స్ వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- జూలై 20న లేబర్ ఆఫీస్ ఎదుట జరిగే ధర్నా



**అంబర్‌పేట్, జూలై 19 (జనంసాక్షి):** తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రైవేట్ బీమా కంపెనీలకు అప్పగించే విధంగా జారీ చేసిన జీవో-12ను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఎస్‌సీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెల్త్ టెస్టులను నిలిపివేయాలని కోరుతూ ఆదివారం బతుకమ్మకుంట లేబర్ అడ్డా వద్ద కరపత్రాలు పంపిణీ చేసి కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు జి. రాములు మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమ నిధులను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ బీమా సంస్థలకు మళ్లించడం వల్ల వేలాది మంది కార్మికులు నష్టపోతున్నారని ఆరోపించారు.
భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిధిలో అమలవుతున్న ప్రమాద మరణ పరిహారం, సహజ మరణ సహాయం, శాశ్వత వైకల్యానికి సంబంధించిన సంక్షేమ పథకాలను ప్రైవేట్ బీమా సంస్థల ద్వారా అమలు చేయాలని ప్రభుత్వం జీవో-12ను తీసుకువచ్చిందని తెలిపారు. ఈ ప్రక్రియలో క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్, ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలకు బ్రోకర్ సంస్థ ద్వారా రూ.346 కోట్ల మేర నిధులు బదిలీ చేశారని ఆరోపించారు. 2025 జూలై నుంచి ఇప్పటివరకు కార్మికులకు సుమారు రూ.150 కోట్ల మేర మాత్రమే ప్రయోజనాలు అందగా, మిగిలిన భారీ మొత్తాన్ని బీమా సంస్థలు తమ వద్దే ఉంచుకున్నాయని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో నమోదైన లక్షలాది మంది కార్మికుల పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించకుండా, కొత్త సంక్షేమ పథకాలు అమలు చేయకుండా, ఉన్న పథకాల నిధులను కూడా పెంచకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రాములు అన్నారు. సుమారు 54 వేల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండగా, 13 లక్షల మందికి పైగా కార్మికుల లేబర్ కార్డుల రెన్యూవల్స్ పూర్తి కాలేదని పేర్కొన్నారు. సీఎస్‌సీ ద్వారా నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు కార్మికులకు ఉపయోగకరంగా లేకపోయినా, పరీక్షలు చేయించుకోకపోతే లేబర్ కార్డు రద్దు చేస్తామని అధికారులు భయపెడుతున్నారని ఆరోపించారు. ఒక్కో కార్మికుడిపై సుమారు రూ.3,250 వరకు ఖర్చు చూపిస్తూ ప్రభుత్వ నిధులను ప్రైవేట్ సంస్థలకు మళ్లిస్తున్నారని విమర్శించారు. కార్మికుల సంక్షేమ బోర్డు నిధుల వినియోగంపై నిర్ణయాలు తీసుకునే సలహా కమిటీని ఏర్పాటు చేయకుండానే ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని, కేంద్ర చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తోందని అన్నారు.
రాష్ట్రవ్యాప్తంగా 28,22,320 మంది కార్మికులు నమోదు చేసుకున్నప్పటికీ, కేవలం 15,55,513 లేబర్ కార్డులకే రెన్యూవల్ జరిగిందని, మిగిలిన 12,65,919 మంది కార్మికుల కార్డులు ఇప్పటికీ పునరుద్ధరించలేదని తెలిపారు. ఇది కార్మికుల సంక్షేమ నిధులను దుర్వినియోగం చేసే కుట్రలో భాగమేనని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రైవేట్ బీమా సంస్థల ద్వారా అమలవుతున్న విధానాన్ని రద్దు చేసి, సంక్షేమ పథకాలను కార్మిక శాఖ ద్వారానే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 20న సోమవారం లేబర్ ఆఫీస్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బతుకమ్మకుంట లేబర్ అడ్డా అధ్యక్షుడు సురేష్ నాయక్, కమిటీ సభ్యులు రాజు, శీను, ఈర్యా, ధర్మానాయక్, వీరమ్మ, కాంతి తదితరులు పాల్గొన్నారు.

# దంచికొట్టిన వర్షం.. రైతుల్లో ఆనందం

- గంటపాటు ఏకధాటిగా కురిసిన భారీ వర్షం
- పంటలకు ప్రాణం పోసిన వరుణుడు..చెరువులు,కుంటలకు జలకళ



**ధారూర్ జూలై 19 (జనంసాక్షి) :** గత కొద్ది రోజులుగా ఎండల తీవ్రత,ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు, వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు. ధారూర్ మండలంలో ఆదివారం సాయంత్రం గంటపాటు ఏకధాటిగా కుండపోత వర్షం కురిసింది. ఒక్కసారి గా కురిసిన భారీ వర్షంతో ప్రధాన రహదారులపై వర్షపు నీరు ప్రవహించ గా, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. వర్షం కారణంగా ఎండల తీవ్రత తగ్గి వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ప్రజలు ఊరట పొందారు. మండలంలోని పలు గ్రామాల్లో మంచి వర్షపాతం నమోదవడంతో వ్యవసాయ పొలాలు జలమయమ య్యాయి. వరి, పత్తి,మొక్కజొన్న, కంది తదితర పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వర్షాలు లేక పంటల ఎదుగుదలపై ఆందోళన వ్యక్తం చేసిన రైతులు, ఈ వర్షంతో పంటలకు కొత్త ఊపిరి లభించిందని చెబుతున్నారు. నేలలో తేమ పెరగడంతో పంటల పెరుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొంటున్నారు. భారీ వర్షంతో మండలంలోని చెరువులు, కుంటలు, వాగులు, కాలువల్లోకి నీరు చేరింది. దీంతో భూగర్భ జలమట్టాలు పెరిగే అవకాశముందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో కూడా ఇలాంటి వర్షాలు కురిస్తే ఖరీఫ్ పంటలకు మరింత మేలు జరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. వర్షం కారణంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు స్వల్ప అంతరాయం ఏర్పడినా, ఎలాంటి పెద్ద నష్టం చోటుచేసుకోలేదని స్థానికులు తెలిపారు. మొత్తంగా ఈ వర్షం ధారూర్ మండల రైతాంగంలో కొత్త ఆశలు నింపింది. సమయానికి కురిసిన ఈ వాన ఖరీఫ్ సాగుకు శుభసూచకంగా మారిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## కరీంనగర్‌లో ఘనంగా పోచమ్మ తల్లి బోనాల జాతర

### స్వయంగా బోనమెత్తిన యాదగిరి సునీల్ రావు

**కరీంనగర్ అర్బన్, జూలై 19 (జనంసాక్షి) :** ఆషాడమాసాన్ని పురస్కరించుకుని కరీంనగర్ నగరంలోని భగత్ నగర్, శ్రీ వెంకటేశ్వర కాలనీలో 'పోచమ్మ తల్లి బోనాల జాతర' అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది. శ్రీ వెంకటేశ్వర కాలనీ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భక్తిపూర్వక కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు స్వయంగా నెత్తిన బోనమెత్తి, పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలతో కలిసి భక్తిశ్రద్ధలతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఊరేగింపు అనంతరం పోచమ్మ తల్లి దేవాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర కాలనీ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గాజె నాగులు, ప్రతినిధులు చెప్యాల రాంరెడ్డి, తడిసిన బాల్ రెడ్డి, ముస్కుల విద్యాసాగర్ రెడ్డి, తిప్పారపు శ్రీనివాస్‌లతో పాటు కాలనీ వాసులు, మహిళలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు.

# న్యాక్ సెంటర్ ఎప్పుడు ప్రారంభిస్తారు..?

- ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి: మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్
- 32 నెలల తర్వాత నిధులు తెచ్చి ప్రచారం చేయడం సరికాదని విమర్శ
- ప్రారంభ తేదీపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని డిమాండ్



**మంథని, జూలై 19 (జనంసాక్షి):** మంథనిలో న్యాక్ సెంటర్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారో ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు స్పష్టత ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మంథనిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 32 నెలలు గడిచినా న్యాక్ సెంటర్ ప్రారంభం కాకపోవడం విచారకరమన్నారు. న్యాక్ సెంటర్‌కు నిధులు మంజూరు చేయడాన్ని గొప్ప విజయంగా ప్రచారం చేసుకోవడం కంటే, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపైనే దృష్టి పెట్టాలని సూచించారు. కొత్త భవనం పూర్తయ్యాక ప్రారంభిస్తారా, లేక అద్దె భవనంలోనే ప్రారంభిస్తారా అనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో సాగడం లేదని, పెద్దపల్లి-కాటారం రహదారి వంటి కీలక పనులు కూడా పూర్తి కాలేదని విమర్శించారు. అభివృద్ధి పేరుతో ప్రచారం కాకుండా ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని సూచించారు. న్యాక్ సెంటర్ ప్రారంభంలో జరిగిన ఆలస్యానికి కారణాలను వెల్లడించి, వెంటనే ప్రారంభ తేదీని ప్రకటించాలని పుట్ట మధూకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి : వీఎన్ఆర్



**కరీంనగర్ బ్యూరో, జూలై 20 (జనంసాక్షి) :** విద్యార్థుల లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని, సమాజంలో ఉత్తమ స్థానాన్ని కైవసం చేసుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని ఒక ప్రైవేటు వేడుక మందిరంలో అల్ఫోర్స్ ఎక్సెల్ (బాలుర రెసిడెన్షియల్ కళాశాల) క్యాంపస్ "నయా దౌర్" పేరుతో నిర్వహించినటువంటి ఫ్రెషెస్ పార్టీ వేడుకలను అట్టహాసంగా విద్యార్థుల కేరింతల మధ్య ప్రారంభించారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి సరస్వతి మాత విగ్రహానికి పూజను ఆచరించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడమే కాకుండా వివిధ పోటీలలో పాల్గొని ప్రతిభను చాటి అవకాశాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. నేడు మన భారత దేశంలో ఎంతోమంది విద్యార్థులు వారి అసమాన ప్రతిభతో అమూల్యమైనటువంటి అవకాశాలను సొంతం చేసుకొని పటిష్టమైన స్థానాలలో స్థిరపడుతున్నారని గుర్తు చేస్తూ, అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో సైతం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన విద్యానందిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నామని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని వారు చెప్పారు. ఆరంభం నాటి నుండి విద్యార్థులకు ప్రతిభ ఆధారిత విద్యను అందిస్తూ అగ్రగామిగా ఉంటున్నామని వారు చెప్పారు. 2025 -26 విద్యా సంవత్సరంలో వివిధ పరీక్షల ఫలితాల్లో అల్ఫోర్స్ అగ్రస్థానంలో నిలిచినదని హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులు కష్టపడి తరగతి గదిలో నేర్చుకున్నటువంటి విషయాలను సమీక్షించుకొని వివిధ స్థాయిలలో నిర్వహిస్తున్నటువంటి పరీక్షల్లో ప్రతిభను చాటి అగ్రగామిగా ఉండాలని వారు చెప్పారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సంస్కృతిక కార్యక్రమాలు అలరింపచేసాయి. అదే విధంగా 2025 -26 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం చేశారు. అదేవిధంగా విద్యార్థుల ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక నృత్యాలు అలరింపచేసాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బహదూర్గూడ భూముల ఆందోళన కేసులో 36 మందిపై పోలీసులు చర్యలు

హైదరాబాద్/ శంషాబాద్,జూలై19 (జనంసాక్షి) : శంషాబాద్ విమానాశ్రయం సమీపంలోని బహదూర్గూడ ప్రభుత్వ భూముల వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసిన నేపథ్యంలో పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిని అడ్డుకోవడం తదితర ఆరోపణలపై మొత్తం 36 మందిపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం. కేసు నమోదైన వారిలో స్థానిక రైతులు, మహిళలు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఉన్నారు. పటోళ్ల కార్తిక్ రెడ్డి, పంతంగి భూపాల్ రెడ్డి, మహేందర్, కోలన్ ప్రదీప్ రెడ్డి తదితరుల పేర్లు కూడా ఎఫ్ఐఆర్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. బహదూర్గూడలోని సర్వే నంబర్లు 62, 28లో ఉన్న ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియ చేపట్టడంతో స్థానిక రైతులు గత కొద్ది రోజులుగా నిరసన చేపడుతున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం అధికారులు, పోలీసులు భారీ బందోబస్తుతో అక్కడికి చేరుకుని దీక్షా శిబిరాన్ని తొలగించి ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ చర్యలను వ్యతిరేకిస్తూ రైతులు, స్థానికులు నిరసనకు దిగడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారులు పోలీసులను అడ్డుకోవడంతో పాటు కొందరు కారం చల్లడం, కుర్చీలు విసరడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని పోలీసులు పేర్కొన్నారు. అనంతరం పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చిన పోలీసులు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.


# మింగిన భూములు కక్కించారు!

**జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం రామ్‌సాగర్ గ్రామంలో ఎన్నాళ్లుగానో వివాదాస్పదంగా ఉన్న సీలింగ్ భూముల వ్యవహారంలో బాధితుల పోరాటానికి ఫలితం దక్కింది. గ్రామ సర్పంచ్‌తో కలిసి బాధితులు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ శాఖ సమగ్ర విచారణ చేపట్టింది. విచారణలో సంబంధిత భూములు భూ పరిమితి (సీలింగ్) చట్టం కింద ప్రభుత్వానికి సంక్రమించినవేనని తేలడంతో వాటిని తిరిగి ప్రభుత్వ ఖాతాలో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.**

## ఎట్టకేలకు బాధితుల పోరాటం ఫలించింది

## ప్రభుత్వ ఖాతాలోకి సీలింగ్ భూములు.. శభాష్ కలెక్టర్

జగిత్యాల బ్యూరో, జూలై 19 (జనంసాక్షి) :




విచారణలో సర్వే నంబర్ 545లో 11.26 ఎకరాలు, సర్వే నంబర్ 551లో 11 ఎకరాల భూమి ప్రభుత్వ సీలింగ్ భూమేనని నిర్ధారణ అయింది. ఈ మేరకు జూలై 7న కొడిమ్యాల తహసీల్దార్‌కు ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్, భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు.

### 2018 నుంచి జరిగిన రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు చెల్లవు

ఈ భూములకు సంబంధించి పొనుగోటి కృష్ణారావు, గోలి అనిత, పొనుగోటి హరీష్, నరేష్, బొడ్ల సతీష్, బొడ్ల ఉమాదేవి పేర్లపై 2018 నుంచి 2025 మధ్య జరిగిన మ్యుటేషన్లు, రిజిస్ట్రేషన్లు చట్టబద్ధం కావని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. వీరి పేర్లను రెవెన్యూ రికార్డులు, భూభారతి నమోదుల నుంచి తొలగించి, భూమిని ప్రభుత్వ భూమిగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

### అధికారుల పాత్రపై అనుమానాలు

ప్రభుత్వ భూమిగా అధికారిక రికార్డుల్లో ఉన్నప్పటికీ, పట్టాదారు పాస్‌పుస్తకాలు, మ్యుటేషన్లు, రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయనే అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అప్పటి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం లేదా దుర్వినియోగం వల్లే ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయా? అనే కోణంలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, బాధితులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### బాధితుల పోరాటానికి విజయం

ఏళ్ల తరబడి సాగిన పోరాటం, ప్రజావాణిలో చేసిన ఫిర్యాదు, జిల్లా కలెక్టర్ చొరవతో చివరకు ప్రభుత్వ భూములు తిరిగి ప్రభుత్వ ఖాతాలో చేరడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడడంలో జిల్లా కలెక్టర్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమని కొనియాడుతున్నారు. ఇక ఈ వ్యవహారంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటేనే పూర్తి న్యాయం జరిగినట్లవుతుందని బాధితులు అభిప్రాయపడుతున్నారు.

# కార్టూనిస్ట్ శేఖర్ స్మారక అవార్డులు కళాకారులకు స్ఫూర్తి..



- కళను ప్రోత్సహించడం సమాజ బాధ్యత
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూలై 19 (జనంసాక్షి) : ప్రముఖ కార్టూనిస్ట్ శేఖర్ స్మారకార్థం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్టూనిస్ట్ శేఖర్ మెమోరియల్ అవార్డ్స్-2026 ప్రదానోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలు అందజేశారు. కార్టూన్ విభాగంలో కార్టూనిస్ట్ ఎం. నారు, ఆర్టిస్టు విభాగంలో చిత్రకారుడు కూరెళ్ల శ్రీనివాస్ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాజకీయ జీవితంలో ప్రతిరోజూ విమర్శలు, ప్రతి విమర్శల మధ్య గడుపుతున్న తమకు ఇలాంటి ఆహ్లాదకరమైన సాహిత్య, కళా వేదికల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని అన్నారు. కళాకారులు, రచయితలు, కవులు, చిత్రకారులతో మమేకమయ్యే అవకాశాలు అరుదుగా వస్తాయని, అలాంటి సందర్భాలు పాత జ్ఞాపకాలను, ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేస్తాయని చెప్పారు. కార్టూనిస్టుల పాత్రపై మాట్లాడిన కేటీఆర్, "ఒక చిత్రం వెయ్యి పదాలతో సమానం" అనే సూక్తిని ప్రస్తావిస్తూ, సమాజం, రాజకీయాలపై కార్టూన్లు చూపే ప్రభావం ఎంతో గొప్పదని అన్నారు. భారతదేశంలో ఆర్.కే. లక్ష్మణ్ వంటి మహోన్నత కార్టూనిస్టులు చూపిన మార్గం చిరస్మరణీయమని, అంతర్జాతీయంగా బిల్ వాటర్సన్ సృష్టించిన క్యాల్విన్ అండ్ హాబ్స్ తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. తెలుగులో ఈనాడు శ్రీధర్, సాక్షి శంకర్ వంటి కార్టూనిస్టుల ప్రతిభను ప్రశంసించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహాత్మా గాంధీ విలువలు, ఆయన చూపిన సిద్ధాంతాల అవసరం దేశానికి మరింత పెరిగిందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. మత విశ్వాసాలు ప్రతి వ్యక్తికి వ్యక్తిగతమైనవేనని, పరస్పర గౌరవంతో ముందుకు సాగడం సమాజానికి అవసరమని పేర్కొన్నారు. జీవితంలో గెలుపు, ఓటములు సహజమని, అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలకు మేలు చేయడమే ప్రజాప్రతినిధుల కర్తవ్యమని కేటీఆర్ అన్నారు. కళను ప్రోత్సహించేందుకు ఇలాంటి అవార్డులు తప్పనిసరి అని పేర్కొంటూ, ప్రతిభావంతులైన యువ కళాకారులను గుర్తించి ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని చెప్పారు. శేఖర్ కుటుంబ సభ్యులు, మిత్రులు గత ఆరేళ్లుగా ఆయన స్మారకార్థం అవార్డులను అందించడం అభినందనీయమని కేటీఆర్ పేర్కొన్నారు. దాదాపు రెండు దశాబ్దాల పాటు కార్టూనిస్టుగా శేఖర్ విశిష్ట సేవలు అందించారని, సమకాలీన అంశాలపై ఆయన వేసిన కార్టూన్లు ప్రత్యేక గుర్తింపు పొందాయని అన్నారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన గీసిన కార్టూన్లు ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో రగిలించాయని, ఆయన ప్రస్థానం నేటి తరం కార్టూనిస్టులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. జూన్ 2, 2014కు ముందే ఆయన మరణించడం దురదృష్టకరమన్నారు. వచ్చే ఏడాది నుంచి శేఖర్ మెమోరియల్ అవార్డులను మరింత ఘనంగా నిర్వహించేందుకు తన వంతు సహకారం అందిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్‌కు బదులుగా రవీంద్రభారతిలో మరింత వైభవంగా కార్యక్రమం నిర్వహించేలా అవసరమైన అన్ని విధాలుగా అండగా ఉంటానని తెలిపారు.

# ఉపాధి కల్పన, జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం

**ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ సమగ్ర కార్యాచరణ సిద్ధం**

**మంత్రి సీతక్క ఆదేశాలతో నేడు అన్ని జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు**

హైదరాబాద్, జూలై 18 (జనంసాక్షి) : ఎల్‌నినో ప్రభావంతో సంభవించే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ విబిజి రామ్-జీ కింద ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించడంతో పాటు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, కరువు నివారణ చర్యలను రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించింది. మంత్రి సీతక్క ఆదేశాలతో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ సోమవారం అన్ని జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనుంది. దీనికి సంబంధించి ఆదివారం పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ సిఎస్ దాన కిషోర్, శాఖ ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఈ ఆర్థిక సంవత్సరంలో మార్చి 31 నాటికి మొత్తం 12 కోట్ల పనిదినాలు కల్పించడాన్ని లక్ష్యంగా నిర్ణయించగా, జూలై నుంచి అక్టోబర్ వరకు తొలి దశలో 4.5 కోట్ల పనిదినాలు సృష్టించేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం రోజుకు సుమారు 2.5 లక్షల మంది కూలీలకు ఉపాధి లభిస్తుండగా, మరో 2.5 లక్షల పనిదినాలను అదనంగా కల్పించి రోజుకు 5 లక్షల మందికి ఉపాధి అందించేందుకు జిల్లా యంత్రాంగాన్ని సమాయత్తం చేశారు.



ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు వచ్చే మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో నీటి సంరక్షణ పనులు చేపట్టనున్నారు. ఇందులో 9.60 లక్షల ఇంకుడు గుంతలు, 25 వేల పంట కుంటలు, 5 వేల ఊట కుంటలు, 5 వేల బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు చేపట్టనున్నారు. అలాగే వనమహోత్సవం, గ్రామ పంచాయతీ భవనాలు, వీఓ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయనున్నారు. తెలంగాణ జలసిరి కార్యక్రమం కింద ప్రతి గ్రామంలో గృహాల వద్ద సోక్‌పిట్లు, రైతుల కోసం పంట కుంటలు, వర్షపు నీటిని నిల్వ చేసే పర్కొలేషన్ ట్యాంకులు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ కార్యక్రమం సమర్థవంతమైన అమలుకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ పంచాయతీ స్థాయి వరకు అధికారులకు, సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణలు నిర్వహించారు. అవసరమైతే మరిన్ని శిక్షణలు నిర్వహించాలని, ప్రతి గ్రామంలో పనులు ప్రారంభమయ్యేలా జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి సీతక్క ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కరువు ప్రభావాన్ని తగ్గిస్తూ, ప్రజలకు ఉపాధి భద్రతతో పాటు నీటి భద్రతను కల్పించడమే ఈ ప్రత్యేక కార్యాచరణ ప్రధాన లక్ష్యమని శాఖ వెల్లడించింది.

# జనగామ కలెక్టరేట్ నిధుల దుర్వినియోగం

- ముగ్గురు ఉద్యోగులపై క్రిమినల్ కేసు

జనగామ (జనంసాక్షి) : జనగామ కలెక్టరేట్‌కు సంబంధించిన నిధుల నిర్వహణలో రూ.37.85 లక్షల విలువైన అనుమానాస్పద చెల్లింపులు గుర్తించినట్లు జిల్లా యంత్రాంగం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. అంతర్గత తనిఖీలు, భౌతిక పరిశీలన కమిటీ నివేదిక ఆధారంగా ఈ అంశం వెలుగులోకి వచ్చిందని పేర్కొంది. అధికారుల వివరాల ప్రకారం, ట్రెజరీ/పీఎఫ్ఎంఎస్ వ్యవస్థకు వెలుపల నిర్వహించిన ఒక బ్యాంకు ఖాతా నుంచి ఫర్నిచర్, కంప్యూటర్లు, ఇతర సామగ్రి కొనుగోలు పేరుతో చెల్లింపులు జరిగినట్లు రికార్డులు ఉన్నాయని, అయితే భౌతిక తనిఖీలో ఆయా వస్తువులు గుర్తించలేదని, సంబంధిత కొనుగోలు రికార్డులు కూడా లభించలేదని వెల్లడించారు. ఈ వ్యవహారానికి సంబంధించి ముగ్గురు కలెక్టరేట్ ఉద్యోగులను సస్పెండ్ చేసి, శాఖాపరమైన చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం ఫిర్యాదు మేరకు జనగామ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం.387/2026గా కేసు నమోదు చేసి, భారతీయ న్యాయ సంహిత-2023, ఐటీ చట్టంలోని సంబంధిత నిబంధనల కింద దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

# 26న ఎస్వీకేలో రిజర్వేషన్ డే

## ఎమ్మెల్సీ కోదండరాం



ఎల్కతుర్తి (జనంసాక్షి) : ఈ నెల 26న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఛత్రపతి సాహూ మహారాజ్ జయంతి సందర్భంగా నిర్వహించే రిజర్వేషన్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. ఈ మేరకు భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని ప్రజాగ్రంథాలయం వద్ద రిజర్వేషన్ డే పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ 1902లో కొల్హాపూర్ సంస్థానంలో ఛత్రపతి సాహూ మహారాజ్ తొలిసారిగా 50 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని, అదే స్ఫూర్తితో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. ప్రస్తుతం రిజర్వేషన్లను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, వాటి పరిరక్షణ కోసం బహుజన వర్గాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కదిరే కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కవ్వా లక్ష్మారెడ్డి, డ్యాగల సారయ్య, చెప్యాల ప్రకాశ్, వేముల జగదీష్, గొడుగు వజ్రమ్మ, జయ, మహమ్మద్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నారపోగు

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన నారపోగు వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్ అధికారిక నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకంపై నారపోగు వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ అధిష్ఠానానికి, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కొత్తగూడెం-పాల్వంచ సమగ్రాభివృద్ధికి కృషి

- 14 కోట్లతో దమ్మపేట-పాల్వంచ నాలుగు లేన్ల రహదారి విస్తరణకు శంకుస్థాపన
- 50 లక్షలతో సీసీ రోడ్ పనులు , 50 లక్షలతో సెంట్రల్ లైటింగ్-డివైడర్ అభివృద్ధి పనులకు శ్రీకారం
- పాల్వంచలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం...
- జీవో-76 అంశంపై త్వరలో స్పష్టత
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం, జూలై 20 (జనం సాక్షి) : కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దమ్మపేట-పాల్వంచ ప్రధాన రహదారిలో జిల్లా ఖనిజ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధుల ద్వారా రూ.14 కోట్ల నిర్మాణ వ్యయంతో సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర రెండు లేన్ల రహదారిని నాలుగు లేన్ల రహదారిగా విస్తరించే పనులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంచికంటి నగర్ హర్ష టౌన్‌షిప్‌లోని ఎస్‌కేటీ అపార్ట్‌మెంట్ నుంచి ప్రధాన రహదారి వరకు రూ.50 లక్షల నిర్మాణ వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి గోదుమవాగు వరకు రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సెంట్రల్ లైటింగ్, డివైడర్ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ దమ్మపేట-పాల్వంచ రహదారి అనేక సంవత్సరాలుగా దెబ్బతిని ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని, పాల్వంచతో పాటు అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల ప్రజలు కూడా ఈ రహదారిపై ఆధారపడుతున్నందున అత్యవసరంగా డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.14 కోట్లను మంజూరు చేసి నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాల్వంచ ప్రాంతంలో భూ సమస్యలు, రిజిస్ట్రేషన్ సమస్యలు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, సింగరేణి పరివాహక ప్రాంతాలకు సంబంధించిన జీవో-76 అంశంపై కూడా ప్రభుత్వం సానుకూలంగా పరిశీలన జరుపుతోందని, త్వరలోనే దీనిపై స్పష్టత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పాల్వంచ పారిశ్రామిక ప్రాధాన్యతను మరింత పెంచేందుకు కాలుష్య రహిత పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కొత్తగూడెం పరిసర ప్రాంతంలో విమానాశయం ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని చెప్పారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేపట్టడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని, రైతులకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్హ కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డుల జారీ వంటి హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ గృహాల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నామని, మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్‌కు అదనంగా మరో లక్ష ఇళ్లను మంజూరు చేసి మొత్తం సుమారు 8 లక్షల ఇళ్లకు ఆమో దం తెలిపినట్లు చెప్పారు. ఇప్పటికే లక్షన్నర ఇళ్లు పూర్త య్యాయని, మరో రెండు లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మా ణంలో ఉన్నాయని అన్నారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ గురుకుల, ఆశ్రమ విద్యా సంస్థల్లో డైట్ ఛార్జీలను పెంచడంతో పాటు రాష్ట్రంలో పార దర్శకంగా సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు.

కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న అభివృద్ధి పనులు ఇప్పుడు వేగంగా అమలవుతున్నాయని అన్నారు. కొత్తగూడెం-పాల్వంచ బైపాస్ రహదారి నిర్మాణం, యూనివర్సిటీ అభివృద్ధి, అంతర్జాతీయ స్థాయి స్టేడియం ఏర్పాటు, పాల్వంచలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం, మెడికల్ కాలేజీ, ఎస్పీ కార్యాలయం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పేరును 'కొత్తగూడెం-పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్'గా మార్చే ప్రతిపాదనపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని పేర్కొన్నారు. జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ మంజూరు చేయడం పట్ల ముఖ్య మంత్రి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, స్థానిక సంస్థలకు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్టీవో మధు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370